

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 16
సంచిక: 94

ఆదివారం 25-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వైరల్

జాన్వీ కపూర్ సమర్పించు... గోచుజాంగ్




జాన్వీ కపూర్ ఫేవరెట్ ఫుడ్... గోచుజాంగ్. ఈ కొరియన్ ఫుడ్ గురించి ఒక యూట్యూబ్ వీడియోలో చవులూరించేలా మాట్లాడింది. లాక్‌డౌన్ టైమ్‌లో బోలెడు కుకింగ్ వీడియోలు, ట్రావెల్ వీడియోలు చూసింది జాన్వీ. క్విక్ నూడుల్స్ 'గోచుజాంగ్' తనను బాగా ఆకట్టుకుంది. అట్టే శ్రమ పడకుండా క్విక్‌గా ఈ నూడుల్స్‌ను తయారు చేయవచ్చు. రకరకాల ప్రోటీన్లు జత చేసి గోచుజాంగ్‌కు తనదైన హెల్తీ ట్విస్ట్ ఇచ్చింది జాన్వీ. ఈ వంటకం పుట్టుపుర్వోత్తరాలతో పాటు, ఎలా చేయాలి? ఏం వాడాలి... మొదలైన వివరాలు తెలుసుకోవడానికి జాన్వీ అభిమానులతో పాటు భోజన అభిమానులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

రాజాధి రాజ... రాజ గంభీర... విరాట్ మహారాజా



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ పాపులర్ అయిన తరువాత ఆర్టిస్ట్‌లకు కంటినిండా పనిదొరికింది.

తమ క్రియేటివిటీకి ఏఐ ఆర్ట్‌ను జత చేస్తూ ఎన్నో ఆశ్చర్యాలను ఆవిష్కరిస్తున్నారు.

తాజాగా డిజిటల్ క్రియేటర్ షాహిద్ సృష్టించిన విరాట్ కోహ్లీ 'దశావతారం' ఏఐ ఇమేజీలు వైరల్ అవుతున్నాయి.

కామెంట్ సెక్షన్‌లో బోలెడు 'హార్ట్' ఇమోజీలు కనిపిస్తున్నాయి.

ఆస్ట్రోనాట్, ఫుట్‌బాల్ ప్లేయర్, డాక్టర్, మ్యూజిషియన్, సోల్జర్, ఫైటర్ పైలట్, పోలీస్, మహారాజా... ఇలా రకరకాల గెటప్‌లలో విరాట్ కనిపిస్తాడు.

'ఇంతకీ విరాట్ ఏ గెటప్‌లో బాగున్నాడు?' అనే విషయానికి వస్తే....

నెటిజనులలో అత్యధికులు 'మహారాజా' గెటప్‌కు ఓటు వేశారు.

అందులో అలా... ఇప్పుడు ఇలా

సముద్రగర్భంలో టైటానిక్ శిథిలాలను చూడడానికి 'టైటాన్' అనే జలాంతర్గామిలో వెళ్లిన అయిదుగురు సాహసికుల ప్రయాణం విషాదాంతం అయిన నేపథ్యంలో యానిమేటెడ్ సిట్కాం 'ది సింప్సన్' లోని చిత్రాలు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. దీనికి కారణం...

2006లో వచ్చిన 'ది సింప్సన్' సీజన్ 17లోని పదో ఎపిసోడ్‌లో హీరో హోమర్ సింప్సన్ తన తండ్రి మాసన్‌తో కలిసి జలాంతర్గామిలో సముద్రగర్భంలోకి వెళతాడు. ఒకచోట నిధులతో కూడిన శిథిలమైన నావ కనిపిస్తుంది. ఆ తరువాత వీరి జలాంతర్గామి పగడపు దిబ్బల మధ్యలో చిక్కుకు పోతుంది. మరోవైపు జలాంతర్గామిలో 'లో ఆక్సిజన్' సైన్ ఫ్లాష్ అవుతుంటుంది. ఈ





ప్రమాదం నుంచి అదృష్టవశాత్తు తండ్రీకొడుకులు బయటపడతారు.

'ది సింప్సన్స్'లోని తండ్రీకొడుకులు మాసన్, హోమర్ సింప్సన్‌లను, టైటాన్‌లో ప్రయాణించిన తండ్రీకొడుకులు షెహ్‌జాదా దావూద్, సులేమాన్ దావూద్‌లతో పోల్చి నెటిజనులు పోస్ట్‌లు పెడుతున్నారు.

'ది సింప్సన్' రచయిత మైక్ రీస్ టైటానిక్ శిథిలాలను చూడడానికి గత సంవత్సరం భార్యతో కలిసి సముద్ర గర్భంలోకి వెళ్లివచ్చాడు. వారు ప్రయాణించిన జలాంతర్గామిలో కొద్ది సమయం పాటు కమ్యూనికేషన్ సమస్యలు వచ్చినా ఆ తరువాత సర్దుకుంది.

పెళ్లికూతురు గారి రోలర్ స్కేట్స్ డ్యాన్స్

'పెళ్లి కూతురు డ్యాన్స్' అనేది మనకు కొత్తేమీ కాదు. అయితే అస్సాంకు చెందిన అమ్రిన్ ఖురానా ఒక అడుగు ముందుకు వేసి రోలర్ స్కేట్స్ ధరించి చేసిన డ్యాన్స్ వీడియో వైరల్ అయింది. 'బార్ బార్ దేఖో' సినిమా లోని 'ఆస్మాన్' పాటకు ఆమె చేసిన డ్యాన్స్‌కు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆల్ ఎబౌట్ డ్యాన్స్' అనే డ్యాన్స్ స్కూల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో తక్కువ టైమ్‌లోనే 1.7 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'మైండ్ బ్లోయింగ్' 'ఎనర్జీ ప్యాక్‌డ్ డ్యాన్స్' 'బ్రైడ్ ఆన్ వీల్స్'... ఇలాంటి కామెంట్స్ మాట ఎలా ఉన్నా 'పెళ్లి సమయంలో ఇలాంటి ప్రయోగాలు చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవడం ఎందుకు!' అని మందలించిన వారు కూడా ఉన్నారు.



పాపం పసివాడు



స్కూల్‌కు వెళ్లాల్సిన పిల్లలు ఎర్రటి ఎండలో రోడ్డు పక్కన, ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర బెలూన్లు అమ్ముకోవడం కోసం పడే కష్టం చూస్తుంటే మనసు చివుక్కుమంటుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో....

ఒక పిల్లాడు కీచైన్‌లు అమ్మడం కోసం ఫుట్‌పాత్‌పై కూర్చున్నాడు. కాలికి అయిన గాయానికి ప్లాస్టిక్ పేపర్ చుట్టుకున్నాడు. సాక్షి అనే యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో 7.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'అయ్యయ్యో' అని సానుభూతి చూపుతున్న వాళ్లతో పాటు...

'పిల్లాడి తల్లిదండ్రుల తప్పా? వ్యవస్థ తప్పా?' అని ప్రశ్నించేవాళ్లు....

'ఆ పిల్లాడికి నా వంతుగా సహాయం చేస్తాను' అని ముందుకు వస్తున్నవారు ఎందరో ఉన్నారు.

మన జాతీయగీతం మిల్బన్ నోట



వాషింగ్టన్ డీసీలోని రోనాల్డ్ రీగన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన మన ప్రధాని మోదీ అమెరికా పర్యటన ముగింపు కార్యక్రమంలో ఆఫ్రికన్-అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బన్ ఆలపించిన మన జాతీయగీతం 'జనగణమన' వీడియో వైరల్‌గా మారింది.

'అద్భుతం' అంటున్నారు నెటిజనులు.

'భారతీయులు నన్ను తమ కుటుంబసభ్యుల్లో ఒకరిగా ప్రేమిస్తారు' అంటున్న మిల్బన్ మన ప్రధానికి పాదాభివందనం చేసింది.

మన జాతీయగీతం మాత్రమే కాదు 'ఓమ్ జై జగదీష్ హరే' భక్తిగీతాన్ని కూడా అద్భుతంగా ఆలపిస్తుంది మిల్బన్.



హెల్త్

రక్తనాళాలు బ్లాక్ కాకుండానే హార్ట్ అటాక్! మినోకా!

గుండెకు రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలు మూసుకుపోయాయనీ, అందుకే హార్ట్ అటాక్ వచ్చిందనే మాట తరచూ వినేదే. కానీ కొన్ని హార్ట్ అటాక్స్... ప్రధాన ధమనులు మూసుకుపోనప్పటికీ, అంటే అవి నార్మల్‌గా ఉన్నప్పటికీ వస్తుంటాయి. అలాంటి హార్ట్ అటాక్స్‌నే మినోకా (మయో కార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ విత్ నాన్ అబ్‌స్ట్రక్టివ్ కరొనరీ ఆర్టరీస్) అంటారు. ఈమధ్య వస్తున్న గుండెపోట్లలో మినోకా తరహావి పెరుగుతున్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో 'మినోకా' హార్ట్ అటాక్స్ గురించి అవగాహన కల్పించేదే ఈ కథనం.

వయసు పెరుగుతున్న కొద్దీ గుండెకు రక్తాన్ని అందించే ప్రధాన రక్తనాళాల (ధమనుల)లో కొవ్వులు (ప్లాక్స్) పేరుకుపోవడం సహజం. ఈ ప్లాక్స్ క్రమంగా పెరుగుతూ బ్లాక్స్‌లా గుండెపోటుకు దారితీస్తాయి. అయితే సుమారు 6 నుంచి 10 శాతం మంది గుండెపోటు వచ్చిన వారి యాంజియోగ్రామ్‌లో బ్లాక్స్ ఏవీ కనిపించకపోవడం కార్డియాలజిస్టులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. మరి వాళ్లకు గుండెపోటు ఎందుకు వస్తోందనే విషయాన్ని మరింత లోతుగా పరిశీలించినప్పుడు అబ్బురం కలిగించే విషయాలు తెలిశాయి. గుండె రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ ప్లాక్స్ లేనప్పటికీ కొన్నిసార్లు గుండె కండరం దెబ్బతినవచ్చు. ఇలా గుండెకండరం దెబ్బ తినడం వల్ల, రక్తనాళాల బ్లాక్స్‌తో సంబంధం లేకుండా వచ్చే గుండెపోటునే 'మినోకా' అంటారు.

ఎవరిలో ఎక్కువ?

పురుషులతో పోలిస్తే మినోకా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తోంది. అలాగే కాస్త వయసు తక్కువ వాళ్లలోనూ మినోకా వచ్చే అవకాశం ఎక్కువ. పొగతాగే అలవాటు ఉన్నవారిలోనూ మినోకా వచ్చే అవకాశాలెక్కువ.

లక్షణాలు : సాధారణ గుండెపోటు లక్షణాలే ఇందులోనూ కనిపిస్తాయి. అంటే శ్వాస అందకపోవడం, ఆయాసపడటం, ఛాతీపై నొప్పి, ఎడమ భుజం, వీపులో ఎడమవైపు నొప్పి, ఎడమ దవడలోనూ నొప్పి కనిపించడం, చెమటలు పట్టడం వంటివి.

మినోకాకు కారణాలు...

మినోకాకు అనేక అంశాలు దోహదపడుతుంటాయి. వాటిల్లో ప్రధానమైనవి...

1. గుండె రక్తనాళాలు తాత్కాలికంగా కుంచించుకుపోవడం: ఈ కండిషన్‌ను 'కరోనరి స్పాసమ్' అని పిలుస్తారు. సిరల గోడల్లో కండరం ఉండదు. కానీ ధమనుల గోడలు కండరంతో నిర్మితమై ఉంటాయి. ధమని కండరం సంకోచించి అలాగే ఉండిపోతే గుండె కండరం దెబ్బ తింటుంది. మహిళల్లో కరోనరీ స్పాసమ్ ఎక్కువ. అందుకే ఈ గుండెపోటుకు అవకాశాలూ ఎక్కువే.

2. ప్లాకులలో పగుళ్ల (ఎరోషన్స్)తో: వయసు పెరుగుతున్న కొద్దీ రక్తనాళాల్లో ప్లాకులేర్పడుతూ ఉంటాయి. ఈ ప్లాకులపై ఎరోషన్స్) వల్ల కూడా కొన్నిసార్లు గుండెపోటు రావచ్చు.

3. మైక్రోవాస్కులర్ డిస్‌ఫంక్షన్: గుండె తాలూకు మూడు ప్రధాన రక్తనాళాలు... పోను పోను మరింత చిన్న రక్తనాళాలుగా మారి గుండె కండరానికి రక్తాన్ని సరఫరా చేస్తాయి. వీటిల్లో అడ్డంకులతో వచ్చిన గుండెపోటునూ 'మినోకా'గానే పరిగణిస్తారు. ఇలా సూక్ష్మ రక్తనాళాల్లో వచ్చే జబ్బునే మైక్రో వాస్కులర్ డిస్ ఫంక్షన్ అంటారు.

4. కరోనరీ ఎంబాలిజం: దేహంలో వేరేచోట ఏర్పడిన రక్తం గడ్డలు గుండె రక్తనాళాల్లో అడ్డంకిగా మారి గుండెపోటుని కలిగించవచ్చు. దీన్ని కరోనరీ ఎంబాలిజం అంటారు.

5. రక్తనాళాల్లో ఎలాంటి తేడాలూ లేకుండా గుండె కండరం దెబ్బ తినటం: కొన్నిసారు గుండె రక్తనాళాల్లో ఏమాత్రం తేడాలు లేకపోయినా మినోకా రావచ్చు.

అవసరమైన వైద్య పరీక్షలు...

గుండెపోటు లక్షణాలు కనిపించగానే తొలుత ఈసీజీ, ఎకో, ఆ తర్వాత ట్రోపానిన్ అనే పరీక్షలు చేస్తారు. లక్షణాలతో పాటు ఈ పరీక్షల ఫలితాలను బట్టి గుండెపోటును నిర్ధారణ చేస్తారు. నిజానికి గుండెపోటు నిర్ధారణకు యాంజియోగ్రామ్ అవసరం ఉండదు. కానీ ఏ తరహా చికిత్స అవలంబించాలనే అంశానికి యాంజియోగ్రామ్ సహాయపడుతుంది. మినోకా ఉన్న వారిలో గుండెపోటు వచ్చినట్లు అన్ని ఆధారాలూ ఉంటాయి కానీ, యాంజియోగ్రామ్ చేసినప్పుడు అందులో బ్లాక్స్ కనిపించవు. కాబట్టి వీళ్లలో స్టెంట్ వేసే అవకాశం ఉండదు.

మినోకా నివారణ ఎలా?

మినోకా నివారణకు ప్రత్యేకమైన చర్యలేమీ లేనప్పటికీ మామూలు గుండెజబ్బు నివారణ తీసుకునే జాగ్రత్తలే మినోకానూ నివారిస్తాయి. సమతులాహారం, వ్యాయామం, పొగాకు, మద్యానికి దూరంగా ఉండటం, స్ట్రెస్ తగ్గించుకోవడం, మంచి నిద్ర, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవడం. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఉంటే... మిగతా గుండె జబ్బులు లాగానే మినోకానూ నివారించేందుకూ, కొంతమేర ముందుగా పసికట్టేందుకు అవకాశం ఉంటుంది.



డాక్టర్
ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

సాధారణ గుండెపోటుకి, మినోకా గుండెపోటుకీ తేడా ఏమిటి?

మినోకా వచ్చిన వారిలో యాంజియోగ్రామ్ చేశాక... డాక్టర్లకు బాధితుల్లో బ్లాక్స్ ఏవీ పెద్దగా కనిపించవు. ఈ విషయాన్ని వాళ్లకు చెప్పినప్పుడు వారు సంతోషిస్తారు. కానీ ముఖ్యమైన విషయం ఏమిటంటే... మినోకా కూడా గుండెపోటే. గుండెపోటులో ఏ దుష్పరిణామాలు ఉంటాయో మినోకాలోనూ అవే ఉంటాయి. అంటే... గుండె పంపింగ్ తగ్గడం, ఆకస్మికంగా మరణం సంభవించడం వంటివి.



మినోకాని గుర్తించాక...?

మినోకాని గుర్తించాక దానికి కారణాలని అన్వేషించడం తప్పనిసరి. ఇందుకు ఇంట్రా-కరోనరీ ఇమేజింగ్ ప్రధాన భూమిక నిర్వర్తిస్తుంది. ఇంట్రాకరోనరీ ఇమేజింగ్ అంటే గుండె రక్తనాళాల్లోనికి చిన్న కెమెరా వంటి సాధనాన్ని పంపి గుండె రక్తనాళం గోడని నిశితంగా పరిశీలించటం. ఇంట్రావాస్కులర్ అల్ట్రా సౌండ్, ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ అనే రెండు రకాల పరీక్షల్లో దేని ద్వారానైనా మినోకాకు కారణాన్ని కొంతమేరకు తెలుసుకోవచ్చు. మినోకా వచ్చాక చేయాల్సిన పరీక్షల్లో కార్డియాక్ ఎమ్మారై కూడా ముఖ్యమైనది.

చికిత్స...

మినోకాకు నిర్దిష్టంగా ఒక ప్రత్యేకమైన కారణం లేనందున చికిత్స కూడా నిర్దిష్టంగా ఉండదు. మినోకాకి రకరకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కారణాన్ని బట్టి చికిత్స ఉంటుంది. కరోనరి స్పాసమ్ వల్ల వచ్చే మినోకాలో క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్, నైట్రేట్స్ అనే మందులు వాడటం ముఖ్యం. అన్ని రకాల మినోకాలలోనూ రక్తాన్ని పలుచబార్చే మందులు వాడటం తప్పనిసరి అయినప్పటికీ కరోనరీ ఎంబాలిజం వల్ల వచ్చే మినోకాలో బాగా ఎక్కువ శక్తివంతమైన బ్లడ్ థిన్నర్స్ వాడాల్సి ఉంటుంది. మినోకాలోనూ... సాధారణ గుండెపోటు వచ్చిన వాళ్లలోలాగే గుండె పంపింగ్ బలహీనపడే అవకాశం ఉంటుంది. అప్పుడు గుండెలో బలం నింపడానికి ఔషధాల్ని వాడాలి. వీటిలో బీటా బ్లాకర్లు, ఏస్ ఇన్‌హిబిటార్స్, స్టాటిన్స్ వంటివీ ఉంటాయి.

మెడి టిప్

ఆస్టియోపోరోసిస్ కేసులు భారతీయుల్లో చాలా ఎక్కువ. అందునా మహిళల్లో! యాభై ఏళ్లు దాటాక మహిళల్లో దాదాపు 40% నుంచి 50% మందిలో ఇది కనిపించడం చాలా సాధారణం. దీన్ని బట్టే మన దేశంలో దాని తీవ్రత ఎంత తీవ్రమో అర్థం చేసుకోవచ్చు. మెనోపాజ్ దాటాక కనీసం 40% మందిలో ఇది కనిపిస్తుంది. ఆస్టియోపోరోసిస్ వచ్చిన మహిళల్లో మూడింట ఒక వంతు మందికి ఏదో ఒక దశలో తుంటి ఎముక ఫ్రాక్చర్ అయిన కేసులు కనిపిస్తాయి. కొన్ని ఆల్ఫాబెట్స్ సాయంతో ఆస్టియోపోరోసిస్‌ను తేలిగ్గా నివారించుకోవచ్చు.

కొన్ని ఆల్ఫాబెట్స్‌తో ఆస్టియోపోరోసిస్ నివారణ ఇలా!

సీ, డీ, ఈ, ఎఫ్, జీ...లతో నివారణ ఎలాగంటే...?



ఆస్టియోపోరోసిస్ నివారణ కోసం అవసరమైన ప్రాథమిక అంశాలను చాలా సులభంగా గుర్తు పెట్టుకోవచ్చు. ఇంగ్లిష్ అక్షరాలు వరుసగా సీ.డీ.ఈ.ఎఫ్.జీ గుర్తు పెట్టుకుంటే, వాటిని బట్టి ఏంచేయాలో సులువుగా తెలుస్తుంది.

'సి' ఫర్ క్యాల్షియమ్ – దీన్ని ఎక్కువగా తీసుకోవాలి.

'డి' ఫర్ విటమిన్ డి – తగినంత అందేలా చూడాలి.

'ఈ' ఫర్ ఎక్సర్‌సైజ్ – శరీరాన్ని కాస్తంత శ్రమపెట్టి ఎక్సర్‌సైజ్ చేయించాలి.

'ఎఫ్' ఫర్ 'ఫాల్స్'-ఇంగ్లిష్‌లో పడిపోవడం. కాస్తంత వయసు పైబడ్డాక బాత్‌రూమ్‌ల వంటి చోట్ల, ఇతరత్రా కింద పడిపోకుండా జాగ్రత్తగా ఉండాలి.

'జి' ఫర్ గెయిన్ వెయిట్ – ఒకవేళ మరీ అండర్ వెయిట్ ఉంటే ఎత్తుకు తగినట్లుగా బరువు పెరగాలి. బరువు ఎక్కువ ఉంటే తగ్గాలి.

చిన్నారులూ... కిడ్నీలో రాళ్లు...!

పెద్ద వాళ్లతో పోలిస్తే చిన్న పిల్లల మూత్ర పిండాల్లో రాళ్లు రావడం అంతే సాధారణం కాదు గానీ... అరుదు మాత్రం కాదు. గణాంకాల ప్రకారం పదహారేళ్లలోపు వారిలో 5 నుంచి 6 శాతం మంది పిల్లల్లో కిడ్నీలో రాళ్లు వస్తుంటాయి. కిడ్నీల్లో రాళ్లు వచ్చే కండిషన్‌ను 'నెఫ్రోలిథియాసిస్' అంటారు.



కారణాలు: పిల్లల కిడ్నీల్లో రాళ్ల తయారు కావడానికి అనేక కారణాలున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి...

- ఆహారంలో రాళ్లను కల్పించే రసాయన గుణాలు ఉండటంతో పాటు కొంత వరకు వాతావరణం, ఆర్థిక-సామాజిక పరిస్థితులు. (పేదవర్గాల్లో కలుషితాహారం తీసుకునే ఆర్థిక సామాజిక పరిస్థితులు మూత్రపిండాల్లో రాళ్లకు దారితీసే అవకాశాలు ఎక్కువ. వారు తీసుకునే ఆహారాలను బట్టి అవి క్యాల్షియం కార్బొనేట్, ఆక్సలేట్స్, ఫాస్ఫరస్, యూరిక్ యాసిడ్, స్ట్రువైట్ స్టోన్, సిస్టీన్ వంటి రాళ్లను ఏర్పరవచ్చు. వాటిని బట్టి ఫలానా ఆహారనియంత్రణ పాటించాలంటూ డాక్టర్లు సూచిస్తుంటారు).
- పిల్లల్లో తరచూ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ వస్తున్న సందర్భాల్లో మూత్రపిండాల్లో రాళ్లకు దారితీయవచ్చు.
- కొందరిలో ఎండోక్రైనల్ సమస్యలు
- కొన్ని జన్యుపరమైన అంశాలు
- కిడ్నీలో రాళ్లు కనిపించిన పిల్లల్లో మెటబాలిక్ డిజార్డర్స్ ఏవైనా ఉన్నాయా అని కూడా డాక్టర్లు అన్వేషిస్తారు.

లక్షణాలు: ● జ్వరం ● తీవ్రమైన కడుపు నొప్పి, తీవ్రమైన నడుము నొప్పి ● మూత్రంలో రక్తం కనిపించడం ● వాంతులు ● కొన్ని సందర్భాల్లో ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు కూడా.

నిర్ధారణ : ● కొన్ని రొటీన్ మూత్రపరీక్షలు, ● రీనల్ ఫంక్షన్ టెస్ట్, ● రీనల్ స్కాన్ ● కొన్ని మెటబాలిక్ పరీక్షలు చేయించడం అవసరం.


(రీనల్ స్కాన్స్, మెటబాలిక్ పరీక్షల సహాయంతో రాయి తాలూకు రసాయన స్వభావం తెలుసుకుంటారు. దాని పైనే చికిత్స ఆధారపడి ఉంటుంది.

జాగ్రత్తలు / చికిత్స: కిడ్నీల్లో స్టోన్స్ వచ్చేందుకు అవకాశం ఉన్న పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగడం; పొటాషియమ్ ఎక్కువగా ఉండే ద్రవాహారాల్ని తీసుకోవడం; కొవ్వులు ఎక్కువగానూ, పిండి పదార్థాలు తక్కువగా ఉంటే ఆహారాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తక్కువగా తీసుకోవాలి. పిల్లల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ ఉంటే వెంటనే చికిత్స చేయించాలి. చాక్లెట్ల వంటి వాటిని తగ్గించాలి. ఉప్పు తక్కువగా తీసుకోవాలి. అలాగే ఉప్పు మోతాదు ఎక్కువగా ఉండే చిప్స్, పచ్చళ్ల వంటి ఆహారాలకు దూరంగా ఉండాలి. పాల ఉత్పాదనలు, మాంసాహారం, చీజ్ వంటి ఆహారాలను తగ్గించాలి.

చికిత్స : ఈ రాయి పరిమాణం చాలా చిన్నదిగా ఉంటే దానంతట అదే మూత్రంతో పాటు పడిపోతుంది. ఒకవేళ రాయి పరిమాణం పెద్దదిగా ఉండి, దేనికైనా అడ్డుపడుతుంటే షార్ట్‌వేవ్ లిథోట్రిప్సీ వంటి ఆధునిక పద్ధతులతో రాయిని పొడిపొడి అయ్యేలా బ్లాస్ట్ చేయడం, అదీ కుదరనప్పుడు చివరగా యూరాలజిస్ట్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స అవసరమవుతుంది.



డాక్టర్
వి. చంద్రమోహన్,
సీనియర్
యూరో సర్జన్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 94

SUNDAY Special | ఆదివారం 25-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలి

మణిపూర్‌లో పరిస్థితులపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అఖిలపక్ష భేటీ నిర్వహించింది.

- వివరాలు 6లో



సెమీఫైనల్లో భారత్

'శాఫ్' ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో 2–0తో నేపాల్‌పై విజయం. భారత్ తరఫున ఛెత్రి 61వ నిమిషంలో, 70వ నిమిషంలో మహేశ్‌సింగ్ గోల్స్ సాధించారు.

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

30 నుంచి పోడు పట్టాలు



పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టా పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధమైంది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ ఈనెల 30న కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

- వివరాలు 5లో

రెండేళ్ల చిన్నారి చేతిలో పేలిన గన్.. తల్లి మృతి



బుల్లెట్లతో ఉన్న గన్‌ను ఆటబొమ్మగా భావించిన రెండేళ్ల బాలుడు.. తల్లివైపు గురిపెట్టి కాల్చాడు. అమెరికాలో చోటుచేసుకున్న ఈ ఘటనలో బాలుడి తల్లి అయిన 8 నెలల గర్భిణి ప్రాణాలు కోల్పోయింది.

- వివరాలు 6లో

ప్రజల ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశారు: భట్టి



కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశారని, బాధల తెలంగాణగా మార్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు.

- వివరాలు 11లో



రాష్ట్రమంతటికీ నైరుతి

నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చినా రాష్ట్రమంతటా వేగంగా విస్తరించాయి. దీంతో అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది.

3 లో

ఇదండీ సంగతి



ఈ పరిస్థితి మనకు అనుకూలం కావాలి

'చేతి'కి చిక్కొద్దు!



మీడియాతో మాట్లాడుతున్న ఈటల, రాజగోపాల్‌రెడ్డి

బీఆర్‌ఎస్ సర్కారుపై వ్యతిరేకతను బీజేపీకి అనుకూలంగా మలచుకోవాలి





- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల, కోమటిరెడ్డిలతో భేటీలో అమిత్ షా, జేపీ నడ్డా... అపోహలు, అసంతృప్తిని పక్కన పెట్టండి.. సంయమనంతో ఉండండి.. సర్దుబాట్లు చేస్తాం
- అర్హత, పనితీరు ఆధారంగా పదవులు అవే వస్తాయి
- పార్టీ ఎదుగుదలకు గండి కొట్టేలా ఎవరూ వ్యవహరించొద్దు
- ఎన్నికల గెలుపు వ్యూహాలు, నేతల పర్యటనలు, ప్రచారాస్త్రాలపై దిశానిర్దేశం...
- బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసిపోయాయన్న అపోహను తొలగించాలన్న ఈటల, రాజగోపాల్‌రెడ్డి

2 లో

కీలక నిర్ణయాలు తీసుకోవాలి

అధిష్టానానికి చెప్పామని ఈటల, రాజగోపాల్‌రెడ్డి వెల్లడి

తెలంగాణలో కేసీఆర్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాలంటే తక్షణమే పలు కీలక నిర్ణయాలు తీసుకోవాలని పార్టీ జాతీయ నేతలకు స్పష్టం చేసినట్టు బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. భేటీ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ''మా ఏకైక ఆశయం రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను గద్దె దింపడమే. మేం పదవుల కోసమో, లావాదేవీల కోసమో ఢిల్లీకి రాలేదు. బీజేపీ ద్వారానే కేసీఆర్ కుటుంబ పాలనకు అంతం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ముక్కుసూటిగా, నిర్మొహమాటంగా, సంకోచం లేకుండా జాతీయ నేతలకు వివరించాం. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కొన్ని కీలక నిర్ణయాలు చేయాలని కోరాం. తక్షణ కర్తవ్యాలపై మా అభిప్రాయాలను వివరించాం'' అని వెల్లడించారు. కేంద్ర నాయకత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని అమిత్ షా, నడ్డా హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు నాగర్‌కర్నూల్‌లో నవ సంకల్ప సభ



- హాజరుకానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- మధ్యాహ్నం ప్రొ. కె.నాగేశ్వర్ తదితరులతో భేటీ
- పార్టీ ముఖ్యనేతలతో సమావేశం.. ఎన్నికలకు దిశానిర్దేశం

3 లో



రష్యాలోని రోస్తోవ్ నగరంలో యుద్ధట్యాంక్‌తో పహారా కాస్తున్న వాగ్నర్ గ్రూప్ సైనికులు (ఇన్‌సెట్‌లో) ప్రిగోజిన్

సాయుధ తిరుగుబాటుకు దిగిన ప్రైవేటు సైన్యం

సంక్షోభంలో రష్యా

కిరాయి సైన్యం 'వాగ్నర్' గుప్పిట్లో రోస్తోవ్ నగరం

మధ్యవర్తిత్వంతో వెనక్కి తగ్గిన వాగ్నర్ సైన్యం

- అనూహ్య పరిణామాలతో రష్యా అంతర్గత సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఇన్నాళ్లూ ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున పోరాడిన ప్రైవేటు సైనిక సంస్థ వాగ్నర్ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. రష్యాలోని ప్రధాన నగరమైన రోస్తోవ్ దాన్ తమ ఆధీనంలోనే ఉందని వాగ్నర్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ ప్రకటించారు. అయితే, తాత్కాలిక ఒప్పందం కుదరడంతో మాస్కో దిశగా వెళ్లట్లేదని ప్రిగోజిన్ తెలిపారు.

6 లో

గర్జించిన చెఫ్

- వంటవాడి నుంచి ప్రైవేటు సైన్యం దాకా
- ప్రిగోజిన్ ప్రస్థానంలో ఎన్నో మలుపులు

- వివరాలు 6లో

చేయూతనివ్వండి

కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరీలకు కేటీఆర్ విజ్ఞప్తి



హర్దీప్‌సింగ్ పూరీతో మంత్రి కేటీఆర్

- మెట్రో రెండో దశ విస్తరణకు ఆమోదం తెలపాలి
- పారిశుధ్య ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలి
- ఈ రబీ సీజన్ ఉప్పుడు బియ్యం సేకరణను 20 లక్షల టన్నులకు పెంచాలి
- గ్రామీణ ఉపాధి హామీ తరహాలో పట్టణ పేదల కోసం ప్రత్యేక పథకం తేవాలని విజ్ఞప్తి
- అమిత్‌షాతో జరగాల్సిన భేటీ చివరి నిమిషంలో రద్దు

సాక్షి, న్యూఢిల్లీ: అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరింత ఆర్థిక చేయూతనిచ్చి తనవంతు అండగా నిలవాలని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విజ్ఞప్తి చేశారు. ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, రహదారులు, మెట్రో రైలు విస్తరణ వంటి రంగాల్లో కేంద్రం సహకారం ఇవ్వాలని, రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రగతికి తోడ్పడాలని కోరారు. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వచ్చిన మంత్రి కేటీఆర్.. శనివారం కేంద్ర ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్,

మిగతా 2వ పేజీలో ▶

భారత్‌లో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం

- అమెరికా పారిశ్రామికవేత్తలకు మోదీ పిలుపు
- ముగిసిన అమెరికా పర్యటన.. కైరోకు చేరిక



వాషింగ్టన్‌లో ఇచ్చిన విందులో కమలా హ్యారిస్‌తో మోదీ

- అమెరికా పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటనకు ఈజిప్ట్ రాజధాని కైరో చేరుకున్నారు. భారత ప్రధాని ఒకరు ఈజిప్టులో పర్యటించనుండటం 26 ఏళ్లలో ఇదే ప్రథమం. అంతకుముందు ఆయన వాషింగ్టన్‌లోని కెన్నడీ సెంటర్‌లో అమెరికా దిగ్గజ పారిశ్రామికవేత్తలు, భారతీయ సంతతి వ్యక్తులు, దాతలతో భేటీ అయ్యారు. భారత్‌లో మరింత మెరుగైన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇదే మంచి తరుణమని మోదీ వ్యాఖ్యానించారు. కాగా, గూగుల్ 10 బిలియన్ డాలర్లు, అమెజాన్.కామ్ అదనంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించాయి. శుక్రవారం అమెరికా విదేశాంగ శాఖ కార్యాలయంలో ఆ దేశ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్.. మోదీకి విందు ఇచ్చారు.

- వివరాలు 6లో

కోర్టులో 'క్లినిక్'

- దేశంలోనే తొలిసారి వరంగల్ జిల్లా కోర్టులో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్
- నేడు ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు
- భూమి, వ్యవసాయ సమస్యలపై ఉచిత న్యాయ సేవలందించడమే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా జిల్లా కోర్టులో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం కాబోతోంది. వరంగల్ జిల్లా కోర్టులో ఏర్పాటు కానున్న ఈ క్లినిక్‌ను ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ నవీన్‌రావు ప్రారంభించనున్నారు. భూమి, వ్యవసాయ సంబంధిత సమస్యలపై రైతులకు ఉచిత న్యాయ సేవలు అందించడమే ధ్యేయంగా జాతీయ, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ, లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్), నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

28 నుంచి 'మేరా పోలింగ్ బూత్ సబ్‌సే మజ్బూత్'

జూలై 3 వరకు కార్యక్రమాలు: సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'మేరా పోలింగ్ బూత్ సబ్‌సే మజ్బూత్'పేరుతో ఈనెల 28 నుంచి జూలై 3 వరకు పార్టీ కార్యకర్తలతో బీజేపీ పలు కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందులోభాగంగా రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పోలింగ్‌బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ప్రముఖ్‌గా, సభ్యులుగా బద్దం మహిపాల్ రెడ్డి, నరేందర్, డా.మాలతి, యశ్‌పాల్ గౌడ్, క్రాంతికుమార్ నియమితులయ్యారని ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ పోలింగ్‌బూత్‌లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ పార్టీ కార్యకర్తలనుద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మండల, పోలింగ్ బూత్‌ల స్థాయిలో ప్రజలు వీక్షించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నాడు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించిన చీకటిరోజులను గుర్తుచేసుకుంటూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఎమర్జెన్సీ బ్లాక్‌డేను నిర్వహించాలని కోరారు. సమావేశంలో పార్టీనేతలు యెండల లక్ష్మీనారాయణ, యన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

గల్లీలో సిగపట్లు.. ఢిల్లీలో కౌగిలింతలు

ఎంతదాచినా దాగని బీఆర్ఎస్, బీజేపీల మైత్రి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీలు గల్లీలో సిగపట్లు పడి ఢిల్లీలో కౌగిలించుకుంటున్నాయని వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీల అక్రమమైత్రి ఎంతదాచినా దాగదని శనివారం ఆమె ట్విట్టర్ వేదికగా విమర్శించారు. బీజేపీపై సీఎం కేసీఆర్ తీరు సరిగా లేదని బిహార్ సీఎం నితీశ్ కుమార్ చెప్పేశారని, మరోవైపు శరద్ పవార్ అయితే ఏకంగా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్నారని...ఇంకానా మీ నాటకాలని షర్మిల ప్రశ్నించారు. బిహార్లో జరిగిన బీజేపీయేతర పక్షాల సమావేశానికి బీఆర్ఎస్‌కు ఎందుకు ఆహ్వానం అందలేదో సమాధానం చెప్పగలరా అని నిలదీశారు. తమిళనాడు మాజీ మంత్రిని రాక్షసంగా ఎలా అరెస్టు చేశారో దేశమంతా చూసిందని, అదే తెలంగాణ మంత్రుల మీద ఈడీ దాడులుంటాయి కానీ అరెస్టులు ఉండవని...బీజేపీ బీఆర్ఎస్ మైత్రికి ఇంతకంటే సాక్ష్యాలు అవసరం లేదని చెప్పారు. కాళేశ్వరం మీద తాను నిరంతరం పోరాటం చేస్తున్నా.. బీజేపీ మంత్రులు పనికిమాలిన ప్రకటనలు చేస్తారు తప్ప చర్యలుండవన్నారు.

ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించండి

మణిపూర్ అఖిలపక్ష భేటీలో బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్



సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్‌లో తక్షణమే ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మణిపూర్ అల్లర్లపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ తరఫున వినోద్ కుమార్ పాల్గొన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇంకా కులాలు, మతాలు, జాతుల మధ్య ఘర్షణలు జరగడం దురదృష్టకరమన్నారు. మణిపూర్ ప్రజలకు అన్ని రాజకీయ పార్టీలు భరోసా, ధైర్యం కల్పించే బాధ్యత ఉందని అఖిలపక్ష సమావేశంలో చెప్పామని పేర్కొన్నారు. మణిపూర్‌లో ప్రస్తుతం వర్షాకాలం వస్తోందని, రెండు నెలలు విపరీతమైన వర్షాలు ఉంటాయన్నారు. ఘర్షణల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసం అయ్యాయని, వేలాది మంది నిర్వాసితులయ్యారని, కేంద్రం వెంటనే వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 50 రోజులపాటు ఇంటర్నెట్ నిషేధించడం మంచిదికాదని, విద్యార్థులు, యువత, ఇతర సేవలకు అంతరాయం కలుగుతుందని అఖిలపక్ష సమావేశంలో చెప్పామన్నారు.

ఉత్తమ్, జానా, జగ్గారెడ్డిలపై దుష్ప్రచారం


కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే కుట్ర జరుగుతోంది: మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి ప్రారంభమైందని, ఎవరి నోట విన్నా కాంగ్రెస్ పార్టీ మాటే వినిపిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత రావు అన్నారు. అధికార బీఆర్ఎస్‌కు గడ్డు కాలం వస్తున్నందునే తమ పార్టీని దెబ్బ తీసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకే ఉత్తమ్, జానా, జగ్గారెడ్డిలపై దుష్ప్రచారం మొదలుపెట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌టీపీ నాయకురాలు షర్మిల పార్టీలోకి వస్తారో రారో తనకు తెలియదన్నారు.

రైతు కుటుంబాల సగటు ఆదాయం

రూ. 10,084

నాబార్డు అధ్యయనంలో వెల్లడి



- సన్న చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీల ఆదాయం తక్కువే
- వ్యవసాయానికి దూరమవుతున్న కొత్త తరం
- వ్యవసాయం లాభసాటి కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మూడో స్థానంలో తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: దేశంలో రైతు కుటుంబాల నెలవారీ సగటు ఆదాయం రూ.10,084 అని నాబార్డు తేల్చింది. 2012–13లో ఇది రూ.6,426 కాగా, 2018–19 నాటికి రూ.10,084కు పెరిగిందని తెలిపింది. అయితే సన్న చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతుల ఆదాయం మాత్రం అంతగా లేదని పేర్కొంది. ఈ మేరకు పరిశోధనాత్మక అధ్యయన నివేదికను తాజాగా విడుదల చేసింది. పంటలు, పశు సంపద, వ్యవసాయేతర వ్యాపారం వంటి అంశాలను కూడా అధ్యయనంలో పరిశీలించారు. 'మొత్తంగా పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయం వాటా 38 శాతం కాగా, పశు సంపద ద్వారా వచ్చే ఆదాయం వాటా 16 శాతంగా ఉంది. వ్యవసాయేతర రంగాల ద్వారా కూడా ఆదాయం సమకూరుతోంది. కాగా వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిన పంజాబ్, హరియాణాతో పాటు జార్ఖండ్, బిహార్, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రైతుల నెలవారీ ఆదాయం అత్యధికంగా ఉంది. భూ పరిమాణం పెరిగినప్పుడు, వ్యవసాయ కార్యకలాపాల (పంటల ఉత్పత్తి, జంతువుల పెంపకం) ద్వారా రైతు కుటుంబాల ఆదాయం పెరుగుతోంది. పెద్ద రైతులకు అంటే 25 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న రైతులకు వ్యవసాయ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 91 శాతం, కాగా చిన్న సన్నకారు రైతులకు ఇలా వచ్చే ఆదాయం కేవలం 28 శాతమే. ఈ విధంగా రైతు భూపరిమాణాన్ని బట్టి ఆదాయంలో వ్యత్యాసాలు ఉన్నాయి. ఓబీసీ, ఇతర వర్గాల ఆదాయంతో పోలిస్తే, ఎస్సీ, ఎస్టీ రైతు కుటుంబాల ఆదాయం తక్కువగా ఉంది..'అని నాబార్డు నివేదిక వెల్లడించింది.

భవిష్యత్ తరాలు వ్యవసాయానికి దూరం

'భవిష్యత్ తరాలు వ్యవసాయం వైపు మొగ్గు చూపడం లేదు. 63 శాతం మంది రైతులు తమ భవిష్యత్ తరం వ్యవసాయంలో ఉండాలని కోరుకోవడం లేదు. వ్యవసాయం లాభసాటి వృత్తి కాదని భావిస్తున్నారు. అందుకే కొత్త తరం వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయం చేయడం రిస్క్‌గా వారు భావిస్తున్నారు. వ్యవసాయ భూపరిమాణం తగ్గడం, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటివి ఇందుకు కారణాలుగా ఉన్నాయి. అలాగే వ్యవసాయానికి కీలకమైన కూలీల కొరత కూడా అనాసక్తికి కారణంగా ఉంది. మరోవైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, మార్కెట్లో అనిశ్చిత పరిస్థితి కూడా భవిష్యత్ తరం వ్యవసాయానికి దూరంగా ఉండటానికి కారణంగా కన్పిస్తోంది. వ్యవసాయంలో సరైన ఆదాయం రాకపోవడంతో, మెరుగైన భవిష్యత్తు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయి. అంతేకాదు గౌరవం, సామాజిక హోదా కూడా ఉండటం లేదు..'అని పేర్కొంది.

లాభదాయకం కాదనే భావన..

'వ్యవసాయం లాభదాయకం కాదని రైతులు భావిస్తున్నారు. మార్కెటింగ్ సహా పటిష్టమైన సేకరణ వ్యవస్థ లేకపోవడం, మద్దతు ధరలు సరిగా లేకపోవడంతో వ్యవసాయంపై అనాసక్తి చూపిస్తున్నారు. 62 శాతం మంది రైతులు ఇప్పటికీ తక్కువ ధరకు స్థానిక విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు. 50 ఏళ్ల వయస్సున్న రైతుల్లో 70 శాతం మంది వరి సాగును కొనసాగిస్తున్నందున పంటల సాగులో వైవిధ్యం ఉండటం లేదు. కూరగాయలు, పండ్ల సాగు ద్వారా రైతుల్లో ఆదాయ ఉత్పత్తి గత 30 సంవత్సరాలలో తక్కువగా ఉంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది..'అని నాబార్డు తెలిపింది.

భూముల పరిమాణం ఆధారంగా రైతు కుటుంబాల ఆదాయం (రూపాయల్లో)	ఎకరాలోపు	ఎకరా నుంచి 2.5 ఎకరాలు	2.5 ఎకరాల నుంచి 5 ఎకరాలు	5 ఎకరాల నుంచి 10 ఎకరాలు	10 ఎకరాల నుంచి 25 ఎకరాలు	25 ఎకరాలకు పైగా
	7,522	8,571	11,449	16,435	28,292	60,758

సరాసరి : 10,084

'చేతి'కి చిక్కొద్దు!

బీఆర్ఎస్ సర్కారుపై వ్యతిరేకతను బీజేపీకి అనుకూలంగా మలచుకోవాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల, కోమటిరెడ్డిలతో భేటీలో అమిత్‌షా, జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అంతా సమష్టిగా కృషి చేసి పార్టీ గెలుపునకు బాటలు వేయాలని తెలంగాణ బీజేపీ నేతలకు పార్టీ అధిష్టానం మార్గనిర్దేశం చేసింది. ముఖ్య నేతల మధ్య గ్రూపులు, వర్గాల తగాదాలు, పాత–కొత్త పంచాయతీలు, సమన్వయ లోపం, పదవుల పంపకాల ప్రచారం వంటివాటిని పక్కనపెట్టాలని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ఎదుగుదలకు గండికొట్టేలా ఎవరూ వ్యవహరించరాదని, కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వవద్దని స్పష్టం చేసింది. ఈ పరిస్థితిని చెడగొట్టుకోవద్దని.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతను బీజేపీకి అనుకూలంగా మలుచుకుని పార్టీని విజయతీరాలకు చేర్చే వ్యూహాలకు పదును పెట్టాలని సూచించింది.

నేతలను ఢిల్లీకి పిలిపించుకుని..

రాష్ట్రంలో బీజేపీ నేతల మధ్య గ్రూపు తగాదాలు పెరుగుతుండటం, పార్టీ కార్యక్రమాలకు కొందరు నేతలు దూరంగా ఉంటుండటం నేపథ్యంలో వాటిని చక్కదిద్దడంపై అధిష్టానం దృష్టిపెట్టింది. ఈ క్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను శనివారం సాయంత్రం ఢిల్లీకి రప్పించుకుంది. తెలంగాణ రాజకీయ అంశాలపై చర్చించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కూడా పిలిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో ముగ్గురు నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీలో కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు నాయకులకు సంయమనం, సమన్వయం, సర్దుబాట్లు తప్పనిసరని రాష్ట్ర నేతలకు జాతీయ నాయకత్వం తేల్చి చెప్పినట్టు సమాచారం. ఇదే సమయంలో ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ, మేనిఫెస్టో కమిటీల కూర్పుపై చర్చించారని.. ఎన్నికల వ్యూహాలు, ప్రచార అస్త్రాలు, నేతల పర్యటనలపై దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. పార్టీ అవసరాలకు తగినట్టుగా, అర్హత, పనితీరు ఆధారంగా పదవులు అవే వస్తాయని భేటీ సందర్భంగా బీజేపీ జాతీయ నేతలు స్పష్టం చేసినట్టు సమాచారం.

ఆ అపోహలు తొలగేలా చూడాలి!

తమ అసంతృప్తికి గల కారణాలను ఈటల, రాజగోపాల్‌రెడ్డి అధిష్టానం పెద్దల ముందు ఉంచారని సమాచారం. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయకపోవడంతో.. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యాయన్న ప్రచారం జరుగుతోందని వివరించినట్టు తెలిసింది. దీనికితోడు మంత్రి కేటీఆర్ ఢిల్లీలో వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతుండటాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మల్చుకుంటోందని చెప్పినట్టు సమాచారం. తెలంగాణలో పథకాలు, పనుల్లో అవినీతిపై కేంద్రం చర్యలు తీసుకోవడం లేదేమని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నట్టు తెలిసింది. ఇదే సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు పలువురు నేతల వ్యవహారశైలి, సమన్వయ లేమి, తామే ఫోకస్‌లో ఉండేలా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీనిపై స్పందించిన జాతీయ నేతలు.. అన్ని అంశాలపై తమకు అవగాహన ఉందని, వాటిని సరిదిద్దే బాధ్యతను తమకు వదిలేయాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇక రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకం అంశంపైనా చర్చ జరిగిందని, రాష్ట్ర బీజేపీలో ఏవైనా సంస్థాగత మార్పులు చేపట్టే అంశంపై త్వరలోనే స్పష్టత ఇస్తామని హైకమాండ్ పెద్దలు సంకేతాలు ఇచ్చినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

చేయూతనివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ పూరీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అదనపు ధాన్యం సేకరణ, హైదరాబాద్‌లో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎస్ఆర్‌డీపీ, లింకు రోడ్లు, పారిశుధ్యరంగంలో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి కార్యక్రమాలపై వారితో చర్చించారు. అయితే శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో కేటీఆర్ భేటీ జరగాల్సి ఉన్నా చివరి నిమిషంలో రద్దయింది. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. ఆదివారం ఉదయం కేటీఆర్ హైదరాబాద్‌కు తిరుగుపయనం కానున్నట్టు తెలిసింది.

రోడ్లు, రైల్వే విస్తరణ, పారిశుధ్యానికి నిధులపై హర్దీప్‌పూరీకి విజ్ఞప్తి

- హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలి. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు 5 కిలోమీటర్ల మెట్రోకు ఆమోదంతోపాటు ఆర్థిక సాయం చేయాలి.
- హైదరాబాద్ నగర పరిధిలో చేపట్టిన మిస్సింగ్, లింకు రోడ్ల నిర్మాణ కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయి. 22 మిస్సింగ్ లింక్ రోడ్లను పూర్తి చేయగా.. మరో 17 రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి పరిసర పురపాలికలకు మొత్తం 104 అదనపు కారిడార్లను నిర్మించేందుకు రూ.2,400 కోట్ల మేర ఖర్చవుతుంది. కేంద్రం రూ.800 కోట్లను ఈ ప్రాజెక్టు కోసం కేటాయించాలి.
- హైదరాబాద్‌లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ కోసం స్వచ్ఛ భారత మిషన్ లేదా ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కింద రూ.400 కోట్ల ఆర్థిక సాయం అందించాలి.
- రూ.3,050 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి 15శాతం నిధులు అంటే రూ.450 కోట్లను ఆర్థిక సాయంగా అందించాలి.
- హైదరాబాద్ నగర పరిధిలో చేపడుతున్న ఎస్టీపీల నిర్మాణ ఖర్చు దాదాపు రూ.3,722 కోట్లలో.. కేంద్రం కనీసం రూ.744 కోట్లు భరించాలి.
- రాష్ట్రంలో కేంద్రం నిర్దేశించిన సిటిజన్ సెంట్రిక్ రీఫార్మ్స్ కింద చేపట్టిన బయో మైనింగ్, మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు రూ.750 కోట్లను సాయంగా ఇవ్వాలి.
- గ్రామీణ ఉపాధి హామీ పథకం మాదిరిగా పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా ఉపాధి హామీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమల్లోకి తేవాలి.
- కాగా.. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన శానిటేషన్ హబ్ కార్యక్రమాన్ని ప్రశంసించిన హర్దీప్ సింగ్ పూరీ.. ఈ అంశంపై త్వరలో తమ శాఖ ఢిల్లీలో ఏర్పాటు చేసే సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వాలని కేటీఆర్‌ను కోరారు.

అదనపు బియ్యం సేకరణపై పీయూష్ గోయెల్‌కు..

- ఇటీవలికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ముడిబియ్యాన్ని అందించే పరిస్థితులు లేవు. మైసూర్‌లోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సైతం గత రబీ సీజన్‌లో రాష్ట్రంలోని 11 జిల్లాల్లో టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి.. ఈ సీజన్‌లో అధికంగా పండించే ఎంటీయూ 1010 రకంలో 48.20శాతం విరుగుడు ఉందని నివేదిక ఇచ్చింది.
- ప్రస్తుత సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 66.11 లక్షల టన్నుల వరిని సేకరించింది. కానీ కేంద్రం 10.20 లక్షల టన్నుల పారా బాయిల్డ్ రైస్ తీసుకుంటామన్నది. అంటే 15 లక్షల టన్నుల ధాన్యానికి మాత్రమే అనుమతించింది. మిగతా 51.11 లక్షల టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ముడి బియ్యంగా ఇవ్వాల్సిన పరిస్థితి. అలా ఇచ్చేందుకు ప్రతి లక్ష టన్నులకు రూ.42.08 కోట్లు చొప్పున.. 34.24 లక్షల టన్నుల బియ్యానికి రాష్ట్రంపై రూ.1,441 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. అందువల్ల ఈ రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 20 లక్షల టన్నుల పారా బాయిల్డ్ ఫోర్టిఫైడ్ రైస్ తీసుకోవాలని కోరుతున్నాం.



శనివారం ఢిల్లీలో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌తో మంత్రి కేటీఆర్ భేటీ

ఉత్తమ్, జానాలతో ఠాక్రే భేటీ

- జానాతో గంటపాటు భేటీ, జానాతో కలిసి ఉత్తమ్ ఇంటికి..
- పార్టీ అంతర్గత వ్యవహారాలు, పొంగులేటి, జూపల్లి చేరికలపై చర్చ
- తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేసిన ఉత్తమ్



ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసంలో మాట్లాడుకుంటున్న జానా, ఉత్తమ్, ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ముఖ్య నేతలు కె.జానారెడ్డి, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని వారి నివాసాలకు వెళ్లి ఆయన కలిశారు. ముందుగా జూబ్లీహిల్స్‌లోని సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి నివాసానికి వెళ్లిన ఠాక్రే ఆయనతో గంటసేపు చర్చించారు. తర్వాత జానాతో కలిసి బంజారాహిల్స్‌లోని ఉత్తమ్ నివాసానికి వెళ్లారు. అక్కడ ముగ్గురు 40 నిమిషాలకు పైగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చ జరిగిందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

చేరికల కమిటీ చైర్మన్ హోదాలో..

అదేవిధంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్‌లో చేరే అంశంపైనా చర్చించారని సమాచారం. ఈనెల 26న ఢిల్లీకి రావాలని, రాహుల్‌గాంధీతో జరిగే పొంగులేటి, జూపల్లి సమావేశంలో పాల్గొనాలని జానా, ఉత్తమ్‌లను ఠాక్రే ఆహ్వానించినట్టు తెలిసింది. ప్రస్తుతం జానారెడ్డి టీపీసీసీ చేరికల కమిటీ హోదాలో ఉన్నారు. అయితే, పొంగులేటి, జూపల్లిలను పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమంలో ఆయన పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఇంచార్జి హోదాలో ఠాక్రే శనివారం జానాను కలిసి చేరికల అంశంపై చర్చించారు. తనతోపాటు తన కుమారుడు రఘువీర్‌రెడ్డి కూడా పార్టీ మారుతున్నారంటూ వచ్చిన వార్తలపై ఠాక్రేతో చర్చించిన జానా, ఆ వార్తలను ఖండించినట్టు సమాచారం.

నన్ను అసహనానికి గురి చేస్తున్నారు: ఉత్తమ్

ఆ తర్వాత జానా, ఠాక్రేలు ఉత్తమ్ నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా .. తనపై వస్తున్న నిరాధార వార్తల గురించి ఉత్తమ్ ఘాటుగా స్పందించినట్టు తెలిసింది. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా పనిచేశానని, తన భార్య కూడా ఎమ్మెల్యేగా పని చేశారని, ఇంకా తమకు పదవులపై మోజు లేదని ఉత్తమ్ కుండబద్దలు కొట్టినట్టు తెలిసింది. అయితే, కొందరు నేతలు కావాలని తాను అసహనానికి గురయ్యే విధంగా వ్యవహరిస్తున్నారని, తమ నియోజకవర్గాల్లో ఇతరుల పేర్లు పెట్టి సర్వేలు చేయిస్తూ.. ఎలాంటి సంకేతాలు ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించినట్టు సమాచారం. తాను పార్టీని వీడి వెళ్లే ప్రసక్తే లేదని ఉత్తమ్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ నేతలంతా కలిసి పని చేసేలా తీసుకోవాల్సిన చర్యల గురించీ ముగ్గురు నేతలు చర్చించినట్లు సమాచారం.

గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

- బీజేపీ, బీఆర్ఎస్‌ది లోపాయికారీ ఒప్పందం
- 'బెహతర్ భారత్ బునియాద్' పోస్టర్ ఆవిష్కరణలో మాణిక్‌రావ్ ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, అవి లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే విమర్శించారు. గల్లీలో వైరం నటిస్తూ... ఢిల్లీలో దోస్తీ తొమ్మిదేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోందని ఆరోపించారు. శనివారం గాంధీ భవన్‌లో యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'బెహతర్ భారత్ బునియాద్'వాల్‌పోస్టర్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఠాక్రే మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు.. బీజేపీని విమర్శిస్తూనే ఢిల్లీ వెళ్లినప్పుడు అమిత్‌షాను కలిసి వస్తున్నారని పరోక్షంగా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల దోస్తీని యూత్ కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన నేతలకు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరి చొప్పున బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే 60 అసెంబ్లీ నియోజకవర్గాల కలిపి ఇన్‌చార్జులను నియమించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో యూత్‌కాంగ్రెస్ నేతలకూ టికెట్లు ఇస్తారని, అధిష్టానం తీసుకున్న ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని చెప్పారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్, యువజన కాంగ్రెస్ జాతీయ నాయకులు, కర్ణాటక ఎన్నికల్లో పనిచేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

పాత్రికేయులకు త్వరలో ఇళ్ల స్థలాలు: కేటీఆర్

సాక్షి, న్యూఢిల్లీ: పాత్రికేయులందరికీ వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియను మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు అప్పగించామని తెలిపారు. ఢిల్లీ టీయూడబ్ల్యూజే–143 అధ్యక్షుడు నాగిళ్ల వెంకటేష్ అధ్యక్షతన శనివారం పాత్రికేయుల బృందం మంత్రి కేటీఆర్ తో సమావేశమైంది. ఈ సందర్భంగా ఢిల్లీలో పనిచేస్తున్న తెలంగాణ పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. హైదరాబాదు లోని పాత్రికేయులందరికీ స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందులోనే ఢిల్లీలో పనిచేస్తున్న తెలంగాణ పాత్రికేయుల్ని సైతం చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు జీవోలో ఆ అంశాలను పొందుపరుస్తామన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు సొసైటీకి, హైదరాబాద్ పాత్రికేయులకు ఒకేసారి ఇళ్ల స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు. భేటీలో బీఆర్ఎస్ ఎంపీలు గడ్డం రంజిత్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఉన్నారు.

అసెంబ్లీ రూట్లో.. ఒక్కొక్కరికి గ్రీన్‌సిగ్నల్!

- ఎన్నికల టికెట్లపై సిట్టింగ్‌లు, ఆశావహులకు కేసీఆర్, కేటీఆర్ సంకేతాలు
- వేములవాడలో చెన్నమనేని రమేశ్ స్థానంలో చల్మెడ బరిలోకి!
- జూలై నెలాఖరులోగా 75శాతం స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేసిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. పోటీలో ఉండే అభ్యర్థులు ఒక్కొక్కరికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నట్టు పారటతః వర్గాలు చెప్తున్నాయి. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇతర ఆశావహుల పనితీరు ఆధారంగా జాబితాపై కసరత్తు చేస్తున్నారని అంటున్నాయి. స్పష్టత వచ్చిన అభ్యర్థులకు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివిధ సందర్భాల్లో పరోక్షంగా పోటీ చేసేది మీరేనంటూ సంకేతాలు ఇస్తున్నారని వివరిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 20 అసెంబ్లీ స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు మరో అరడజను స్థానాల్లో కొత్త అభ్యర్థులకు దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని స్పష్టం చేస్తున్నాయి. ఇదే తరహాలో పార్టీ, అధికారిక కార్యక్రమాల్లో మరికొందరు అభ్యర్థుల పేర్లనూ పరోక్షంగా క్లియర్ చేయాలని భావిస్తున్నారని చెప్తున్నాయి. మొత్తంగా జూలై నెలాఖరులోగా అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే అవకాశం ఉందని అంటున్నాయి. పని తీరు బాగోలేని, వ్యతిరేకత మూటగట్టుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాలు, విపక్షాల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని స్థానాలు కలిపి.. 20–30 సీట్లలో అభ్యర్థులపై చివరి నిమిషం వరకు సస్పెన్స్ కొనసాగే పరిస్థితి ఉందని వివరిస్తున్నాయి.

ఏదో ఓ కార్యక్రమంలో.. సంకేతాలిస్తూ..

కేసీఆర్, కేటీఆర్ ఇటీవల జిల్లా పర్యటనలు, సభలు, సమావేశాల్లో పార్టీ అభ్యర్థుల విషయంలో సంకేతాలు ఇస్తూ ఇస్తున్నారు. మంత్రి గంగుల కమలాకర్ (కరీంనగర్)తోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), గండ్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి), ఆరూరి రమేశ్ (వర్ధన్నపేట), ఒడితెల సతీశ్‌కుమార్ (హుస్నాబాద్), దాస్యం వినయభాస్కర్ (వరంగల్ పశ్చిమ), నల్లమోతు భాస్కర్‌రావు (మిర్యాలగూడ) ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు గువ్వల బాలరాజు (అచ్చంపేట), ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (దేవరకద్ర), జాజాల సురేందర్ (ఎల్లారెడ్డి), మంచిరెడ్డి కిషన్‌రెడ్డి (ఇబ్రహీంపట్నం), సండ్ర వెంకట వీరయ్య (సత్తుపల్లి), ఆశన్నగారి జీవన్‌రెడ్డి (ఆర్మూరు), బిగాల గణేశ్ గుప్తా (నిజామాబాద్ అర్బన్), షకీల్ అహ్మద్ (బోధన్), మర్రి జనార్దన్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల)లకు కూడా గ్రీన్‌సిగ్నల్ లభించినట్టు తెలిసింది.

అక్కడక్కడా ఆశావహులకు చాన్స్!

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు సుమారు 70 మంది ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. ఆశావహుల్లో పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్ పర్సన్లు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన ఇతర ముఖ్య నేతలు ఉన్నారు. ఇలా తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ వీలైనచోట ఆశావహుల పేర్లను పరోక్షంగా కేసీఆర్ ఖరారు చేస్తున్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి సంకేతాలు అందడంతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా దుబ్బాక నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నారు. వేములవాడ సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ స్థానంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు రంగప్రవేశం చేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. శనివారం వేములవాడలో యువ సమ్మేళనం నిర్వహించి కేసీఆర్ ఆశీర్వాదంతోనే ముందుకు వెళ్తున్నట్టు ప్రకటించారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు స్థానంలో కొత్తవారికి అవకాశం దక్కుతుందనే ప్రచారం నేపథ్యంలో.. ఎర్రోళ్ల శ్రీనివాస్ స్థానిక నేతలను కలుస్తుండగా, ఢిల్లీ వసంత్ జయహో జహీరాబాద్ పేరిట ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్నారు. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేసిన బోయినపల్లి వినోద్‌కుమార్, మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు వచ్చే ఎన్నికల్లోనూ మీరే అభ్యర్థులు అంటూ సంకేతాలు అందాయి.

క్లుప్తంగా...

త్వరలోనే కార్మిక డిక్లరేషన్ ప్రకటిస్తాం

ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు జనక్ ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరఫున కార్మిక డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని, నరేంద్రమోదీ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ..ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సూచన మేరకు కార్మిక డిక్లరేషన్‌లో ప్రకటించాల్సిన అంశాలపై చర్చించి ప్రకటిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, పనిదినాల పెంపు, భవన నిర్మాణ, వలస కార్మికులకు లబ్ధి చేసే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, పాత పెన్షన్ స్కీం, ఉద్యోగుల పీఆర్సీలపై చర్చించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా కార్మిక డిక్లరేషన్ ప్రకటిస్తామని వివరించారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన ఎఫ్‌జీజీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనైనా డబ్బు, మద్యం పాత్రను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ ఏడాది జరిగే ఎన్నికలైనా వాటి ప్రభావం లేకుండా సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుపరిపాలన వేదిక (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు శనివారం భారత ఎన్నికల కమిషన్ సీనియర్ డిప్యూటీ కమిషనర్ ధర్మేంద్రశర్మకు ఎఫ్‌జీజీ పద్మనాభరెడ్డి లేఖ రాశారు. కనీసం రూ.10 కోట్లు లేనిదే ఎమ్మెల్యేగా పోటీ చేసే పరిస్థితిలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులు హైదరాబాద్‌లో మూడ్రోజుల పాటు బస చేశారని, ఈ సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయపార్టీలను అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చర్చించి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే బాగుండేదని హితవు పలికారు.

బోనాల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరగనున్న బోనాలు పండుగ పోస్టర్‌ను శనివారం తన నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రిస్బేన్‌లోని తెలంగాణ ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. భారత జాగృతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జూలై 15న ఉదయం 10 గంటలకు బ్రిస్బేన్‌లోని గాయత్రి మందిర్‌లో ప్రారంభం కానుంది. కార్యక్రమానికి బ్రిస్బేన్ తెలంగాణ అసోసియేషన్, క్వీన్స్‌ల్యాండ్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ అఫ్ గోల్డ్ కోస్ట్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియాలు మద్దతు పలికాయి. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ పాల్గొన్నారు

నిబద్ధతతో బీసీల పక్షాన నిలబడాలి: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసపూరిత వాగ్దానాలతో మభ్యపెట్టడం మాని నిబద్ధతతో బీసీల పక్షాన నిలబడాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. గడచిన తొమ్మిదేళ్లుగా బీసీల ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లను 21 శాతానికి తగ్గించడం, బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్లలో బీసీల నాయకత్వాన్ని ఎదగనీయకుండా అణచివేయడం దారుణమన్నారు. 45 లక్షల బీసీ కుటుంబాలున్న రాష్ట్రంలో 5.28 లక్షల దరఖాస్తులు మాత్రమే బీసీలకు లక్ష సాయానికి వచ్చాయనడం బీసీలను వంచించడమేనని దాసు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రమంతటికీ నైరుతి



సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

- పూర్తిగా విస్తరించిన రుతు పవనాలు
- వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- ఆదివారం ఉదయానికి అల్పపీడనంగా మారే చాన్స్
- రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఈసారి నైరుతి రుతుపవనాలు చాలా ఆలస్యంగా వచ్చినా రాష్ట్రమంతటా వేగంగా విస్తరించాయి. ఈ నెల 22న రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు.. చురుకుగా కదులుతూ 3రోజుల్లోనే రాష్ట్ర భూభాగానికి పూర్తిగా వ్యాపించాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీనితో అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నట్టు తెలిపింది. శనివారం చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడ్డాయని, రాష్ట్రవ్యాప్తంగా 1.12సెం.మీ.ల సగటు వర్షపాతం నమోదైందని వెల్లడించింది. జిల్లాల వారీగా వర్షపాతం తీరును పరిశీలిస్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.15 సెంటీమీటర్లు, మేడ్చల్–మల్కాజిగిరిలో 2.12, సిద్దిపేటలో 2.05, నాగర్‌కర్నూల్‌లో 1.96 సెంటీమీటర్లు కురిసినట్టు తెలిపింది.

శనివారం అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.లలో)

ప్రాంతం (జిల్లా)	వర్షపాతం
రాంపూర్ (సిద్దిపేట)	6.18
ముత్తారం (పెద్దపల్లి)	4.83
నర్సాపూర్ (మెదక్)	4.13
ముస్త్యాల (సిద్దిపేట)	4.03
కొమురవెల్లి (సిద్దిపేట)	3.98

వర్షపాతం లోటు తగ్గుతూ..

రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న వానలతో లోటు వర్షపాతం తగ్గుతోంది. సాధారణంగా జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 12.93 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాలి. ఇందులో ఈ నెల 24 నాటికి 9.94 సెంటీమీటర్ల మేర కురవాలి. కానీ ఈసారి 4.16 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. అంటే రాష్ట్రంలో 58శాతం లోటు వర్షపాతం ఉంది. తొమ్మిది జిల్లాల్లో లోటు, 22 జిల్లాల్లో అత్యంత లోటు ఉండగా.. నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మాత్రమే సగటు సాధారణ వర్షపాతానికి చేరువైంది. అయితే రుతుపవనాలు విస్తరిస్తూ, వానల జోరు పెరుగుతోంది. మరో ఐదు రోజులు ఇదే తరహా వాతావరణం ఉంటే సాధారణ వర్షపాతానికి చేరుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని.. అది క్రమంగా బలపడి ఆదివారం ఉదయం కల్లా అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు పడతాయని.. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు చాన్స్ ఉందని పేర్కొంది.

అర్హులను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం
- కలెక్టర్లు, ఎస్పీలతో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భేటీ
- మునుగోడు ఉప ఎన్నిక నిర్వహణ తీరుపై అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గతేడాది తొలగించిన 22 లక్షలకు పైగా ఓటర్ల విషయంలో పునః పరిశీలన చేసి అర్హులకు మళ్లీ ఓటర్ల జాబితాలో అవకాశం కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ ఆదేశించారు. 'ఫోటో సిమిలర్ ఎంట్రీ'అనే సాఫ్ట్‌వేర్ సహాయంతో ఒకే తరహా ఫొటోలు కలిగి ఉన్న ఓటర్లను గుర్తించి తొలగించారు. నిజామాబాద్, శేరిలింగంపల్లి తదితర నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లను జాబితాను నుంచి తీసేశారు. వీరిలో అర్హులను గుర్తించి వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ధర్మేంద్ర శర్మ రాష్ట్ర అధికారులకు సూచించారు. ఆయన నేతృత్వంలో మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం బృందం శనివారం సాయంత్రం తిరిగి ఢిల్లీకి వెళ్లిపోయింది. కేంద్ర బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌తో కలసి శనివారం రెండోరోజు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశం నిర్వహించింది. గత శాసనసభ ఎన్నికలతో పాటు మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా అధికార, విపక్ష పార్టీల నుంచి భారీ సంఖ్యలో ఫిర్యాదులొచ్చాయని, మళ్లీ అలాంటి అవకాశం ఇవ్వరాదని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర బృందం హెచ్చరించినట్టు తెలిసింది. ఒక్క నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నిక విషయంలో ఎందుకు విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఓ నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలను భద్రపరచిన గోదాంకు వేసిన తాళం చెవులను పోగొట్టుకుని రాష్ట్ర హైకోర్టు నుంచి చీవాట్లు తిన్న ఘటనను బృందం ప్రస్తావించి ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. సదరం డేటాబేస్ ఆధారంగా దివ్యాంగులను ఓటర్ల జాబితాలో చేర్చారని, వీరిలో 18 ఏళ్ల వయసు లేని వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది.

ఇక ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో సైతం పోలింగ్ బూత్‌లు..

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ శనివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో కేంద్ర ఎన్నికల సంఘం బృందంతో సమావేశం సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అన్ని రకాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఈసీ బృందం ఆదేశించినట్టు తెలిసింది. కాగా, ప్రస్తుత సీఈఓ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో త్వరలో మరో భవనంలో స్థలాన్ని కేటాయిస్తామని సీఎస్ శాంతికుమారి హామీ ఇచ్చారు. పోలింగ్ శాతం పెంచడంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పురుషులు, మహిళల కోసం టాయిలెట్లతో పాటు ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తరలించడానికి వాహనాలను కేటాయిస్తామని సీఎస్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

నేడు నాగర్‌కర్నూల్‌లో నవ సంకల్ప సభ

- హాజరుకానున్న జేపీ నడ్డా
- మధ్యాహ్నం ప్రొ. కె.నాగేశ్వర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద్ శంకర్‌లతో భేటీ
- పార్టీ ముఖ్యనేతలతో సమావేశం.. అసెంబ్లీ ఎన్నికలకు దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయంగా, రాష్ట్రంలో పార్టీ పరంగా నాయకుల్లో ఏర్పడిన గందరగోళాన్ని తొలగించి దిశానిర్దేశం చేసే విషయంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీలో ముఖ్యనేతల మధ్య సమన్వయం కొరవడి బీజేపీ డీలాపడిందనే ప్రచారం మధ్య నడ్డా పర్యటన రాష్ట్రంలో పార్టీకి కొత్త ఊపును ఇస్తుందని భావిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం నాగర్ కర్నూల్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభకు పార్టీ 'నవ సంకల్ప సభ'గా పేరుపెట్టింది. మోదీ సర్కార్ విజయాలను చెప్పడంతో పాటు తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనా వైఫల్యాలను ఆయన తీవ్రస్థాయిలో ఎండగడతారని పార్టీ వర్గాల సమాచారం. మధ్యాహ్నం 'సంపర్క్ సే సమర్థన్'లో భాగంగా ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు ప్రొ. కె.నాగేశ్వర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద్ శంకర్ జయంత్‌ల ఇళ్లకు వెళ్లి నడ్డా వారిని కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా మోదీ పాలనా విజయాలను వారికి వివరించడంతోపాటు కేంద్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై పుస్తకాలను అందజేస్తారు. అలాగే మధ్యాహ్నం లేదా నాగర్‌కర్నూల్ సభ తర్వాత రాష్ట్ర ముఖ్యనేతలతో నడ్డా భేటీ అయ్యే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

సభ సక్సెస్‌తో చరిత్ర సృష్టిద్దాం: బండి సంజయ్

'నాగర్ కర్నూలు జిల్లాలో బీజేపీ దమ్ము చూపే అవకాశం వచ్చింది. ఆదివారం జేపీ నడ్డా హాజరయ్యే బహిరంగ సభను కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్ చేసి సత్తా చాటాలి'అని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సంజయ్ మాట్లాడుతూ 'ఒకవైపు బీఆర్‌ఎస్–కాంగ్రెస్‌లు కలసి బీజేపీని దెబ్బతీసేందుకు ఏ విధంగా కుట్రలు చేస్తున్నాయో మనందరికీ తెలుసు. బీఆర్‌ఎస్–కాంగ్రెస్ ఎప్పటి నుంచో కలిసే పోటీ చేస్తున్నయ్. పార్లమెంట్ లోపల, బయటా కలిసే బీజేపీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 30 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులు పంపిణీ చేశారు'అని చెప్పారు. ఈ పరిస్థితుల్లో నడ్డా బహిరంగ సభ పార్టీకి కీలకం కానుందని, ఒక్కో కార్యకర్త 50 మందిని తీసుకుని రావాలని సంజయ్ కోరారు.

నడ్డా పర్యటన ఇలా...

➤ ఆదివారం మధ్యాహ్నం 12.30 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగుతారు. ➤ మధ్యాహ్నం 12.55 నుంచి 1.45 గంటల దాకా నోవాటెల్ హోటల్లో రిజర్వ్ టైమ్. ➤ 2.30 గంటలకు టోలిచౌకిలోని ప్రొ.నాగేశ్వర్ నివాసానికి వెళ్లి 15 నిమిషాలు సమావేశమవుతారు. ➤ 2.55 నిమిషాలకు ఫిల్మ్‌నగర్‌లో పద్మశ్రీ ఆనంద శంకర్ జయంత్‌ను కలుసుకుంటారు. ➤ 3.50కి నోవాటెల్‌కు చేరుకుంటారు. ➤ 4.20 గంటలకు శంషాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌కు బయలుదేరి 4.50కు అక్కడికి చేరుకుంటారు. ➤ సాయంత్రం 5–6గంటల మధ్య నాగర్‌కర్నూల్ జెడ్పీ హైస్కూల్ మైదానంలో బహిరంగ సభలో పాల్గొంటారు. ➤ 6.15కు హెలి కాప్టర్‌లో తిరుగు ప్రయాణమై 6.40కి శంషాబాద్‌కు చేరుకుంటారు. ➤ 6.45 గంటలకు ప్రత్యేక విమానంలో కేరళలోని తిరువనంతపురం వెళతారు.

కోర్టులో 'క్లినిక్'

▶ మొదటి పేజీ తరువాయి

ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వరంగల్ జిల్లా బమ్మెర గ్రామంలో ఈ మూడు సంస్థల ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్ స్ఫూర్తితో రాష్ట్రంలోని మరో 90 గ్రామాల్లోనూ ఇలాంటి క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. ఈ గ్రామాల్లో రైతులకు న్యాయ సేవలందించేందుకు నల్సార్ విశ్వవిద్యాలయంలో 120 మంది పారాలీగల్ వలంటీర్లకు నల్సార్‌లో రెండు రోజులపాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ సిబ్బందికి లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఇప్పుడు జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఏ రైతుకైనా భూమి, వ్యవసాయ సమస్యలపై న్యాయ సహాయం, సలహాలు కావాలంటే ఈ క్లినిక్‌కు రావొచ్చని, ఇక్కడ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని, దేశవ్యాప్తంగా కోర్టుల్లో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ఏర్పాటుకు ఇది మోడల్ ప్రాజెక్టుగా ఉపయోగపడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రతి రైతుకు చట్టం తెలియాలి

రైతులకు ఉచిత న్యాయ సాయం ఎలా అందించాలన్న దానిపై 2006 నుంచి ఆలోచన చేస్తున్నాం. ఇప్పటికి ఆ ఆలోచన కార్యరూపం దాలుస్తోంది. విత్తనం నుంచి భూమి వరకు, మార్కెట్‌లో జరిగే మోసాల గురించి రైతులకు అవగాహన అవసరం. అవగాహనతోపాటు న్యాయ సహాయం కూడా కావాలి. ఇలాంటి ఉచిత న్యాయ సేవలు అందించడమే ఈ క్లినిక్ లక్ష్యం. ప్రతి గ్రామంలో ఇలాంటి క్లినిక్‌లు రావాలి. ప్రతి రైతుకు చట్టం తెలియాలి. ప్రతి రైతు చైతన్యవంతుడు కావాలి.

– సునీల్‌కుమార్, భూమి చట్టాల నిపుణుడు

బమ్మెరలో రైతు సదస్సు

ఇప్పటికే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటైన బమ్మెర గ్రామంలో ఆదివారం రైతులకు చట్టాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ సదస్సుకు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ, లీఫ్స్, నల్సార్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సదస్సును లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ నవీన్‌రావు ప్రారంభించనున్నారు. చట్టాలు తెలిస్తేనే కానీ సాగు సాఫీగా జరిగే పరిస్థితులు వచ్చాయని, రైతులకు మేలు చేసే చట్టాలు ఎన్ని వచ్చినా వాటిని వినియోగించుకొనే అవకాశం లేకుండా పోయిందని, రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించడంలో భాగంగానే ఈ సదస్సును నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో దేశంలోని ప్రతి గ్రామంలో ఇలాంటి సదస్సులు నిర్వహించాలనేది తమ లక్ష్యమన్నారు.




ఎన్నికల బదిలీలపై దృష్టి పెట్టండి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియతో సంబంధమున్న అధికారుల బదిలీలు, ఇతర విషయాల్లో తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మకు రాష్ట్ర బీజేపీ నేతల ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. హైదరాబాద్‌లో శనివారం శర్మకు బీజేపీ నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, జి.రామారావుయాదవ్, పొన్నా వెంకటరమణ వినతిపత్రం అందజేశారు. బదిలీల ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు, మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ నియంత్రణలో కొనసాగుతుండడంతో.. దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 35 లక్షల మంది ఓటర్లను వారి సొంత పోలింగ్ స్టేషన్లలో కాకుండా మరోచోట కేటాయించడాన్ని ఈసీ వెంటనే సరిదిద్దాలని కోరారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని దక్షిణ మండలం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, శాంతి భద్రతల విభాగాల్లో ఎస్‌ఐ, ఆపై ర్యాంకుల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని అక్కడి నుంచి బదిలీ చేయాలని కోరారు. శేరిలింగం అసెంబ్లీ పరిధిలో 5,155 ఓటర్ల ఇళ్లను కనిపెట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. 'హై హోం భూజ'గేటెడ్ కమ్యూనిటీలో 4వేల అర్హులైన ఓటర్లు ఉండగా.. 146 పేర్లను మాత్రమే 26 వేర్వేరు పోలింగ్ బూత్‌లలో కావాలనే నమోదు చేశారని ఆరోపించారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్వోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



యాదాద్రి ఆలయ మండపాల్లో వర్షం లీకేజీ..



ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలో కారుతున్న వర్షపు నీరు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మండపాల్లో మరోసారి లీకేజీలు బయటపడ్డాయి.. ఆలయ ఉత్తర, తూర్పు వైపు ఉన్న అష్టభుజి ప్రాకార మండపాల్లోని గోడలు, స్లాబ్‌పై నుంచి వర్షం నీరు కారింది.

మహిళా కమిషన్ల ముందుకు నవ్య కేసు

- సుమోటోగా స్వీకరించిన జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు
- విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పోలీసులకు ఆదేశం
- నవ్యకు నోటీసులు జారీ చేసిన పోలీసులు
- ఎమ్మెల్యేమీద ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని సూచన



సర్పంచ్ నవ్య

ధర్మసాగర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కురుసపల్లి నవ్య చేసిన లైంగిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణల కేసు కీలక మలుపు తిరిగింది. ఈ వివాదాన్ని జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు సుమోటోగా స్వీకరించాయి. ఎమ్మెల్యే రాజయ్యపై సర్పంచ్ నవ్య చేసిన ఆరోపణలమీద విచారణ చేపట్టి నివేదిక అందజేయాల్సిందిగా మహిళా కమిషన్లు పోలీసు శాఖను ఆదేశించాయి. కాగా, ఎమ్మెల్యే రాజయ్య, ఆయన అనుచరుల ద్వారా తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని సర్పంచ్ నవ్య శనివారం మరోసారి మండిపడ్డారు. తాను ఎమ్మెల్యే వద్ద నయాపైసా కూడా తీసుకోలేదని మరోమారు స్పష్టం చేశారు. సీడీఎఫ్ నిధుల నుంచి గ్రామాభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే రాజయ్య, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. గతంలో ఎమ్మెల్యే రాజయ్యపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఆమె తెలిపారు. ఈ వ్యవహారంలో ఉన్న వారిని ఎవరినీ వదిలిపెట్టనని.. అందరి బండారం బయట పెడతానని ఆమె హెచ్చరించారు.

నోటీసులు జారీ చేసిన పోలీసులు

రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతోపాటు ఆయన పీఏ శ్రీనివాస్, ధర్మసాగర్ ఎంపీపీ నిమ్మ కవిత, తన భర్త ప్రవీణ్‌పై నవ్య ధర్మసాగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేతోపాటు మిగతా వారిపై ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి సరైన సాక్ష్యాధారాలు, ఫోన్ రికార్డులు, డాక్యుమెంటరీ సాక్ష్యం, ఇతర ఏ విధమైన ఆధారాలు ఉన్నా తమకు అందజేయాలని ధర్మసాగర్ పోలీసులు, కాజీపేట ఏసీపీ ఆమెకు వేర్వేరుగా నోటీసులు జారీ చేశారు. కాగా, ఈ నోటీసులపై ఏ విధంగా స్పందిస్తారని మీడియా నవ్యను ప్రశ్నించగా అడ్వొకేట్ ద్వారా తన దగ్గర ఉన్న అన్ని ఆధారాలను పోలీసులకు అప్పగిస్తానని తెలిపారు.

బడ్జెట్ ఉన్నా పేదలకు వైద్యమేదీ?

- పౌరులకు అత్యాధునిక వైద్య సేవలు అందినప్పుడే ఆరోగ్య భారతం సాకారం
- ఏఎఫ్‌పీఐ తెలుగు రాష్ట్రాల సదస్సులో జస్టిస్ ఎన్వీ రమణ



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్వీ రమణ

సాక్షి, హైదరాబాద్: దేశ బడ్జెట్ రూ. లక్షల కోట్లు ఉన్నప్పటికీ చాలా ప్రాంతాల్లో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి అత్యాధునిక వైద్య సేవలు అందినప్పుడే ఆరోగ్య భారతం సాకారమవుతుందన్నారు. అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్‌పీఐ) ఆధ్వర్యంలో 'ప్రివెంటివ్ కేర్ ఇన్ క్లినికల్ ప్రాక్టీస్–రోల్ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్'అంశంపై శనివారం హైదరాబాద్‌లో సదస్సు జరిగింది. ఏఎఫ్‌పీఐ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ జనాభా పెరుగుతోందని, అందుకు తగ్గట్లుగా వైద్యులు తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా సగటున లక్ష మంది డాక్టర్లుగా పట్టాలు పొందుతున్నారన్నారు. కోవిడ్ వ్యాప్తి తర్వాత ప్రజల జీవన వ్యయం పెరిగిందని, ఈ క్రమంలో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగాయని వివరించారు. అదేవిధంగా కొన్నిచోట్ల ప్రజల ఆలోచన విధానం కూడా మారిందని, ఒక వైద్యుడు రోగిని పరిశీలించి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా స్పష్టత ఇచ్చినప్పటికీ రోగి సంతృప్తి చెందడం లేదన్నారు. కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నాక సంతృప్తి చెందే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఈ తరహా వైఖరిని మార్చే అవకాశం ఫ్యామిలీ డాక్టర్‌కే ఉంటుందని, వారు రోగులకు ధైర్యం చెప్పాలని సూచించారు. అప్పుడు కార్పొరేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కొన్నిచోట్ల వైద్యులు నాడి పట్టకుండా ప్రిస్క్రిప్షన్ రాసి పంపిస్తున్న ఘటనలు ఉన్నాయని, అలాంటి వైఖరి కూడా సరికాదన్నారు.

వైద్యవిద్య ఖర్చుతో కూడుకున్నదే...

వైద్యవిద్యపట్ల ఆసక్తి ఉన్నప్పటికీ చాలా మంది ఈ రంగాన్ని ఎంచుకోవడంలో ఆసక్తి చూపడం లేదని జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. వైద్యవిద్య ఖర్చుతో కూడుకున్నదని, అదేవిధంగా సుదీర్ఘకాలంపాటు చదువు కొనసాగించాల్సి వస్తుందని, కోర్సు పూర్తయ్యాక ప్రాక్టీసు పెట్టుకోవడం, స్థిరపడటానికి సైతం ఎక్కువ సమయం పడుతోందని... ఇదంతా ఆలోచించి ఈ రంగానికి పరిమిత సంఖ్యలోనే ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది చేసిన సేవలు అత్యంత గొప్పవని ఎన్వీ రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌పీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రమణ్‌కుమార్, ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ మల్లీశ్వరమ్మ, తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





న్యాయము జరిగించుట వలన రాజు దేశమునకు
క్షేమము కలుగజేయును: లంచములు
పుచ్చుకొనువాడు దేశమును పాడుచేయును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.సప్తమి రా.8.21 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.7.24 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.3.15 నుండి 4.57 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.48 నుండి 5.40 వరకు, **అమృతఘడియలు:** రా.1.41 నుండి 2.34 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.34
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మీటింగ్ అయ్యాక, మీటింగ్‌కి వచ్చిన సీఎంలు, సీనియర్ లీడర్లు వెళ్లిపోయాక... కాన్ఫరెన్స్ హాల్‌లో నేను, తేజస్వి మిగిలాం.

"ఏమైనా తిన్నారా?" అన్నాడు తేజస్వి!!

"ఎందుకలా అడిగావ్ తేజా?!" అన్నాను, నవ్వుతూ.

"రెండ్రోజులు తినకపోయినా మీ చిరునవ్వులోని కాంతిని మీరు ఏమాత్రం తగ్గనివ్వరు. అందుకే అడిగాను.." అన్నాడు.

మనసుకు దగ్గరైన వాళ్లే మనిషిలోని అలసటను కనిపెట్టగలరు.

"మీటింగ్ బాగా జరిగినట్లేనా?" అన్నాను.

"గ్రాండ్ సక్సెస్ నితీశ్‌జీ. మిగిలిందిక గ్రాండ్ విక్టరీ.." అన్నాడు!

ఆ 33 ఏళ్ల యువనేత అలా అంటున్నప్పుడు బిహార్ ఉప ముఖ్యమంత్రిలా లేడు. భావి భారత ఉప ప్రధాని ఇతడే అనిపించేలా ఉన్నాడు!

"కానీ తేజా! గ్రాండ్ విక్టరీకి ఓట్ల లెక్క, సీట్ల లెక్క ఉంటుంది. గ్రాండ్ సక్సెస్‌కు ఏం లెక్క ఉంటుంది చెప్పు?" అన్నాను.



తేజస్వి నవ్వాడు.

"మమతాజీ పిలిస్తే కోల్‌కతాకు, కేజ్రీవాల్ పిలుపునిస్తే ఢిల్లీకి, స్టాలిన్ రమ్మంటే చెన్నైకి, పవార్ సయ్యంటే ముంబైకి, కేసీఆర్ స్వాగత తోరణాలు కడితే హైదరాబాద్‌కి, ఏచూరి, డి. రాజా కలిసి శంఖం పూరిస్తే దేశంలో ఏదో ఒక మూలకు.. ఇన్ని పార్టీల వాళ్లు వెళ్లేవారా? కానీ మీరు ఆహ్వానిస్తే పట్నాకు వచ్చారు. ఒకరంటే ఒకరికి పడకున్నా ఒకే వేదిక మీదకు వచ్చారు. గ్రాండ్ సక్సెస్‌కు ఇంకేం లెక్క కావాలి నితీశ్‌జీ..!" అన్నాడు.

"కానీ ఒక స్నేహశీలి, ఒక అజాతశత్రువు మీటింగ్‌కు రాకపోవడం మన సక్సెస్ లెక్కకు శేషాన్ని మిగిల్చినట్లు కాదా తేజా?!" అన్నాను.

"మీరంటున్నది ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురించే కనుకైతే.. మన సక్సెస్ లెక్కకు ఆయన ఒక శేషంగా మిగిలిపోవడమే మంచిది నితీశ్‌జీ. పట్నాయక్ నుంచి మనం గొప్ప సమాఖ్య స్ఫూర్తిని పొందగలం కానీ, మోదీకి వ్యతిరేకంగా చిన్న నినాదాన్ని కూడా ఆశించలేం..." అన్నాడు తేజస్వి. అలా అన్నాక.. "ఒక్కక్షణం.." అని కాన్ఫరెన్స్ హాల్ నుంచి బయటికి వెళ్లాడు.

పట్నాయక్‌ను మీటింగ్‌కి పిలిచేందుకు మే 9న నేను భువనేశ్వర్ వెళ్లినప్పుడు మా మధ్య సుదీర్ఘ సంభాషణే జరిగింది.

"నితీశ్‌జీ! ఒకటి గమనించండి. నేను బీజేపీకి వ్యతిరేకమే కానీ, మోదీజీకి వ్యతిరేకం కాదు కనుక.. మీ మీటింగ్‌కి రాలేనని చెప్పవలసి వస్తోంది.." అన్నారు పట్నాయక్!

"మోదీజీని కాకుండా బీజేపీని మీరు వ్యతిరేకిస్తున్నట్లయితే, బీజేపీని వ్యతిరేకిస్తున్న వారితో మీరు చేతులు కలపవచ్చు కదా నవీన్‌జీ.." అన్నాను నేను.

"అలా ఎందుకౌతుంది నితీశ్‌జీ! మనం ఒకర్ని వ్యతిరేకిస్తున్నప్పుడు ఆ ఒకర్ని వ్యతిరేకిస్తున్న వారితో మనం ఏకీభవించాలనే ముంది? అలాగే ఒకరితో స్నేహంగా ఉన్నామని, వారున్న పార్టీతో సమ్మతంగా ఉండాలని కూడా లేదు కదా..!" అన్నారు పట్నాయక్.

పట్నాయక్ ఆ మాటను ఎవరిని ఉద్దేశించి అన్నారో నేను ఊహించగలిగాను. సంజయ్ గాంధీకి ఆయన క్లాస్‌మేట్. రాజీవ్ గాంధీకి జూనియర్. అలాగని ఆయన కాంగ్రెస్ పార్టీకి క్లాస్‌మేట్ గానూ, జూనియర్ గానూ లేరు. తన తండ్రి బిజూ పట్నాయక్‌ది మొదట కాంగ్రెస్ పార్టీనే కనుక తనూ మొదట కాంగ్రెస్ పార్టీలోనే ఉండాలనుకోలేదు.

"మీరింకా మీ స్నేహశీలి, అజాతశత్రువు గురించే ఆలోచిస్తున్నారా నితీశ్‌జీ..!" అన్నాడు తేజస్వి కాన్ఫరెన్స్ హాల్లోకి తిరిగొచ్చి.

అతడి చేతిలోని పింగాణీ ప్లేటులో బిహారీలు ఎంతో ఇష్టంగా తినే సిలావో ఖజా, గయా లాయి, లిట్టీ ఛోకా, ఇంకా కొన్ని రొట్టెలు ఉన్నాయి.

"ముందు వీటి సంగతి చూడండి నితీశ్‌జీ! అతిథి మర్యాదలలో పడిపోయి మా ప్రియతమ ముఖ్యమంత్రి తమ భోజనం గురించి మర్చిపోయినట్లున్నారు!" అన్నాడు నవ్వుతూ.

సైంధవ రుతుపవనం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

జూన్ 16, పిఠాపురం:

'శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నా. నేను సీఎం అవ్వడానికి సిద్ధంగా ఉన్నా'' – ఉప్పాడ సెంటర్‌లో జరిగిన సభలో పవన్ కల్యాణ్ ప్రకటన ఇది.

జూన్ 21వ తేదీనాడు రెండు యెల్లో మీడియా ప్రధాన పత్రికలు పవన్ కల్యాణ్ ఇంటర్వ్యూను చాంతాడంత పొడవుతో ప్రచురించాయి. అందులో ఒక ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం: ''సీఎం అని మా వాళ్ల కోసం అన్నాను. సీఎం పదవి అంటే చాలా అనుభవం కావాలి. సీఎం అని మా వాళ్లు అదేపనిగా అరుస్తుంటే, నా కేడర్ స్టేట్‌మెంట్‌ను ఆమోదించాను. సీఎం అని మావాళ్లు అనుకుంటే సరిపోదు, ప్రజలు కూడా అనుకోవాలి.''

ఇరవై ఒకటిన పేపర్లలో ఇంటర్వ్యూ వచ్చింది. ఇరవైన 'ఆ రెండు' పత్రికలకు పవన్ ఇంటర్వ్యూ ఇచ్చారు. అంటే పిఠాపురం సభ తర్వాత సరిగ్గా నాలుగు రోజులకు! దేశంలో ఉన్న అష్టాదశ శక్తిపీఠాల్లో సర్వశక్తిమంతమైనదిగా ప్రాచుర్యమున్న పురుహూతికాదేవి శక్తిపీఠం సాక్షిగా చేసిన ప్రకటన నాలుగు రోజులకే చెల్లుబాటు కాకుండా పోయింది.

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ పదిహేనేళ్ల రాజకీయ జీవితంలో ('ప్రజారాజ్యం' స్థాపన దగ్గర నుంచి) తన మాటలను తానే చెల్లుబాటు కాకుండా చేసుకున్న ఘటనలు కోకొల్లలు. రాజకీయాల్లో మా వాడు చెల్లని రూపాయిగా మారిపోతున్నాడని ఆయన అభిమానులు బహిరంగంగానే ఆవేదన పడుతున్నారు. పిఠాపురంలో శక్తిపీఠం సాక్షిగా చేసిన ప్రకటనకు సరిగ్గా 36 రోజుల ముందు ఇదే అంశంపై మంగళగిరిలో ఆయన ఇంకో రకంగా మాట్లాడారు.

మే 11న పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. సీఎం అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ ఇలా బదులిచ్చారు – ''ఒక మాట చెబుతున్నా. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీ చేశాం. 30–40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అటువంటప్పుడు మన వాదన (సీఎం కావాలనే)కు పస ఉండదు. సినిమాల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్‌ను చేయలేదు. నేను సాధించుకున్నదే! రాజకీయాల్లో కూడా టీడీపీ కావచ్చు. బీజేపీ కావచ్చు. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు? నేనే టీడీపీ అధ్యక్షుడినైనా ఆ మాట అనను. బలం, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే పని జరగదు. పొత్తుల కోసం నా ఏకైక కండిషన్ వైఎస్సార్‌సీపీని గద్దె దించాలి. అంతే.'' తన అసలు లక్ష్యాన్ని పవన్ అక్కడ ప్రకటించారు.

'ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానుల నుంచీ, జనసేన కార్యకర్తల నుంచీ విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందేమో'నని ఒక విలేకరి తన సందేహాన్ని పవన్ ముందు వ్యక్తం చేశారు. ''విమర్శలు వస్తాయనే భయాలు నాకు లేవు. అభిమానులు నిరాశపడటానికి ఇదేమీ సినిమా కాదు. కార్యకర్తలైనా సరే నాతో నడిచేవాళ్లే నా వాళ్లు'' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అంటే పొత్తులు ఖాయమనీ, ముఖ్యమంత్రి పదవి అడిగే అర్హత తనకు లేదనీ, కార్యకర్తలు ఇందుకు అంగీకరించవలసిందేననే భావాన్ని ఆయన కుండబద్దలు కొట్టి ప్రకటించారు. మరి నెలరోజులు తిరిగే సరికే పిఠాపురం శక్తిపీఠం సాక్షిగా చేసిన ప్రకటన? సినిమా షూటింగ్ కోసం అనుకోవాలా?

కురుక్షేత్ర సంగ్రామంలో పాల్గొన్న యోధుల్లో కూడా సూపర్‌స్టార్‌లూ, పవర్ స్టార్‌లూ, మెగాస్టార్‌లూ తరహా విభజన ఉండేది. అప్పట్లో అర్ధరథి, రథి, అతిరథి, మహారథి వంటి పేర్లతో పిలిచేవారు కావచ్చు. అందులో ఓ పవర్‌స్టార్ స్థాయి వీరుని పేరు సైంధవుడు. కాకపోతే అతని పవర్ యుద్ధంలో ఒక్కరోజుకే పరిమితం. యుద్ధంలో అతని లక్ష్యం – కౌరవులను గెలిపించడం! స్వయంగా తానే పాండవులను ఓడించాలనే కోరిక అతనికి మొదట్లో ఉండేది. అందుకోసం ఘోరమైన తపస్సు కూడా చేశాడు.

శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. తన చేతిలో పాండవులు ఓడిపోవాలని సైంధవుడు కోరుకున్నాడు. స్థాయికి తగని వరాన్ని ఇవ్వడం పాడి కాదనుకున్నాడు శివుడు. సైంధవుడికి హితవు చెప్పి అర్జునుడు అందుబాటులో లేని రోజున, మిగిలిన నలుగురిని యుద్ధంలో ముందుకు పోకుండా అడ్డుకోగలిగే 'సింగిల్ యూజ్' వరాన్ని ప్రసాదిస్తాడు. ఆ వరం ఒక్కరోజుకే పనికొస్తుందన్న మాట! ఈ 'వన్‌డే వండర్'ను దుర్యోధనుని గెలుపు కోసం ఉపయోగించాలని సైంధవుడు భావిస్తాడు. సైంధవుడి కథ సాంతం మనందరికీ తెలిసిందే. ఇతడి కారణంగానే అభిమన్యుడు అసువులు బాసిన సంగతీ తెలిసిందే. ఎవరైనా హఠాత్తుగా ఊడిపడి ఏ కార్యానికైనా అడ్డుతగిలితే సైంధవుడిలా అడ్డు పడ్డాడనడం రివాజుగా మారింది. 2014లో వైసీపీ విజయానికి పవన్ కల్యాణ్ సైంధవుడిలా అడ్డుపడ్డాడనే మాట కూడా వినిపించింది. అందులో కొంత లాజిక్ కూడా ఉన్నది. రెండు శాతం కంటే తక్కువ తేడాతో అప్పుడు జగన్ పార్టీ అధికారానికి దూరమైంది. జనసేన పార్టీ పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు ఇచ్చింది. అప్పుడు దానికి ఓ నాలుగు శాతం ఓట్లు ఉండవచ్చని అంచనా. 2019లో బీఎస్పీ – కమ్యూనిస్టుల పొత్తుతో జనసేన కూటమికి ఆరు శాతం ఓట్లు పడ్డాయి. ఆ నాలుగు శాతం అంచ నాకు ఇదే ఆధారం. 2014లో జనసేన విడిగా పోటీ చేసిన ట్లయితే ఫలితం తరగబడి ఉండేదేమో!

జనసేనకు స్పష్టమైన సిద్ధాంతాలు గానీ, ఆశయాలు గానీ లేవని జనసేనాపతి మాటల ద్వారానే అర్థం చేసుకోవచ్చు. జనసేన ఆవిర్భవించిన తర్వాత ఈ పదేళ్లలో ఆయన వివిధ సందర్భాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు, చేసిన ప్రసంగాలు, ధారబోసిన భావజాలం, ఒలకబోసిన వాగామృతం – అంతటినీ ప్రోది చేసి చూస్తే ఎంతటివారలైనా గందరగోళానికి గురికాక తప్పదు. అటువంటి గందరగోళానికి జనసైనికులూ, వీర మహిళలూ గురికాకూడదని పవన్ కల్యాణ్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'వ్యూహం నాకొదిలేయండి, మీరు అనుసరించండ'ని కార్యకర్తలతో ఆయన పదేపదే చెబుతున్నారు. 'ఒక్కసారి నేను కమిటయితే మీ మాట మీరే వినకండి, బ్లైండ్‌గా ఫాలో అవ్వండి' అనేది ఆయన సందేశం. రాజకీయ పార్టీ ఇలా కూడా ఉంటుందా? ఉండదు! ఇది చంద్రబాబు ప్రారంభించిన స్పెషల్ పర్పస్ వెహికిల్ అని వైసీపీ వాళ్లు ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థులు అలా ఆరోపిస్తూనే ఉంటారు. కానీ, ఆరోపణ తప్పని రుజువు చేయవలసిన బాధ్యత మాత్రం పవన్ కల్యాణ్ భుజస్కంధాలపైనే ఉన్నది.
వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంతో జనసేన కలిసి పోటీ చేయడమన్నది పక్కా అయినట్లే. ఇది బాబు డిసైడ్ చేసిన స్కీమే కనుక ఇందుకు భిన్నంగా ఉండదు. ఆ దేవుడు శాసించాడు... ఈ అరుణాచలం పాటిస్తాడు, అంతే.

చంద్రబాబు ప్రోద్బలంతో తెలుగుదేశం పార్టీకి ఉపయోగపడే ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్‌గా జనసేన పార్టీ ఏర్పాటైందనే విమర్శ కూడా ఉన్నది. ఇది ఫక్తు రాజకీయ విమర్శే. కానీ, ఈ విమర్శకు బలం చేకూర్చే పరిణామాలు కూడా జరుగుతున్న నేపథ్యంలో దీనిపై లోతైన పరిశీలన అవసరమౌతున్నది. ముఖ్యంగా మూడు అంశాలు జనసేన మీద విమర్శలకు బలం చేకూర్చుతున్నాయి. 1. ఎన్నికల సమయానికల్లా తెలుగుదేశం పార్టీ అవసరాలకు అనుగుణంగా జనసేన ఎత్తుగడలు ఉండటం. 2. ఒక స్థిరమైన సైద్ధాంతిక ప్రాతిపదిక, రాజకీయ దృక్పథం లేకుండా ఎప్పటికప్పుడు రంగులు మార్చేయడం. 3. తాజా పరిస్థితుల్లో జనసేన ఎంచుకుంటున్న క్షేత్ర ప్రాధాన్యతలు, టార్గెట్ చేస్తున్న వ్యక్తులు తెలుగుదేశం పార్టీకి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండటం.

మొదటి ఎన్నికల్లో విడిగా పోటీచేయడం ద్వారా తెలుగుదేశం పార్టీకి దోహదపడిన జనసేన రెండో ఎన్నికల్లో అదే ప్రయోజనం కోసం విడిగా పోటీ చేసింది. అప్పటికి అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏకపక్షంగా పడకుండా చీలిపోతే తనకు ఉపయోగమని భావించింది. ఆ వ్యూహం ప్రకారమే విడిగా జనసేన ఫ్రంట్ ఏర్పాటైందని వైసీపీ ఆరోపణ. ఆ ఆరోపణను పూర్వపక్షం చేయడంలో జనసేన విఫలమైంది. ఇప్పుడు వైసీపీ అధికారంలో ఉన్నది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని టీడీపీ భావిస్తున్నది. ఈ భావననే హెచ్‌ఎంవి గ్రామఫోన్ రికార్డు మాదిరిగా పవన్ కల్యాణ్ పదేపదే వినిపిస్తున్నారనే అభిప్రాయం బలపడుతున్నది. రాజకీయాల్లో జనసేన కూడా టీడీపీ కోసం సైంధవ పాత్ర పోషిస్తున్నదని జనం భావిస్తే ఆ పార్టీ ఎన్ని ఎత్తుగడలు వేసినా ఫలితం ఉండకపోవచ్చు.

జనసేనకు స్పష్టమైన సిద్ధాంతాలు గానీ, ఆశయాలు గానీ లేవని జనసేనాపతి మాటల ద్వారానే అర్థం చేసుకోవచ్చు. జనసేన ఆవిర్భవించిన తర్వాత ఈ పదేళ్లలో ఆయన వివిధ సందర్భాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు, చేసిన ప్రసంగాలు, ధారబోసిన భావజాలం, ఒలకబోసిన వాగామృతం – అంతటినీ ప్రోది చేసి చూస్తే ఎంతటివారలైనా గందరగోళానికి గురికాక తప్పదు. అటువంటి గందరగోళానికి జనసైనికులూ, వీర మహిళలూ గురికాకూడదని పవన్ కల్యాణ్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'వ్యూహం నాకొదిలేయండి, మీరు అనుసరించండ'ని కార్యకర్తలతో ఆయన పదేపదే చెబుతున్నారు. 'ఒక్కసారి నేను కమిటయితే మీ మాట మీరే వినకండి, బ్లైండ్‌గా ఫాలో అవ్వండి' అనేది ఆయన సందేశం. రాజకీయ పార్టీ ఇలా కూడా ఉంటుందా? ఉండదు! ఇది చంద్రబాబు ప్రారంభించిన స్పెషల్ పర్పస్ వెహికిల్ అని వైసీపీ వాళ్లు ఆరోపిస్తున్నారు. ప్రత్యర్థులు అలా ఆరోపిస్తూనే ఉంటారు. కానీ, ఆరోపణ తప్పని రుజువు చేయవలసిన బాధ్యత మాత్రం పవన్ కల్యాణ్ భుజస్కంధాలపైనే ఉన్నది.

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంతో జనసేన కలిసి పోటీ చేయడమన్నది పక్కా అయినట్లే. ఇది బాబు డిసైడ్ చేసిన స్కీమే కనుక ఇందుకు భిన్నంగా ఉండదు. ఆ దేవుడు శాసించాడు... ఈ అరుణాచలం పాటిస్తాడు, అంతే. బీజేపీని కూడా లాక్కొని రావాల్సిన బాధ్యతను పవన్‌కు బాబు అప్పగించారు కనుక ఆ ప్రయత్నంలో భాగంగా కొంత వ్యూహాత్మక ఆలస్యం జరిగి ఉండవచ్చు. 34 అసెంబ్లీ సీట్లున్న గోదావరి జిల్లాల్లో గణనీయంగా ఉన్న కాపు సామాజిక వర్గాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చే కర్తవ్య దీక్షతో వారాహి రథం మొదట గోదావరి తీరానికే చేరింది. కాపులతోపాటు ఇతర వర్గాల్లో కూడా పేరు ప్రఖ్యాతులున్న ముద్రగడ పద్మనాభంపై కొత్తతరం కాపు యువతను ఎగదోసే ప్రయత్నం చేశారు. ముద్రగడను అవమానించిన వ్యక్తి చంద్రబాబు. చంద్రబాబు శత్రువు తనకూ శత్రువే అన్నట్టుగా పవన్ కల్యాణ్ ఈ పర్యటనలో వ్యవహరించారు. ముద్రగడను సామాజిక వర్గానికి దూరం చేయకుండా ఆ ఓట్లను బాబు వైపు మళ్లించడం సాధ్యంకాకపోవచ్చన్న ఆలోచన కూడా ఈ టార్గెట్‌కు కారణం కావచ్చు. తన సామాజికవర్గ బలం పెద్దగా లేకపోయినా అన్నివర్గాల మద్దతుతో కాకినాడలో నెగ్గుకొస్తున్న ద్వారంపూడిపై తీవ్ర స్థాయిలో పవన్ విరుచుకుపడ్డారు. ఇందుకు బదులుగా కాకినాడలో ద్వారంపూడిపై గానీ, పిఠాపురంలో తనపై గానీ పోటీ చేయాలని ముద్రగడ విసిరిన సవాల్‌కు మాత్రం పవన్ జవాబు చెప్పలేకపోయారు.

ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం సహజం. పవన్ కూడా ప్రభుత్వం మీద ఈ పర్య టనలో చాలా విమర్శలే చేశారు. ఆ విమర్శలకు ఆధారం మాత్రం యెల్లో మీడియా కథనాలు, తెలుగుదేశం ప్రవచనాలే అన్నట్టుగా ఈ పర్యటన సాగింది. ఒకటి రెండు ఉదాహరణలు చూద్దాం. రాష్ట్రంలో 31,177 మంది మహిళలు అదృశ్యమయ్యారనీ, వీరిలో 40 శాతం మంది 18 యేళ్లలోపు యువతులేననీ, నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో లెక్కల ఆధారంగా చెబుతున్నాననీ పవన్ అన్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 2019 నుంచి 2022 మధ్యకాలంలో రాష్ట్రాల వారీగా మహిళల అదృశ్యానికి సంబంధించిన టాప్–టెన్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ పేరే లేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో రాష్ట్రంలో అదృశ్యమైన వారి సంఖ్య 2,746. అందులో 2,737 మందిని సురక్షితంగా మళ్లీ ఇళ్లకు చేర్చారు. ఇంకా జాడ తెలియనివారు కేవలం తొమ్మిది (9) మంది మాత్రమే. అదే బాబు హయాంలో అంతకు ఒక సంవత్సరం ముందు 2018లో అదృశ్యమైన మహిళల సంఖ్య 6,520. అందులో ఇళ్లకు చేరిన వారు 2,195 మంది. 4,325 మంది జాడను ఆ ప్రభుత్వం కనిపెట్టలేకపోయింది. బాబు హయాంలోని ఐదేళ్లు, జగన్ హయాంలో నాలుగేళ్ల లెక్కలూ దాదాపు ఇదేవిధంగా ఉన్నాయి. వాస్తవాలకు మసిపూయడంలో ఈయన యెల్లో మీడియాతో పోటీపడుతున్నట్టున్నారు.

గడచిన ఎన్నికల్లో తనను భీమవరం నియోజకవర్గంలో కక్షకట్టి ఓడించారనీ, అక్కడ మొత్తం ఓట్లకంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయని మరో ఆరోపణ చేసి నవ్వుల పాలయ్యారు. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం అక్కడ 77.5 శాతం ఓట్లు పోలయ్యాయి. 22.6 శాతం మంది ఓటే వేయలేదు. ప్రజల తెలివితేటల మీద, వివేచనా శక్తి మీద చులకన భావం ఉన్నవారు మాత్రమే ఇటువంటి ఆరోపణలు చేయగలుగుతారు. తొలివిడత వారాహి యాత్ర జనసేన పార్టీకి పెద్దగా ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయింది. తనకు కంచుకోటగా పవన్ భావించుకునే ప్రాంతాల్లో రోడ్లపై జరిగిన సభలకు ఎక్కడా మూడు నాలుగు వేలమందికి మించి రాలేదు. అందులో సగంమంది ఇరవయ్యేళ్ల లోపు పిల్లలే! ఎక్కడా యాభై మందికి మించి మహిళలు కనిపించలేదు. ఒక్క అమలాపురంలో మాత్రం సుమారు రెండొందలమంది కనిపించారు. జనసేన పార్టీకి జనసందేశం ఏమిటో అందినట్టేనా? ఈ సందేశానికి కారణమేమిటి? చంద్రబాబు ఎజెండా ప్రకారం జనసేన పనిచేస్తున్నదనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లడమే కారణం. దాన్ని పూర్వపక్షం చేయాలంటే ఒకటే మార్గం. జనసేన 175 నియోజక వర్గాల్లో పోటీ చేయడం. లేదంటే పవన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించి మెజారిటీ స్థానాల్లో పోటీచేసి ఇతర పార్టీలతో మిగిలినచోట్ల పొత్తు పెట్టుకోవడం. జగన్ ప్రభుత్వం కంటే మెరుగ్గా తానెలా పరిపాలించ బోతున్నాడో సోదాహరణంగా చెప్పగలగడం. అలా చేయకుండా చంద్రబాబు విసిరే పాతిక, ముప్పయ్ సీట్లను మహాప్రసాదంగా కళ్లకు అద్దుకుంటే జనసేన పార్టీ తెలుగుదేశం అనుబంధ సంఘమనే ప్రజాభిప్రాయాన్ని అధికారికంగా ధ్రువీకరించినట్టే!

గడచిన ఎన్నికల్లో తనను భీమవరం నియోజకవర్గంలో కక్షకట్టి ఓడించారనీ, అక్కడ మొత్తం ఓట్లకంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయనీ మరో ఆరోపణ చేసి నవ్వులపాలయ్యారు. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం అక్కడ 77.5 శాతం ఓట్లు పోలయ్యాయి. 22.6 శాతం మంది ఓటే వేయలేదు. ప్రజల తెలివితేటల మీద, వివేచనా శక్తి మీద చులకన భావం ఉన్నవారు మాత్రమే ఇటువంటి ఆరోపణలు చేయగలుగుతారు. తొలివిడత వారాహి యాత్ర జనసేన పార్టీకి పెద్దగా ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయింది. తనకు కంచుకోటగా పవన్ భావించుకునే ప్రాంతాల్లో రోడ్లపై జరిగిన సభలకు ఎక్కడా మూడు నాలుగు వేలమందికి మించి రాలేదు. అందులో సగంమంది ఇరవయ్యేళ్ల లోపు పిల్లలే! ఎక్కడా యాభై మందికి మించి మహిళలు కనిపించలేదు. ఒక్క అమలాపురంలో మాత్రం సుమారు రెండొందల మంది కనిపించారు. జనసేన పార్టీకి జనసందేశం ఏమిటో అందినట్టేనా? ఈ సందేశానికి కారణమేమిటి? చంద్రబాబు ఎజెండా ప్రకారం జనసేన పనిచేస్తున్నదనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లడమే కారణం. దాన్ని పూర్వపక్షం చేయాలంటే ఒకటే మార్గం. జనసేన 175 నియోజకవర్గాల్లో పోటీ చేయడం. లేదంటే పవన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించి మెజారిటీ స్థానాల్లో పోటీచేసి ఇతర పార్టీలతో మిగిలినచోట్ల పొత్తు పెట్టుకోవడం. జగన్ ప్రభుత్వం కంటే మెరుగ్గా తానెలా పరిపాలించబోతున్నాడో సోదాహరణంగా చెప్పగలగడం. అలా చేయకుండా చంద్రబాబు విసిరే పాతిక, ముప్పయ్ సీట్లను మహాప్రసాదంగా కళ్లకు అద్దుకుంటే జనసేన పార్టీ తెలుగుదేశం అనుబంధ సంఘమనే ప్రజాభిప్రాయాన్ని అధికారికంగా ధ్రువీకరించినట్టే! ఏటా రుతుపవనాలు వచ్చి పోయినట్టే చంద్రబాబుకు అవసరమైనప్పుడల్లా ఒక సైంధవ పవనం వచ్చి పోయేదని చరిత్రలో స్థిరపడిపోతుంది.

vardhelli1959@gmail.com

ప్రజాస్వామ్యాన్ని చెరబట్టిన రాత్రి

సందర్భం



జిల్లా గోవర్ధన్

జూన్ 25, 1975 రాత్రి: 1, సఫ్దర్ జంగ్ రోడ్డు, న్యూఢిల్లీ, దేశ ప్రధాని ఇందిరాగాంధీ నివాసం. కాంగ్రెస్ సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సిద్ధార్థ్ శంకర్ రేతో సీరియస్‌గా ముచ్చటిస్తున్నారు ఇందిరాజీ. ఆ రోజు సాయంత్రం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ప్రతిపక్ష పార్టీల అగ్ర నాయకులు అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయి, చంద్రశేఖర్ ఒకే వేదికపై నుండి, అలహాబాదు హైకోర్టు జడ్జిమెంట్‌ను ప్రస్తావించి ఇందిరా జీని ప్రధాని పదవి నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటెలిజెన్స్ ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఇందిర ఈ విషయంపైనే చర్చిస్తున్నారు.

ఇంతకూ అలహాబాద్ కోర్టు తీర్పేమిటో చూద్దాం. 1975 జూన్ 12 నాడు ఇందిరాగాంధీ నిలిచి గెలిచిన రాయబరేలి లోక్‌సభ ఎన్నిక (1971) చెల్లదనీ, ఆరేళ్లు ఆమె ఎన్నికల్లో పోటీచేయరాదనీ కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును సుప్రీం కోర్టులో అప్పీల్ చేయడంతో, పాక్షిక ఉపశమనంగా జస్టిస్ కృష్ణయ్యర్, ఆమెను తాత్కాలికంగా ప్రధాని పదవిలో కొనసాగిస్తూ, పార్లమెంటులో ఓటు హక్కును మాత్రం వినియోగించుకోరాదని స్టే ఆర్డర్ ఇచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ దిగ జారుతున్న రోజులవి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటివి పెరిగి పోతున్నాయి.

'ప్రస్తుత పరిస్థితులు సద్దుమణిగే వరకు నేను రాజీనామా చేసి, దేవకాంత్ బరూవాను కొంతకాలం మధ్యంతర ప్రధానిగా నామినేట్ చేయాలనుకుంటున్నాను' అని మనసులోని మాటను సిద్ధార్థ్ శంకర్ రేతో బహిర్గతం చేశారు మేడం గాంధీ. ఆమె అనటమే తడవు, 'నో మమ్మీ! నువ్వు రాజీనామా చేసే ప్రసక్తే లేదు' అన్నారు ప్రధాని చిన్న కుమారుడు 29 ఏళ్ల సంజయ్. సిద్ధార్థ బాబుతో, 'రాజ్యాంగం దృష్ట్యా దీనికి ఏదైనా మార్గం ఉంటే చెప్పండి' అన్నారు సంజయ్. 'ఇప్పటి దేశ సమస్యల రీత్యా మనం రాజ్యాంగంలో ఆర్టికల్ 352ను అనుసరించి 'అంతర్గత అత్యయిక పరిస్థితి' (ఇంటర్నల్ ఎమర్జెన్సీ) విధించవచ్చనీ, దీనికి క్యాబినెట్ సమ్మతి, ఆ తర్వాత రాష్ట్రపతి ఆర్డినెన్సు అవసరం అనీ, ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుందనీ లీగల్ సలహా ఇచ్చారు రే.

'మరేం ఫర్లేదు, క్యాబినెట్ ఆమోదం రేపు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ రాత్రికి రాష్ట్రపతి ఆర్డినెన్స్ ప్రక్రియ మాత్రం పూర్తి చేద్దాం' అన్నారు సంజయ్. ప్రధాని చేతిలోని పరిపాలనా పగ్గాలు అనధికారికంగా, అనుకోకుండానే అలా సంజయ్ చేతిలోకి వెళ్లాయి. హుటాహుటిన పర్సనల్ స్టాఫ్‌తో ఒక తెల్ల కాగితం మీద డ్రాఫ్ట్ టైప్ చేయించారు శంకర్ రే. 'ప్రస్తుతం దేశం అంతర్గత అల్లర్ల దరిమిలా శాంతి భద్రతలకు తీవ్ర అపాయం వాటిల్లుతున్నందులకు రాజ్యాంగం ఆర్టికల్ 352(1)ని అనుసరించి అత్యవసర పరిస్థితి విధించడం అనివార్యం. దీనితో జత పరచిన ఆర్డినెన్సుపై మీ సంతకం చేయవలసిందిగా కోరుతున్నాను. ఈ రోజు సమయం లేనందున, బిజినెస్ రూల్స్, 1961 ప్రకారం, రేపు ఉదయమే ఈ విషయం క్యాబినెట్ కమిటీలో చర్చించి, మంత్రివర్గ సమ్మతి మీకు అందజేస్తా'మని ఆ లెటరులో రాసి, ప్రధాని ఇందిర సంతకం చేయించారు రే.



ఆయనే స్వయంగా ఆ లేఖ తీసుకొని రాష్ట్రపతి భవన్‌కు చేరుకునేటప్పటికి రాత్రి 11 దాటింది. అప్పటికి గాఢనిద్రలో ఉన్న రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌ను అర్జంట్ పని అని చెప్పి నిద్ర లేపమని సిబ్బందిని కోరారు. పది నిమిషాల తర్వాత నైట్ గౌనులో ప్రెసిడెంట్ హాలులోకి రావడంతో తను వచ్చిన విషయం వివరించారు రే. వెంట తెచ్చిన ప్రధాని ఉత్తరం, ప్రొక్లమేషన్ కాపీ ఆయనకు అందించారు. అనిష్టంగానే ప్రొక్లమేషన్ కాపీపై సంతకం చేసి రాష్ట్రపతి సీల్ ముద్ర వేశారు. ఆ రాత్రి ప్రధాని కార్యాలయంలోని సిబ్బంది... సంజయ్ గాంధీ, సిద్ధార్థ్ శంకర్ రే పర్యవేక్షణలో చకచకా పనుల్లో మునిగిపోయారు. మొట్ట మొదట న్యూఢిల్లీలోని జాతీయ పత్రికల కార్యాలయాల్లో కరెంటు కట్ జేశారు. మరుసటి రోజు రావలసిన వార్తా పత్రికల ముద్రణ ఆగిపోయింది. పలు రాష్ట్రాల్లోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు ప్రముఖ ప్రతిపక్ష నాయకులను వెంటనే కస్టడీలోకి తీసుకోవలసిందిగా ఆర్డర్లు జారీ అయ్యాయి. జయప్రకాశ్ నారాయణ్, చరణ్ సింగ్, వాజ్‌పేయి, అడ్వాణీలను రాత్రికి రాత్రే అరెస్టు చేశారు. తెల్లవారటంతోనే కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగ్జీవన్ రామ్, వైబీ చవాన్, స్వరణ్ సింగ్, బ్రహ్మానంద రెడ్డి ఇళ్ళ ఆవరణలో సీఐడీ అధికారులను నియమించి, అటు వస్తూ వెళ్ళే ఆగంతకులపై ఒక 'నజర్' ఉంచాల్సిందిగా ఆర్డర్లు వెళ్లాయి.

26 జూన్, ఉదయం 10 గంటలకు ప్రధాని నివాసంలో క్యాబినెట్ కమిటీ మీటింగు ఏర్పాటు చేశారు. ఇందిర తన ప్రసంగంలో దేశం ఎదుర్కొంటున్న విషమ పరిస్థితులను వివరిస్తూ, ప్రతిపక్ష నాయకులు... ప్రభుత్వాన్నీ, పోలీసు వ్యవస్థనూ, ప్రజలనూ పెడతోవ పట్టిస్తున్న విషయాలు వివరించి, దీనికి ఉపశమనంగా కొంతకాలం అత్యవసర పరిస్థితి అవసరమని చెప్పారు. గత రాత్రి నుండే పరిస్థితులు అనూహ్యంగా మారిన విషయం క్యాబినెట్ మంత్రులకు అవగతమవటంతో, భయాందోళన రీత్యా, ప్రధానికి వ్యతిరేకంగా రేకెత్తుతున్న కొన్ని గళాలు నాటకీయంగా మూగవోయి ఆమె చర్యకు పూర్తి మద్దతు తెలిపాయి. ఏకగ్రీవంగా అత్యవసర పరిస్థితికి మద్దతు తెలిపి తయారు చేసిన రిజల్యూషన్ రాష్ట్రపతికి పంపింది క్యాబినెట్ కమిటీ. కేవలం 90 నిమిషాల పాటు జరిగిన ఆ క్యాబినెట్ మీటింగ్ ద్వారా, రాజ్యాంగం ప్రజలకందించిన ప్రజాసామ్య హక్కులు వారి నుండి 18 జనవరి, 1977 వరకు హరించబడ్డాయి.

వ్యాసకర్త మాజీ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ | 98190 96949

(ప్రణబ్ ముఖర్జీ 'ద డ్రమెటిక్ డికేడ్', కుల్దీప్ నయ్యర్ 'బియాండ్ ద లైన్స్' ఆధారంగా)

క్లుప్తంగా...

ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు యువకుడి బలి


అంకూస్ మృతదేహం

హసన్‌పర్తి: ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమకొండ జిల్లా ఒకటో డివిజన్ పలివేల్పులలో శనివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. పలివేల్పులకు చెందిన సల్ల రాజా అంకూస్ (33) ప్రైవేట్ ఉద్యోగి. గతేడాది ఇంటి నిర్మాణానికి హంటర్‌రోడ్‌లోని హిందుస్తాన్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.4 లక్షల రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా వాయిదా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాడు. ఈ నెల రుణ వాయిదా చెల్లింపు ఆలస్యమైంది. ఫైనాన్స్ సిబ్బంది శుక్రవారం రాజా అంకూస్ ఇంటికి వచ్చి అతనిపై దౌర్జన్యం చేశారు. దీంతో మానసిక వేదనకు గురైన అంకూస్.. ఫైనాన్స్ సిబ్బంది ముందే పురుగు మందు తాగాడు. అది గమనించిన సిబ్బంది అక్కడినుంచి పరారయ్యారు. కుటుంబ సభ్యులు అంకూస్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్


ఉదయ్ (ఫైల్)

నెక్కొండ: ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ఓ యువకుడు నిండు ప్రాణం తీసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలావుపేటలో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలావుపేట గ్రామానికి చెందిన భాషబోయిన కమలాకర్–స్వప్న దంపతుల రెండో కుమారుడు ఉదయ్(20) ఖానాపురం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. తమకున్న రెండెకరాల్లో సాగు చేసిన వరి ధాన్యం విక్రయించగా రూ.50 వేలు తల్లి పేరిట బ్యాంక్ ఖాతాలో శుక్రవారం జమయ్యాయి. అదేరోజు రాత్రి తల్లిదండ్రులు ఓ గదిలో నిద్రిస్తుండగా మరో గదిలో ఉదయ్ తన తల్లి మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ (రమ్మీ) ఆడాడు. తల్లి బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ నుంచి రూ. 46వేలు ఆటలో పోగొట్టుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు తిడతారన్న భయంతో ఉదయ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి సుమారు 1.30 గంటల సమయంలో ఉదయ్ ఉన్న గదిలో ఫోన్ చార్జర్ కోసం తండ్రి కమలాకర్ వెళ్లగా.. ఫ్యాన్‌కు వేలాడుతూ కొడుకు కనిపించాడు. భార్యను లేపి చూడగా అప్పటికే మృతిచెందాడు. కమలాకర్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

అన్నం పెట్టని తనయుడు

పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు


విజయ

వెంకటాపురం(ఎం): కుమారుడు పట్టెడన్నం కూడా పెట్టడం లేదని ఓ తల్లి పోలీస్‌స్టేషన్ మెట్లెక్కింది. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం పాలంపేటలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాలంపేట గ్రామానికి చెందిన తడక విజయ (60) భర్త రెండేళ్ల క్రితం మరణించాడు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. భర్త మరణించినప్పటినుంచి కుమారుడు కుమారస్వామి అన్నం పెట్టడం లేదని, తన ఆరోగ్యం కూడా సహకరించడం లేదని విజయ పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన ఎస్‌ఐ తాజుద్దీన్ వెంటనే కుమారుడిని స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని హెచ్చరించారు. తల్లి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలని, ఏటా రెండు క్వింటాళ్ల బియ్యంతోపాటు ఇతరత్రా ఖర్చుల నిమిత్తం అదనంగా రూ.20 వేలు ఇవ్వాలని సూచించగా కుమారుడు అంగీకరించాడు.

కొడుకుకు ఉరేసి.. ఆపై ఉరేసుకొని

- హైదరాబాద్‌లో గర్భిణి ఆత్మహత్య
- అత్త కొట్టిందని తల్లికి ఫోన్ చేసిన గంటల వ్యవధిలోనే బలవన్మరణం
- వరకట్న వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ


భర్త విశ్వనాథ్, కొడుకు మనీష్‌తో మృతురాలు శిరీష

బంజారాహిల్స్: మూడేళ్ల బిడ్డ ఆలనాపాలన ఓవైపు... కడుపున పెరుగుతున్న శిశువు ఎదుగుదలను చూసుకోవాల్సిన బాధ్యత మరోవైపు. ఈ క్రమంలో అత్తింటి వారి వేధింపులు రోజురోజుకూ ఎక్కువ కావడంతో ఆ తల్లి తట్టుకోలేకపోయింది. మరణమే శరణ్యమని భావించింది. 'అమ్మా... మా అత్త నన్ను చితకబాదింది... ఏం చేస్తారో అని భయమేస్తోంది... చచ్చిపోవాలనిపిస్తోంది' అంటూ రోదిస్తూ తల్లికి ఫోన్ చేసిన 12 గంటల వ్యవధిలోనే బలవన్మరణానికి పాల్పడింది. తన ఒడిలో పడుకున్న బిడ్డకు ముందుగా ఉరేసి ఆ తర్వాత కడుపున ఉన్న బిడ్డతో సహా తనువు చాలించింది. ఈ హృదయ విదారక ఘటన హైదరాబాద్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో చోటుచేసుకుంది.

పెళ్లయిన నెల నుంచే వేధింపులు...

మేడిపల్లికి చెందిన శిరీష (23) వివాహం ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీకి చెందిన కారు డ్రైవర్ కావటి విశ్వనాథ్ (32)తో 2019 జూన్ 9న జరిగింది. వివాహ సమయంలో రూ. 8 లక్షల కట్నంతోపాటు 15 తులాల బంగారం ఇచ్చారు. పెళ్లి జరిగిన నెల రోజులకే అత్త బసవమ్మ, భర్త విశ్వనాథ్ విశ్వరూపం చూపించారు. రోజూ కొట్టడంతోపాటు, అదనపు కట్నం తెమ్మంటూ పుట్టింటికి తరచూ పంపేవారు. పుట్టింటికి వచ్చిన శిరీషకు తల్లి లక్ష్మి అప్పుచేసి ఒక్కోసారి రూ. లక్ష చొప్పున అయిదుసార్లు డబ్బులు ఇచ్చి పంపింది. అయినాసరే కూతురు కాపురం బాగుపడకపోగా రోజురోజుకూ వేధింపులు పెరిగిపోయి అత్తతోపాటు భర్త విశ్వనాథ్ తీవ్రంగా కొట్టేవాడు. ఈ నెల 9న పెళ్లి రోజున కూడా ఆమెను చితకబాదాడు. అదనపు కట్నం తేవాలంటూ పుట్టింటికి పంపించేందుకు యత్నించగా ఈసారి ఆమె కాళ్లావేళ్లాపడింది. అయినాసరే ఆ కర్కశ హృదయాలు కరగలేదు. శుక్రవారం ఉదయం 12 గంటలకు తల్లికి ఫోన్ చేసి అత్త కొట్టిందంటూ చెప్పి భోరుమంది. వాళ్ల కదలికలు చూస్తుంటే తనను ఏదో చేసేలా ఉన్నారంటూ ఫోన్ కట్ చేసింది. ఆ తర్వాత తల్లి లక్ష్మి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో అల్లుడు విశ్వనాథ్ అత్త లక్ష్మికి ఫోన్ చేసి మీ కూతురు ఉరేసుకుందంటూ చెప్పాడు. కన్నీరుమున్నీరైన మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బస్తీకి పరిగెత్తుకొచ్చారు. కుమార్తెతోపాటు పక్కనే చిన్నారి మనీష్ విగతజీవిగా కనిపించడంతో గుండెలవిసేలా రోదించారు. తన కూతురు వరకట్న వేధింపులతోనే చనిపోయిందని... ఆమె మృతిపై విచారణ జరపాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు భర్త విశ్వనాథ్‌పై ఐపీసీ సెక్షన్ 304 (బీ), 498 (ఏ), 3, 4, వరకట్న నిషేధిత చట్టం, రెడ్‌విత్ 109 కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అత్త బసవమ్మ, మామ రమేష్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కేఎంసీ పీజీ విద్యార్థినికి అస్వస్థత

- అధిక మోతాదులో మైగ్రేన్ మాత్రలు వేసుకోవడం వల్లే..
- ఆత్మహత్యాయత్నం చేసిందంటూ వదంతులు
- ఖండించిన కేఎంసీ ప్రిన్సిపాల్

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థిని ప్రీతి మృతిపై వివాదం ఇంకా సద్దుమణగకముందే పీడియాట్రిక్ పీజీ విభాగంలో సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థిని శనివారం అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. బయట హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని... ఎంజీఎంలో శుక్రవారం రాత్రి పీడియాట్రిక్ విభాగంలో విధులు నిర్వహించింది. శనివారం ఉదయం విధులు ముగించుకొని హాస్టల్‌కు వెళ్లింది. ఆ తరువాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఎంజీఎంలో చేరింది. దీంతో మరో పీజీ విద్యార్థిని పెద్ద మోతాదులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే వదంతులు వ్యాపించాయి. సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ వదంతుల్ని ఖండించారు. మైగ్రేన్ నొప్పి రావడంతో దానికి సంబంధించినటువంటి మాత్రలు వేసుకుందని అప్పటికీ నొప్పి తగ్గకపోవంతో ఎక్కువ మోతాదులో మాత్రలు తీసుకుంది. అస్వస్థతకు గురికావడంతో ఎంజీఎంలో చేరిందని వివరించారు.

రైతుపై కోతుల దాడి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామానికి చెందిన రైతు అంజయ్యపై శనివారం కోతుల మంద దాడి చేసింది. దొరగారికుంటలో ఉన్న తన భూమిలో అంజయ్య నారు పోశాడు. శనివారం వెళ్లి చూడగా మొలకెత్తిన నారును కోతులు పీకి వేస్తుండటంతో రాయి తీసుకొని కొట్టాడు. అక్కడే ఉన్న కోతులమంద రైతుపై దాడి చేయడంతో తప్పించుకునేందుకు పరుగుపెట్టగా గట్టుపై నుంచి జారి కింద పడటంతో పక్కటెముకలు విరిగిపోయాయి. వెంటనే స్థానికులు నుంచి అతడిని ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రికి తరలించారు.

న్యాయం చేయకుంటే నక్సలైట్‌గా మారుతా!

- మాజీ దళకమాండర్ దేవన్న కుమారుడు సాత్విక్
- తన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేశారని ఆరోపణ


వివరాలు వెల్లడిస్తున్న దేవన్న భార్య, పిల్లలు

ఇల్లెందు: ప్రజాప్రతిఘటన పార్టీలో దళ కమాండర్‌గా పనిచేసిన తన తండ్రి బొల్లి రామయ్య అలియాస్ దేవన్న లొంగిపోతే పునరావాసం కింద ప్రభుత్వం ఇచ్చిన భూమిని కొందరు కాజేశారని, రెవెన్యూ అధికారులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని దేవన్న కుమారుడు సాత్విక్ ఆరోపించాడు. తమ కుటుంబానికి న్యాయం చేయకుంటే నక్సలైట్‌గా మారుతానని చెప్పాడు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో సాత్విక్ విలేకరులతో మాట్లాడాడు. తన తండ్రికి ఇల్లెందు – ఖమ్మం రహదారిలోని సుభాష్‌నగర్ వద్ద 603 సర్వే నంబర్‌లో ప్రభుత్వం మూడు గుంటల భూమి ఇచ్చిందని చెప్పాడు. అయితే పట్టణానికి చెందిన రాము అనే వ్యక్తి తమ భూమితో పాటు పక్కనున్న 16 గుంటల ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశాడని ఆరోపించాడు. తన తండ్రి దేవన్న మృతిచెందడంతో దొంగ పత్రాలు సృష్టించారని, రెవెన్యూ అధికారులు సైతం ఆయనకే వత్తాసు పలుకుతున్నారని చెప్పాడు. తన తండ్రి ఆయుధం వదిలినందుకు సర్కారు ఇచ్చిన స్థలాన్ని తిరిగి ఆయుధం పట్టుకుని కాపాడుకుంటానని సాత్విక్ తెలిపాడు. దీనిపై ఇల్లెందు తహసీల్దార్ కృష్ణవేణిని వివరణ కోరగా.. రెండు, మూడు రోజుల్లో విచారణ చేస్తామని తెలిపారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత


అస్వస్థతకు గురైన విద్యార్థులు

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి పాఠశాలలో 180 మంది విద్యార్థులు వంకాయ కూర, ఉడికించిన కోడి గుడ్డుతో భోజనం చేశారు. దీనికి ముందుగా గడువు తీరిన బిస్కెట్లను విద్యార్థులకు పంపిణీ చేయడంతో తిన్నారు. అందులో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి, సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు.

పోడు రైతులకు 30 నుంచి పట్టాల పంపిణీ

- ఆసిఫాబాద్‌లో రైతులకు అందజేయనున్న సీఎం కేసీఆర్
- రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో పంపిణీకి ఏర్పాట్లు
- వెల్లడించిన మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పుస్తకాల పంపిణీకి సర్వం సన్నద్ధమైంది. అర్హత ఉన్న రైతులకు పట్టాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రారంభిస్తారు. ఆ జిల్లాల్లో అర్హులైన గిరిజన రైతులకు పట్టాలను పంపిణీ చేస్తారు. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం పట్టాల పంపిణీ చేసి అక్కడ జరిగే బహిరంగసభలో సీఎం ప్రసంగిస్తారు. వాస్తవానికి పట్టాల పంపిణీ ఈనెల 24న ప్రాథమికంగా ఖరారు చేసినప్పటికీ.. కొన్ని కారణాల వల్ల ఈనెల 30కి మార్చారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం ప్రకటన విడుదల చేశారు.

1,50,012 మంది రైతులకు 4,50,601 ఎకరాలు..

పోడుభూముల్లో సాగుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి గిరిజనులు, ఆదివాసీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన అధికారులు అర్హతలను ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,50,012 మంది రైతులు 4,50,601 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నట్లు గుర్తించారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది రైతులు 1,51,195 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నట్లు దరఖాస్తులు సమర్పించారు. ఈ లెక్కన ఒక్కో రైతు సగటున 3 ఎకరాలు సాగు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లాలో 24972 మంది రైతులు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,254 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. ఈ రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పట్టాలను అందించిన తర్వాత ఇతర జిల్లాల్లో సంబంధిత జిల్లా మంత్రులు కూడా అదేరోజు పట్టాల పంపిణీ చేస్తారు. పోడు సమస్యకు పరిష్కారం చూపాలన్న సీఎం కేసీఆర్ సంకల్పానికి గిరిజనులు కృతజ్ఞతులై ఉంటారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.



రోస్తోవ్‌లో యుద్ధ ట్యాంకుపై వాగ్నర్ గ్రూప్ సభ్యుడు



సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న 'పీఎంసీ వాగ్నర్ సెంటర్' కార్యాలయం వద్ద రష్యా పోలీసులు


రోస్తోవ్ నగరంలో ఓ పౌరుడిని నిర్బంధించిన వాగ్నర్ సభ్యులు

గర్జించిన చెఫ్

వంటవాడి నుంచి ప్రైవేటు సైన్యం దాకా ప్రిగోజిన్ ప్రస్థానంలో ఎన్నో మలుపులు

ఉక్రెయిన్ సహా వివిధ దేశాల మిలటరీ ఆపరేషన్లలో రష్యా అధినేత పుతిన్‌కు అండదండగా ఉన్న ప్రైవేట్ సైనిక సంస్థ వాగ్నర్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ హఠాత్తుగా రష్యన్ సైన్యంపై తిరుగుబాటు చేయడానికి ఎన్నో కారణాలున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రలోవాగ్నర్ సంస్థకి తగిన గుర్తింపు రాలేదు. గుర్తింపు అంతా రక్షణ మంత్రి షొయిగు కొట్టేస్తున్నారని రగిలిపోతున్నారు. ఈ ఏడాది జనవరిలో ఉక్రెయిన్‌లో డొనెట్‌స్క్ ప్రాంతంలో సొలెడార్‌ను ఆక్రమించడంలో వాగ్నర్ సైనికులు ప్రాణాలు పణంగా పెడితే రష్యా రక్షణ శాఖ దానిని తమ ప్రతిభగా ప్రచారం చేసుకోవడం ప్రిగోజిన్ సహించలేకపోయారు. ఉక్రెయిన్‌లో ఇతర నగరాలు స్వాధీనం చేసుకోవడానికి తాను సైన్యాన్ని సిద్ధం చేసినప్పటికీ రష్యా టాప్ జనరల్ వలెరి గెరసిమోవ్ మారణాయుధాల్ని సరఫరా చేయడంలో విఫలం కావడం కూడా ఆయనని అసహనానికి లోను చేసింది. రక్షణ మంత్రి షొయిగు ఆదేశాల మేరకు వాగ్నర్ సంస్థ సైనిక శిబిరాలపై జరిగిన దాడుల్లో వేలాది మంది సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో తిరుగుబాటుకు సిద్ధమయ్యానని ప్రిగోజిన్ విడుదల చేసిన వీడియోల్లో ఆగ్రహంతో ఊగిపోతూ చెబుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని రష్యా సమర్థించుకునే స్థితిలో లేదని అందుకే మిలటరీ నాయకత్వాన్ని కూల్చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. 'యుద్ధం అవసరం ఉంది. అందుకే సెర్గీ మార్షల్ అయ్యారు. ఆయన రెండో హీరోగా పతకాలు అందుకోవచ్చు. కానీ ఉక్రెయిన్ నిస్సైనీకరణ కు యుద్ధం అవసరం లేదు'అని ప్రిగోజిన్ చెబుతున్నారు. తాను చేస్తున్నది సైనిక తిరుగుబాటు కాదు, న్యాయ పోరాటమన్నది ప్రిగోజిన్ వాదనగా ఉంది.


2011లో మాస్కోలోని రెస్టారెంట్‌లో ప్రిగోజిన్‌తో పుతిన్

ఎవరీ ప్రిగోజిన్?

ఒకప్పుడు అధ్యక్షుడు పుతిన్ దగ్గర చెఫ్. విదేశీ ప్రముఖులు ఎవరైనా వస్తే స్వయంగా గరిటె పట్టి వండి వడ్డించేవారు. ఇప్పుడు తుపాకీ పట్టుకొని ఎదురు తిరుగుతున్నారు. ఒక రెస్టారెంట్‌తో మొదలైన ఆయన ప్రయాణం ఒక దేశంపైనే తిరుగుబాటు చేసే స్థాయికి ఎదిగింది.

- 1961 జూన్ 1న లెనిన్‌గ్రాడ్ (ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్)లో జన్మించారు.
- టీనేజీలోనే దొంగతనాలు, దోపిడీలు చేసి 13 ఏళ్లపాటు జైల్లో ఉండి 1990లో బయటకు వచ్చాడు.
- జైలు నుంచి బయటకి వచ్చాక ఫుడ్ బిజినెస్ మొదలు పెట్టారు. ధనికులు ఉండే ప్రాంతంలో ఒక రెస్టారెంట్ ప్రారంభించారు.
- సంపన్నులతో పరిచయాలు పెంచుకొని వ్యాపారంలో ఎదిగారు.
- ప్రిగోజిన్‌కు చెందిన ఒక రెస్టారెంట్‌కు పుతిన్ వస్తూ ఉండడంతో ఆయనతో పరిచయమైంది. ఆ తర్వాత ప్రాగోజిన్ జీవితమే మారిపోయింది.
- అప్పట్లో రష్యా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న పుతిన్ ద్వారా రష్యా ప్రభుత్వం ఇచ్చే అధికారిక విందుల్ని ఏర్పాటు చేసే కాంట్రాక్ట్ లభించింది.
- 2001లో పుతిన్ అధ్యక్షుడయ్యాక ప్రభుత్వానికి చెందిన సైనిక, పాఠశాలల్లో ఫుడ్ కాంట్రాక్ట్‌లు కూడా ప్రిగోజిన్‌కే దక్కాయి. అధికారంలో ఉన్న వారితో ఎలా మెలగాలో ప్రిగోజిన్‌కు వెన్నతో పెట్టిన విద్య.
- 2006లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ రష్యాలో పర్యటించి విందుని ఆస్వాదించాక ప్రిగోజిన్‌ను 'పుతిన్ చెఫ్'అని పిలిచారు. అప్పట్నుంచి అదే పేరు స్థిరపడింది.
- రష్యా సందర్శనకు విదేశీ ప్రముఖులు ఎవరు వచ్చినా పుతిన్‌తో వారు దిగిన ఫొటోల్లో ప్రాగోజిన్ తప్పనిసరిగా కనిపించేవారు. ఆతిథ్య రంగంలో కోట్లాది రూపాయల కాంట్రాక్ట్‌లు అతని సొంతమయ్యాయి.
- 2012లో ప్రభుత్వ స్కూళ్లకు కేటరింగ్ నడపడం కోసమే 105 కోట్ల రూబుల్స్ కాంట్రాక్ట్ దక్కింది.
- అలా వచ్చిన డబ్బులతో ప్రిగోజిన్ వాగ్నర్ అనే కిరాయి సైన్యాన్ని ఏర్పాటు చేశారు.
- మొదట్లో వాగ్నర్ సంస్థ తనదేనని ఆయన బాహాటంగా చెప్పుకోలేదు. చిట్టచివరికి 2021లో వాగ్నర్ సంస్థ తనదేనని అంగీకరించారు.
- 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కి అనుకూలంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయించింది ప్రాగోజిన్ అనే అనుమానాలున్నాయి. అప్పట్నుంచి అమెరికా అతనిపై నిషేధం విధించింది.

వాగ్నర్ సంస్థ ఏం చేస్తుందంటే..?

- 2014లో క్రిమియాని ఆక్రమించాలని పుతిన్ ప్రణాళికలు సిద్ధం చేసినప్పుడు యెవ్‌గెనీ ప్రిగోజిన్‌తో తానే ఈ సంస్థను ఏర్పాటు చేయించారన్న ప్రచారమైతే ఉంది.
- క్రిమియా ఆక్రమణలో తమ చేతికి మట్టి అంటకుండా ఉండడానికే ఈ ప్రైవేటు సైన్యాన్ని పుతిన్ రంగంలోకి దింపారన్న ప్రచారం ఉంది.
- రష్యాలో ప్రైవేటు సైన్యం చట్ట విరుద్ధం. అయినప్పటికీ రష్యా రక్షణ శాఖ కిరాయి సైన్యాన్ని చూసి చూడనట్టుగా వదిలేసేది.
- క్రిమియా తర్వాత తూర్పు ఉక్రెయిన్‌లో దాన్‌బాస్‌లో రష్యా అనుకూల వర్గానికి మద్దతుగా పని చేసి ఆ ఆపరేషన్‌లో విజయం సాధించింది.అలా వాగ్నర్ కార్యకలాపాలు విస్తరించాయి.
- సిరియాలో రష్యా అనుకూల బషర్ అల్ అసాద్ ప్రభుత్వాన్ని కాపాడడంలో కీలకంగా వ్యవహరించింది.
- లిబియా, మొజాంబిక్, మాలి, సూడాన్, ది సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, వెనెజులా ఇలా ఎక్కడ ఘర్షణలు అట్టుడికినా రష్యా జోక్యం ఉంటే అక్కడ తప్పకుండా వాగ్నర్ గ్రూప్ ప్రత్యక్షమయ్యేది.
- ఓ రకంగా వాగ్నర్ పుతిన్‌కు చెందిన కిరాయి సైన్యంగామారింది.
- ఈ గ్రూపులో మాజీ సైనికులే సభ్యులుగా ఉంటారు. బ్లూమ్‌బర్గ్ సంస్థ లెక్కల ప్రకారం ఈ గ్రూపులో 60 వేల మంది సైనికులు ఉన్నారు.

ఉక్రెయిన్ యుద్ధంలో కీలకం

ఏడాదిన్నర క్రితం ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలు పెట్టినప్పట్నుంచి వార్నర్ సైనికులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉక్రెయిన్‌పై రెండు వారాల్లో నెగ్గేస్తామన్న పుతిన్ భ్రమలు తొలగిపోవడంతో వాగ్నర్ సైనికులు మరింత దూకుడుగా ముందుకెళ్లారు. ప్రాగోజిన్ వారు తన సైనికులేనంటూ బహిరంగంగా అంగీకరించడమే కాకుండా యుద్ధాన్ని ముమ్మరం చేశారు. ఖైదీలను సైనికులుగా చేర్చుకున్నారు. ఈ యుద్ధంలో సంస్థకు చెందిన 50 వేల మంది పాల్గొన్నారు. కీలక నగరాల స్వాధీనంలో వీరే ముందున్నారు. బఖ్‌ముత్ కోసం జరిగిన పోరులో 20 వేల మంది మరణించారు.

- సాక్షి నేషనల్ డెస్క్

సంక్షోభంలో రష్యా

- సాయుధ తిరుగుబాటుకు దిగిన ప్రైవేటు సైన్యం
- కిరాయి సైన్యం వాగ్నర్ సంస్థ గుప్పిట్లో రోస్తోవ్ నగరం
- ప్రిగోజిన్ వెన్నుపోటు పొడిచారని పుతిన్ మండిపాటు

మాస్కో: ఉక్రెయిన్‌పై ఏడాదిన్నరగా యుద్ధం చేస్తున్న రష్యా అనూహ్య పరిణామాలతో అంతర్గత సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఇన్నాళ్లూ ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున పోరాడిన ప్రైవేటు సైనిక సంస్థ వాగ్నర్ శుక్రవారం రాత్రికి రాత్రే ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. రష్యా మిలటరీ నాయకత్వాన్ని కూల్చివేస్తామని వాగ్నర్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ గర్జించారు. తమ సంస్థకు చెందిన బలగాలను లక్ష్యంగా చేసుకొని రష్యా సైన్యం దాడులకు దిగుతోందని అందుకే ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. రష్యాలోని ప్రధాన నగరమైన రోస్తోవ్ దాన్ తమ అధీనంలోనే ఉందని ఆయన ప్రకటించారు. రష్యా రక్షణ మంత్రి సెర్గీ షొయిగును లక్ష్యంగా చేసుకుంటూ పలు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. తమ సంస్థపై సెర్గీ దాడులు చేయిస్తున్నారని ఆయనను విడిచిపెట్టబోమంటూ ఆగ్రహావేశాలతో వీడియోలో హెచ్చరికలు జారీ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అత్యంత అంతరంగికుడైన ప్రిగోజిన్ ఈ తిరుగుబాటుకు పాల్పడడాన్ని ప్రభుత్వంలో ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ పరిణామాలతో రష్యాలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రిగోజిన్‌ను నిలువరించడానికి తన సొంత దేశంలోనే రష్యన్ మిలటరీ దాడులకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కల్లోల పరిస్థితుల మధ్య ఏది వాస్తవమో, ఏది కాదో అన్న గందరగోళం కూడా ఏర్పడింది. ఒకానొక దశలో రష్యా అధ్యక్షుడు పుతిన్ మాస్కో విడిచి పరారయ్యారన్న వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే అందులో నిజం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ప్రిగోజిన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత రెండు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా అధ్యక్షుడు పుతిన్ పదవీ గండాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ తిరుగుబాటుపై జాతినుద్దేశించిన ప్రసంగించిన పుతిన్ ప్రిగోజిన్ పేరు ప్రస్తావించకుండా దేశద్రోహానికి పాల్పడ్డారని, వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. తిరుగుబాటు చేసిన వారందరినీ కఠినంగా శిక్షిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దేశంలో బలగాలను, అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశామని, ఎలా ముందుకు వెళ్లాలో ఆదేశాలిచ్చామని చెప్పారు. రష్యా ఎఫ్‌ఎస్‌బీ సెక్యూరిటీ సర్వీస్ ప్రిగోజిన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసింది.

పుతిన్ తప్పు చేశారు : ప్రిగోజిన్

పుతిన్ ప్రసంగం అనంతరం ప్రిగోజిన్ మరో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. తమను దేశద్రోహులమని పేర్కొని పుతిన్ అతి పెద్ద తప్పు చేశారన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో పోరాటం చేసిన తామే అసలు సిసలు దేశభక్తులమని అన్నారు. తాము ప్రభుత్వానికి లొంగి పోయే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

25వేల మంది సైన్యంతో తిరుగుబాటు

ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఉన్న వాగ్నర్ సైనికుల్ని వెనక్కి రప్పించిన ప్రిగోజిన్ రోస్తోవ్ దాన్ నగరంలో సైనిక ప్రధాన కార్యాలయం, ఇతర సైనిక స్థావరాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నట్టు చెబుతున్నారు. నగరంలో మిలటరీ వాహనాలు, ట్యాంకుల్ని మోహరించిన వీడియోలు కూడా విడుదల చేశారు. ఒక్క తుపాకీ తూటా పేలకుండానే తాము మిలటరీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రిగోజిన్ చెప్పారు. రక్షణ మంత్రి సెర్గీ షొయిగు, మిలటరీ జనరల్ గెరాసిమోవ్ రోస్తోవ్‌లోని మిలటరీ కార్యాలయంలో తనతో సమావేశం కావాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేర్చకపోతే రాజధాని మాస్కోని ముట్టడిస్తామని వార్నింగ్ ఇచ్చారు. వాగ్నర్ సంస్థకు చెందిన దాదాపుగా 25 వేల మంది సైనికులు మాస్కోదిశగా కదులుతున్నట్టు తెలుస్తోంది. మాస్కోకి దక్షిణంగా 360 కి.మీ. దూరంలోని లిప్టెక్ ప్రావిన్స్‌లో వాగ్నర్ బలగాలు, ఇతర ఆయుధాల్ని మోహరించినట్టుగా ప్రిగోజిన్ విడుదల చేసిన వీడియోల ద్వారా తెలుస్తోంది. ఈ విషయాన్ని లిప్టెక్ ప్రావిన్స్ గవర్నర్ ఇగోర్ అర్టమోనోవ్ కూడా ధ్రువీకరించారు. వాగ్నర్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ సేనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదమూ లేదని చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున జనం గుమిగూడే కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు మాస్కో ప్రాంత గవర్నర్ తెలిపారు. విద్యా సంస్థలను జులై ఒకటి దాకా మూసివేసినట్లు తెలుస్తోంది.


పుతిన్


ప్రిగోజిన్

తాత్కాలిక విరమణ

బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో మధ్యవర్తిత్వంతో శనివారం రాత్రికల్లా ఇరువర్గాల మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరింది. మాస్కో దిశగా వెళుతున్న వాగ్నర్ గ్రూపు సైనికులను ఆగిపోవాల్సిందిగా యెవ్‌గెనీ ప్రిగోజిన్ ఆదేశాలు ఇచ్చారు. రష్యన్ల రక్తం చిందకూడదనే ఉద్దేశంతోనే మాస్కో దిశగా ముందంజ వేయడాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లోని తమ స్థావరాలకు మళ్లాల్సిందిగా తమ బలగాలకు ఆదేశాలు జారీచేసినట్లు వెల్లడించారు. వాగ్నర్ గ్రూపు సైనికుల రక్షణకు పుతిన్ నుంచి హామీ లభించిందని మధ్యవర్తిత్వం వహించిన లుకషెంకో ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తి బలహీనంగా రష్యా : జెలెన్‌స్కీ

రష్యాలో అంతర్గత సంక్షోభంతో ఆ దేశం పూర్తి స్థాయిలో బలహీనపడిపోయిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. చెడు మార్గాన్ని అనుసరించే వారందరూ తమను తామే నాశనం చేసుకుంటారన్నారు. ''చాలా కాలంగా రష్యా తన బలహీనతల్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోంది. ప్రభుత్వంలో ఉన్న వారి మూర్ఖత్వాన్ని దాచిపెడుతూ వస్తోంది. ఇక ఏదీ దాచి ఉంచలేరు. అబద్ధాలు చెప్పలేరు. రష్యా తమ సైన్యాన్ని దళాలు, కిరాయి సైన్యం ఉక్రెయిన్‌లో ఎంత కాలం ఉంచుతుందో అంత ఎక్కువ బాధను ఆ దేశం కూడా ఎదుర్కొంటుంది'' అని జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు.

రెండేళ్ల చిన్నారి చేతిలో పేలిన తూటా

ఒహాయో: అమెరికా తుపాకుల సంస్కృతికి నిండు గర్భిణి బలైన విషాద ఘటన ఒహాయోలో చోటుచేసుకుంది. గదిలో బుల్లెట్లతో నిండిన గన్‌ను ఆటబొమ్మగా భావించిన రెండేళ్ల వయసు బాలుడు తన తల్లివైపు గురిపెట్టి కాల్చాడు. ఈ ఘటనలో ఎనిమిది నెలల గర్భవతి అయిన తల్లి రక్తమోడుతూ ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. గత వారం జరిగిన ఘటన తాలూకు వివరాలను తాజాగా అమెరికా పోలీసులు వెల్లడించారు. వారి తెలిపిన ప్రకారం.. 31 ఏళ్ల లారా ఇలిగ్ అనే మహిళ ఒహాయోలో భర్త, రెండేళ్ల కుమారుడితో కలిసి ఉంటోంది. గత శుక్రవారం మధ్యాహ్నం పడకగదిలో లాండ్రీ పనిలో తలమునకై ఉంది. అదే సమయంలో 'బేబీ గేట్ల'ను దాటుకుని ఆమె వెనకాలే వచ్చిన రెండేళ్ల కుమారుడు అక్కడే గదిలో ఉన్న సిగ్ సాయర్ మైక్రో 9ఎంఎం గన్‌ను చేతిలోకి తీసుకుని తల్లిని వెనకనుంచి షూట్‌చేశాడు. దీంతో తీవ్రస్రావమై ఆమె వెంటనే 911కు పలుమార్లు ఫోన్‌చేసింది. విషయం తెల్సుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికొచ్చి ఆమెను ఆస్పత్రికి తరలించారు. 33 వారాల గర్భిణి అయిన ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ చేసినా నవజాత శిశువును కాపాడలేకపోయారు. ప్రసవం అయిన మూడు గంటల తర్వాత తల్లి సైతం కన్నుమూసింది. ఘటన జరిగిన ఇంట్లో బుల్లెట్లు లోడ్‌చేసిన మరో షాట్‌గన్, రైఫిల్‌ను పోలీసులు కనుగొన్నారు.

మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపించాలి

- ఆల్ పార్టీ భేటీలో కాంగ్రెస్, టీఎంసీ డిమాండ్
- చేయగలిగిందంతా చేస్తున్నామన్న హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ/ఇంఫాల్: మణిపూర్‌లో పరిస్థితులపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అఖిలపక్ష భేటీ నిర్వహించింది. హోం మంత్రి అమిత్ షా అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ, టీఎంసీ, డీఎంకే, ఏడీఎంకే, బీజేడీ, ఆప్, ఆర్‌జేడీ, శివసేనతోపాటు వామపక్షాల పార్టీల నేతలు హాజరయ్యారు. బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, నిత్యానంద్ రాయ్, అజయ్ కుమార్ మిశ్రా, హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఐబీ డైరెక్టర్ తపన్ డేకా కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పేందుకు కేంద్రం తీసుకుంటున్న పలు చర్యలను హోం మంత్రి అమిత్ షా వారికి వివరించారు. ప్రధాని మోదీ స్వయంగా ప్రతిరోజూ అక్కడి పరిస్థితులపై వాకబు చేస్తున్నారని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వెంటనే అఖిలపక్ష బృందాన్ని పంపించాలని కాంగ్రెస్, టీఎంసీ సహా పలు పార్టీల నేతలు కోరారు. శాంతి భద్రతలను కాపాడటంలో రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, సీఎం బిరెన్ సింగ్‌ను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని ఎస్పీ కోరింది. హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..రాష్ట్రంలో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్రం చేయగలిగిందంతా చేస్తోందని చెప్పారు. అఖిలపక్ష బృందాన్ని పంపించడంపై అమిత్ షా ఎటువంటి ప్రకటన చేయలేదని అనంతరం బీజేపీ మణిపూర్ ఇన్‌చార్జి సంబిత్ పాత్ర మీడియాకు తెలిపారు. ప్రభుత్వం మణిపూర్‌ను మరో కశ్మీర్‌లాగా మార్చాలనుకుంటున్నట్లుందని అక్కడి పరిస్థితులపై టీఎంసీ నేత డెరెక్ ఒ బ్రియాన్ మీడియాతో వ్యాఖ్యానించారు.

మణిపూర్‌లో మంత్రి గోదాముకు నిప్పు

మణిపూర్‌లో నిరసనకారుల గుంపు మరోసారి రెచ్చిపోయింది. శుక్రవారం రాత్రి తూర్పు ఇంఫాల్ జిల్లా చింగారెల్‌లోని మంత్రి ఎల్.సుసింద్రోకు చెందిన ప్రైవేట్ గోదాముకు నిప్పుపెట్టడంతో అది కాలిబూడిదయింది. అనంతరం ఖురాయ్‌లోని మంత్రి ఇంటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై బాష్పవాయువును ప్రయోగించామన్నారు.

భారత్‌లో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం

- అమెరికా పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు
- వాషింగ్టన్‌లో వ్యాపారదిగ్గజాలతో భేటీ



వాషింగ్టన్: భారత్‌లో మరింత మెరుగైన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇదే మంచి తరుణమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత వ్యాపార రంగంలో పారదర్శకమైన, సానుకూలమైన పాత్ర పోషించేందుకు అనువైన వాతావరణాన్ని భారత్, అమెరికా సంయుక్తంగా సృష్టించాయని ఆయన ఉద్ఘాటించారు. అమెరికా పర్యటనలో భాగంగా శుక్రవారం వాషింగ్టన్‌లోని కెన్నడీ సెంటర్‌లో అమెరికాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు, భారతీయ సంతతి వ్యక్తులు, దాతలతో మోదీ భేటీ అయ్యారు. 'ఇరు దేశాల భాగస్వామ్యం అనేది అనువుగా మార్చుకున్న సంబంధం కాదు. ఇది పరస్పర వాగ్దానాలు, నిబద్ధతకు నిదర్శనం' అని మోదీ నొక్కిచెప్పారు. ' వాషింగ్టన్‌లో భిన్న రంగాల దిగ్గజాలతో భేటీ అద్భుతంగా కొనసాగింది. ఇందులో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ సైతం పాల్గొనడం విశేషం. భారత ప్రగతిపథ ప్రస్థానంలో భాగమయ్యేందుకు, దేశ అవకాశాల గనిని ఒడిసిపట్టేందుకు అమెరికా పెట్టుబడిదారులకు ఇదే చక్కని సమయం' అని మోదీ ట్వీట్‌చేశారు.

భారత్‌లో 75,000 కోట్ల పెట్టుబడి: గూగుల్

'భారత్‌లో దాదాపు రూ.75,000 కోట్ల(10బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టబోతున్నాం. ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా సంబంధిత వివరాలు ఆయనతో పంచుకున్నాను' అని సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. ఇండియా డిజిటైజేషన్ ఫండ్‌లో భాగంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ(గిఫ్ట్)లో తమ గ్లోబల్ ఫిన్‌టెక్ వ్యాపారకార్యకలాపాలను ప్రారంభిస్తామని గూగుల్ వెల్లడించింది. జీపేకు సపోర్ట్‌గా ప్రత్యేక కార్యకలాపాలను 'గిఫ్ట్'లో మొదలుపెడతారని సంస్థ అధికార ప్రతినిధి ఒకరు శనివారం పేర్కొన్నారు. 'ఫిన్‌టెక్ రంగంలో భారత నాయకత్వాన్ని గూగుల్ గుర్తిస్తోంది. అందుకే భారత్‌లో చిన్న, భారీ పరిశ్రమలకోసం సేవలు అందిస్తాం. దాంతోపాటే అమెరికాసహా ప్రపంచదేశాలకు ఇక్కడి నుంచే సేవలు కొనసాగుతాయి. ఈ ఏడాది చివరినాటికి ముఖ్యంగా మహిళల సారథ్యంలో మొదలయ్యే అంకుర సంస్థలకు మద్దతుగా నిలుస్తాం' అని అధికార ప్రతినిధి చెప్పారు.

అమెజాన్ మరో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

అదనంగా 15 బిలియన్ డాలర్లు (రూ.1,23,000 కోట్లు) పెట్టుబడి పెట్టడం ద్వారా భారత్‌లో తన ఉనికిని మరింత పెంపొందించుకోవాలని అమెజాన్.కామ్ భావిస్తున్నట్లు అమెజాన్ సీఈవో ఆండీ జస్సీ వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశం సందర్భంగా ఆయన ఈ విషయాలను తెలియజేశారు. ఈ అదనపు పెట్టుబడి 2030 నాటికి భారత్‌లోని వివిధ వ్యాపారాలలో సంస్థ మొత్తం పెట్టుబడిని 26 బిలియన్లకు (రూ.2,13,200 కోట్లకు) చేరుస్తుందని జస్సీ పేర్కొన్నారు. భారతీయ స్టార్టప్‌లను ప్రోత్సహించడం, ఉద్యోగాల కల్పన, ఎగుమతులను సులభతరం చేయడం, డిజిటల్ పరివర్తన, గ్లోబల్ మార్కెట్లో అభివృద్ధి చెందడానికి వ్యక్తులు వంటి అంశాలపై చర్చించారు.

ఈజిప్టుకు చేరుకున్న ప్రధాని మోదీ

కైరో: అమెరికాలో పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ శనివారం ఈజిప్టులో రెండు రోజుల పర్యటనకు గాను కై రో చేరుకున్నారు. కై రో విమానాశ్రయంలో మోదీకి ఈజిప్టు ప్రధానమంత్రి మొస్తాఫా మద్‌బౌలీ ఆలింగనంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మోదీ సైనిక దళాల గౌరవ వందనం స్వీకరించారు.

ఆయనకు బస ఏర్పాటు చేసిన హోటల్ వద్ద..భారత సంతతి ప్రజలు త్రివర్ణ పతాకాలు చేబూని, మోదీ..మోదీ.. వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. చీర ధరించిన ఈజిప్టు మహిళ ఒకరు హిందీ సినిమా షోలే లోని 'యే దోస్తీ హమ్ నహీ ఛోడేంగే'పాట పాడుతూ మోదీకి స్వాగతం పలికారు. ఆ గీతం వినగానే ఆశ్చర్యానికి లోనైన మోదీ ఆమెను ప్రశంసించారు. తనకు హిందీ పెద్దగా తెలియదని, భారత్‌కు ఎప్పుడూ వెళ్లలేదని ఆమె చెప్పారు. మీరు ఈజిప్షియన్ అయినా అచ్చు భారతీయ మహిళ మాదిరిగానే ఉన్నారని మోదీ ప్రశంసించారు. కాగా, భారత ప్రధాని ఒకరు ఈజిప్టులో పర్యటించడం 26 ఏళ్లలో ఇదే ప్రథమం. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు ఇరు దేశాలు ఆసక్తితో ఎదురు చూస్తున్న వేళ జరుగుతున్న ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం మోదీ ఈజిప్టు అధ్యక్షుడు ఎల్‌సిసితో భేటీ అవుతారు. ప్రధాని మద్‌బౌలీ కేబినెట్ సభ్యులతో మోదీ రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుంది. ఈజిప్టు గ్రాండ్ ముఫ్తి డాక్టర్ షౌకి ఇబ్రహీం అబ్దెల్ కరీం అల్లాం సహా పలువురు ప్రముఖులతో ప్రధాని చర్చలు జరుపుతారు. ఆదివారం ప్రధాని మోదీ కైరోలోని చారిత్రక అల్-హకీం మసీదును సందర్శిస్తారని ఈజిప్టులో భారత్ రాయబారి అజిత్ గుప్తే తెలిపారు. భారత్‌లోని దావూది బోహ్రా తెగ ముస్లింలు ఈజిప్టుకు చెందిన వారే. 11వ శతాబ్దంలో ఈజిప్టును పాలించిన ఫతిమిద్ వంశస్తులు అల్ హకీం మసీదును నిర్మించారు. బోహ్రా ముస్లింలు, ఈజిప్టు ప్రభుత్వంతో కలిసి చేపట్టిన మసీదు పునరుద్ధరణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి.

నియంతృత్వ శక్తులను ఓడిద్దాం: తేజస్వీ యాదవ్



పట్నా: దేశంలోని నియంతృత్వ శక్తులను ఓడిద్దామని కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను ఆర్జేడీ నేత, లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ పరోక్షంగా విమర్శించారు. పట్నాలో శుక్రవారం విపక్ష పార్టీల భేటీపై శనివారం బిహార్ డెప్యూటీ సీఎం అయిన తేజస్వీ స్పందించారు. ' కన్యాకుమారి నుంచి కశ్మీర్‌దాకా నేతలంతా నియంతృత్వ శక్తులను ఓడిద్దామని విపక్షాలభేటీలో ప్రతినబూనారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు మోదీ గురించో మరే ఇతర వ్యక్తి గురించో కాదు. ప్రజా సంక్షేమం గురించి. విపక్షాల ఉమ్మడి కార్యాచరణ తదితర అంశాలపై వచ్చేనెలలో సిమ్లాలో జరిగే సమావేశంలో చర్చిస్తాం. ప్రస్తుతానికి ఇక్కడ తొలి అడుగు పడింది. గతంలో చరిత్రాత్మక చంపారన్ సత్యాగ్రహ ఉద్యమం, జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమాలు బిహార్ నుంచే మొదలయ్యాయి ' అని అన్నారు. ' సమావేశంలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. ప్రతీ అంశాన్ని సామరస్యపూర్వక పరిష్కారం కోసమే స్వీకరించి చర్చించాం' అని చెప్పారు. ఢిల్లీలో పరిపాలన సేవలపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌లో కాంగ్రెస్ వైఖరి వెల్లడించాలని ఆప్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ నిరాకరిస్తుండటంతో శుక్రవారం భేటీ తర్వాత సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొనకుండానే కేజ్రీవాల్ ఢిల్లీకి వెనుతిరిగారు. ఈ విషయంపైనే తేజస్వీపైవిధంగా స్పందించారు. విపక్షాల భేటీని బీజేపీ అగ్రనేత అమిత్ షా ఫొటో సెషన్‌గా పేర్కొంటూ విమర్శించడంపై తేజస్వీ స్పందించారు. ' ఫొటో సెషన్ అంటే ఏమిటో వారికే బాగా తెలుసునన్నారు.

నూతన దంపతులు సహా అయిదుగురిని చంపి..

మెయిన్‌పురి: ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. నూతన దంపతులతోపాటు మరో ఇద్దరు కుటుంబసభ్యులను, ఓ స్నేహితుడిని ఓ వ్యక్తి గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోను యాదవ్(22), సోని(20)లకు శుక్రవారమే వివాహమైంది. రాత్రి బారాత్ వేడుక జరిగింది. అనంతరం అందరూ నిద్రిస్తుండగా సోను సోదరుడు శివ్ వీర్ యాదవ్(28) గొడ్డలితో నూతన దంపతులతోపాటు మరో సోదరుడు, బావ మరిది సౌరభ్, స్నేహితుడిని చంపేశాడు. తన భార్య, అత్తపైకి తుపాకీతో కాల్పులు జరపగా వారు గాయపడ్డారు. అనంతరం నిందితుడు శివ్ వీర్‌యాదవ్ కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘాతుకానికి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 25 । జూన్ । 2023

ఓయూలో ఐసీఎస్ఎస్ఆర్ కార్యాలయం తరలింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ లైబ్రరీలో 1969లో ఏర్పాటు చేసిన ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సీ (సామాజిక శాస్త్రాల జాతీయ రీసెర్చ్ సెంటర్) కార్యాలయాన్ని ఓయూసీఐఎస్‌కు (ఐపీఈ సమీపంలో) తరలించారు. శనివారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ముంబై ఐసీటీ వీసీ ప్రొ.ఏజీ పండిత్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
31.8°	22.6°

న్యూస్‌రీల్

ఓఆర్ఆర్ బాధితులకు హెచ్ఎండీఏ ప్లాట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు హెచ్ఎండీఏ శనివారం లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయించింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రాజెక్ట్ సీజీఎం మాజిద్ హుస్సేన్, ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ వి.విక్టర్, తహసీల్దార్ ఎం.భిక్షపతి ఆధ్వర్యంలో శనివారం నానక్‌రామ్‌గూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో 33 మందికి ప్లాట్లను కేటాయించారు. ఈ మేరకు ప్లాట్‌లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను (అలాట్‌మెంట్) లబ్ధిదారులకు అందజేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 507లో దాదాపు 100 ఎకరాలలో ఆర్అండ్ఆర్ బాధితుల కోసం అభివృద్ధి చేసిన లే అవుట్లో 33 మంది లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించారు. వీటిలో 100 గజాల విస్తీర్ణం కలిగినవి 20 ప్లాట్లు,, 150 గజాల విస్తీర్ణం కలిగిన 10 ప్లాట్లు ఉన్నాయి. 200 గజాల ఒక ప్లాటు, 250 గజాల మరో ప్లాటు, 300 గజాల ఒక ప్లాటు చొప్పున మొత్తం 33 ప్లాట్లను కేటాయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ గ్రోత్ కారిడార్ డీజీఎంలు రమేష్, రవీందర్, సంజయ్, డిప్యూటీ తహసీల్దార్ సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీటీఆర్ఐలో ముగిసిన శిక్షణ

గచ్చిబౌలి: కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు శాఖలోని శాస్త్రవేత్తలు, రీసెర్చ్ ఆఫీసర్లు, రీసెర్చ్ అసోసియేట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గచ్చిబౌలిలోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) సంస్థలో వారం రోజులపాటు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని (సీబీపీ) నిర్వహించారు. ప్రభుత్వ అధికారులను మరింతగా అవగాహన పెంచుకొని చురుగ్గా పనిచేసేలా చేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సృజనాత్మక, నిర్మాణాత్మక, ఊహాత్మక, వినూత్న, క్రియాశీల వృత్తిపరమైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ రాజీవ్‌శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా వాకథాన్



బంజారాహిల్స్: ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అనేబుల్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫర్ సీడ్ కంపెనీస్ (ఎకో) ఆధ్వర్యంలో శనివారం నెక్లెస్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వివిధ విత్తన కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన 275 మంది ఈ వాకథాన్‌లో పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో బాల కార్మికతను ఎదుర్కోవడానికి అవసరమైన సహకార ప్రయత్నాన్ని ఇది నొక్కి చెప్పింది. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి, దావులూరి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఇ.హరిబాబు, డాక్టర్ మురళీకృష్ణ, ఆదిత్యనాథ్ గోయంకా, యోగేంద్ర హరిగోపాల్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య బోధనలో నైపుణ్యం తప్పనిసరి: గవర్నర్ తమిళిసై

రాయదుర్గం: రోబోటిక్స్ తదితర అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో వైద్యరంగం నానాటికీ కొత్త పుంతలు తొక్కుతోంది. వైద్య విద్యను బోధించే నైపుణ్యం కలిగిన ఫ్యాకల్టీలకు డిమాండ్ బాగా పెరిగిందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అభిప్రాయపడ్డారు. శనివారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడారు. వైద్య విద్య ప్రాధా న్యతను గుర్తించిన ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పలు వైద్య కళాశాలల ఏర్పాటుకు దోహదం చేశారన్నారు. పరిమిత వనరులతో తాము చదువుకున్నప్పటి రోజుల తో పోలిస్తే సమాచార విప్లవం, డిజిటల్ బుక్స్, అత్యున్నత శిక్షణ పొందిన శిక్షకులు.. ఉన్న ప్రస్తుత తరం విద్యార్థులు ఎంతో అదృష్టవంతులన్నా రు. కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి, అపోలో ఆస్పత్రుల జేఎండీ డా. సంగీతారెడ్డి, యశోదా ఆస్పత్రి ఎండీ డా.జి.సురేంద్రరావు ఎన్‌బీఈఎంఎస్ ప్రెసిడెంట్ డా.అభిజిత్ సేత్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.







డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్ర మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమంలో సినీ నటులు నిఖిల్, ప్రియదర్శి, నగర సీపీ సీవీ ఆనంద్ పాల్గొన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని.. అందమైన జీవితాన్ని, ఆనందకరంగా ఆస్వాదించాలని సూచించారు.

అమీర్‌పేట్‌లో జలమయమైన రహదారి





కూకట్‌పల్లిలో..

నగరంలో భారీ వర్షం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శనివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అనేక చోట్ల రహదారులు జలమయం కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, ఖైరతాబాద్, పంజాగుట్ట ప్రాంతాల్లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, బాలానగర్, సికింద్రాబాద్, తార్నాక, ట్యాంక్‌బండ్, అబిడ్స్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్.మలక్‌పేట్, ఉప్పల్, ఈసీఐఎల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది.




బంజారాహిల్స్‌లో..

కారులో సీట్ల పోరు!

గ్రేటర్‌లో సిట్టింగ్‌లకు తలనొప్పిగా ఆశావహులు

- ఓ వైపు మాజీలు.. మరో వైపు కార్పొరేటర్లు
- తారస్థాయికి చేరుతున్న విభేదాలు
- సై అంటే సై అంటూ సవాల్ విసురుతున్న వైనం



సాక్షి, సిటీబ్యూరో: 'రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే అన్ని పార్టీలు ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటికే ఎన్నికల వాతావ'రణం' కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎంతో కాలంగా అసెంబ్లీ సీట్లపై కన్నేసిన బీఆర్ఎస్ పార్టీలోని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిలో సిట్టింగ్ కార్పొరేటర్లతో పాటు మాజీ ఎమ్మెల్యేలు సైతం ఉన్నారు. సిట్టింగ్‌లకే టికెట్లను పార్టీ అధ్యక్షుడు ప్రకటించినా.. తీరు మార్చుకోకపోతే అవి దక్కవని కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ వెలువడేనాటికి ఎవరికి టిక్కెట్లు దక్కుతాయో తెలియని అయోమయం నెలకొంది. గ్రేటర్ పరిధిలోని చాలా నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ల్లో ఆశావహుల ప్రయత్నాలు కలవరం రేపుతున్నాయి.

గ్రేటర్ నియోజకవర్గాల్లో పరిస్థితులిలా..

ఎల్బీనగర్ నియోజకవర్గం టికెట్ తిరిగి తనకే దక్కుతుందని సిట్టింగ్ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి ధీమాగా ఉన్నా.. గతంలో ఇక్కడ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన రామ్మోహన్ గౌడ్‌కు, సుధీర్‌రెడ్డికి నడుమ తీవ్ర విభేదాలున్నాయి. 2018లో కాంగ్రెస్‌నుంచి గెలిచిన సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం తెలిసిందే. గత ఎన్నికల్లో పోటీచేసిన తాను ఇదే నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేసేందుకు రామ్మోహన్‌గౌడ్ ప్రయత్నిస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన తీగల కృష్ణారెడ్డి రాబోయే ఎన్నికల్లో టికెట్ కోసం కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కొనసాగుతున్నారు. తిరిగి ఆమే పోటీ చేయనున్నట్లు సమాచారం.

ఉప్పల్ బరిలో ఎవరో..

ఉప్పల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తిరిగి తనకే టికెట్ అంటుండగా, ఆ సీటుపై ఎంతోకాలంగా కన్నేసిన.. మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడైన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ వచ్చే ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు మోతె శోభన్‌రెడ్డి సైతం ఈ సీటుపై ఆశలు పెట్టుకున్నారు.

అదృష్టం ఎవరిని వరించేనో..

- రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి ఈసారి అసెంబ్లీ నుంచి పోటీచేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానందతోపాటు మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీతోపాటు పార్టీ నాయకుడు బండి రమేశ్ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తనకే టిక్కెట్ అని చెబుతున్నారు. సిట్టింగ్ కార్పొరేటర్లు రాగం నాగేందర్, జగదీశ్వర్ గౌడ్ ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డితో సై అంటున్నారు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి. ఇబ్రహీంపట్నం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన క్యామ మల్లేష్ సైతం తనకే టికెట్ వస్తుందనే ధీమాతో ఉన్నారు. కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు తిరిగి తనకే టికెట్ వస్తుందని భావిస్తుండగా, ఎమ్మెల్సీ నవీన్‌రావు అసెంబ్లీపై కన్నేశారని చర్చ జరుగుతోంది.

కోర్‌సిటీలో..

- ఖైరతాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న దానం నాగేందర్‌తో పాటు తిరిగి ఇటీవల పార్టీలో చేరిన దాసోజు శ్రవణ్ ఈ నియోజకవర్గంనుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు. పార్టీలో ఎంతోకాలంగా ఉన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి సైతం ఈ నియోజకవర్గం టిక్కెట్‌పై కన్నేశారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తనకెవరూ పోటీలేరనుకుంటుండగా, మైనార్టీల ఓట్లు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో తనకు టిక్కెట్ వస్తుందని మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ భావిస్తున్నారు. మాగంటికి, బాబాకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న రావుల శ్రీధర్‌రెడ్డి సైతం ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. సంఘసేవకుడు ఉపేందర్‌రెడ్డి సైతం ఈసారి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు చెబుతున్నారు.
- అంబర్‌పేట నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌పై అసమ్మతి గ్రూపులున్నాయి. ఇటీవల కేటీఆర్ ముందే ఇవి బయటపడ్డాయి. నియోజకవర్గ పార్టీ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి, డీపీ రెడ్డిలతోపాటు గోల్నాక కార్పొరేటర్ భర్త శ్రీనివాస్‌గౌడ్‌లకు కాలేరుతో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు.
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కాగా, ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పార్టీ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అల్లుడు శ్రీనివాస్‌రెడ్డిలు సైతం టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.
- కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణంతో ఆ సీటు ఖాళీ అయింది. రాబోయే ఎన్నికల్లో ఆయన కుమార్తె లాస్య నందితకు టికెట్ దక్కవచ్చనే అంచనాలున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి.. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన శ్రీనగేశ్‌తో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు సైతం ఈ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గాల్లో సొంతపార్టీలోనే బీఆర్ఎస్‌కు పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయి. ఎన్నికల నాటికి ఇవి ఏ మలుపులు తిరగనున్నాయో వేచి చూడాల్సిందే.

బరిలోకి వారసులు..?

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత సిట్టింగ్‌ల వారసులు కొందరు తెరపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మల్కాజిగిరిలో మైనంపల్లి హన్మంతరావు కుమారుడు రోహిత్‌ను బరిలో దింపుతారనే అభిప్రాయాలున్నాయి. ముషీరాబాద్‌లో ముఠాగోపాల్ కాని పక్షంలో ఆయన కొడుకు జయసింహకు టికెట్ ఇస్తారనే అంచనాలున్నాయి. సికింద్రాబాద్‌లో పద్మారావు తన కుమారున్ని బరిలో దింపే అవకాశాలున్నాయని ఇటీవలి కాలం వరకు భావించినప్పటికీ, తిరిగి తానే బరిలో దిగనున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి కొడుకు కార్తీక్‌రెడ్డి రాజేంద్రనగర్ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి టికెట్ ఇవ్వని పక్షంలో ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డికి లభించవచ్చనే అంచనాలున్నాయి.

ఘాటెక్కిన పచ్చిమిర్చి



రిటైల్ మార్కెట్‌లో కిలో రూ. 120

సాక్షి, సిటీబ్యూరో: పచ్చిమిర్చి ధరలు మండిపోతున్నాయి. ప్రధాన మార్కెట్లో వారం రోజుల క్రితం కిలో రూ. 40-50 పలికితే.. తాజాగా రూ.100-120కి చేరింది. గుడిమల్కాపూర్ బోయిన్‌పల్లి మాదన్నపేట ఎల్బీనగర్ మార్కెట్లతో పాటు రైతు బజార్లకు సైతం సరఫరా బాగా తగ్గింది. శనివారం నగర మార్కెట్లకు కేవలం 900 క్వింటాళ్ల దిగుమతి అయింది. దీంతో నగర అవసరాలకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. తెలంగాణలో రంగారెడ్డి జిల్లాతో పాటు మెదక్‌లోనే అధికంగా పచ్చిమిర్చి పండిస్తున్నారు. ఏపీలోని అనంతపురం, కడప జిల్లాలో అత్యధికంగా మిర్చి పండిస్తున్నారు. నగర శివారు జిల్లాలతో పాటు తెలంగాణ జిల్లాల్లో పచ్చిమిర్చి దిగుబడి తగ్గడంతో నగర మార్కెట్ భారీగా దిగుమతులు పడిపోయాయి. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులతో ట్రాన్స్‌పోర్టు ఖర్చు ఎక్కువైందని వ్యాపారులు చెప్పారు.

మరో మూడు వారాల వరకూ..

తాజాగా శనివారం నగరానికి కేవలం 900 క్వింటాళ్ల పచ్చిమిర్చి మాత్రమే రావడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. మామూలు రోజుల్లో నిత్యం మార్కెట్లకు 2800-3000 క్వింటాళ్ల పచ్చిమిర్చి దిగుమతి అయ్యేదని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం దిగుమతులు తక్కువగా ఉండడంతో హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 800 నుంచి రూ.9,500కు విక్రయిస్తున్నారు. నగరంలో పచ్చిమిర్చి సరఫరా తగ్గిన దృష్ట్యా కర్ణాటకలోని బెల్గాం నుంచి కూడా పచ్చిమిర్చి దిగుమతి అవుతోంది. మరో రెండు మూడు వారాలు పరిస్థితి ఇలాగే ఉంటుందని అధికారులు తెలిపారు. మార్కెట్‌కు డిమాండ్ ప్రకారం సరఫరా కాకపోతే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. మిర్చి సరఫరా తగ్గడంతో కొందరు చిల్లర వ్యాపారులు ధరలు మరింత పెంచేస్తున్నారు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో పచ్చిమిర్చి కిలో ధర రూ. 120 వరకు పలుకుతోంది.

రియల్ దందా

ప్రీ లాంచ్ పేరుతో రూ.50 కోట్లు లూటీ

- వందెకరాల కొత్త వెంచర్ అంటూ గాలం
- 'ఫార్చున్ 99 హోమ్స్'పై బాధితుల ఫిర్యాదు
- దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు

హిమాయత్‌నగర్: నగర శివారులో కొత్త వెంచర్ అని ప్రీ లాంచ్‌లో భాగంగా తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తున్నామంటూ ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ భారీ మోసానికి పాల్పడింది. నగరానికి చెందిన దాదాపు 150 మంది నుంచి రూ.50 కోట్లు దోచేసింది. చెప్పిన సమయానికి ప్లాట్స్‌ని రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్న క్రమంలో బాధితులు న్యాయం కోసం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్)ను ఆశ్రయించారు. ముషీరాబాద్‌కు చెందిన కిరణ్‌కుమార్, ప్రభాత్‌లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

30 రోజుల్లోనే రిజిస్ట్రేషన్ అంటూ..

'ఫార్చున్ 99 హోమ్స్' కంపెనీ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామంలో 'ది ఎన్‌సీఎస్ ఫార్చున్ మెడి సిటీ ప్రాజెక్ట్' అనే పేరుతో వంద ఎకరాల్లో కొత్త వెంచర్ వేస్తున్నామంటూ ప్రచారం చేపట్టింది. ఆ ప్రాంతంలోని 50/97, 98, 99, 100, 101, 102-477 సర్వే నంబర్లలోని స్థలంలో వెంచర్లు వేస్తున్నట్లు చెప్పడంతో దాదాపు 150 మంది వినియోగదారులు ఆకర్షితులయ్యారు. కేవలం 30 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తామంటూ వీరి నుంచి దాదాపు రూ.50కోట్లకు పైగా డబ్బును 2020లో 'ఫార్చున్ 99 హోమ్స్' వసూళ్లు చేసింది. వారిచ్చిన 30 రోజుల గడువులో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగకపోవడంతో బాధితులంతా కలిసి సంస్థ ప్రతినిధులు రోశిరెడ్డి, విజయ్‌బాబులను సంప్రదించారు. హెచ్ఎండీఏ నుంచి అనుమతి రాకపోవడం కారణంగా తాము 30 రోజుల గడువులో రిజిస్ట్రేషన్ పూర్తి చేయలేకపోయామనే సమాధానం ఇచ్చారు. హెచ్ఎండీఏ అనుమతి వచ్చిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.



60రోజుల్లో రిజిస్ట్రేషన్ లేదా.. డబ్బు వాపస్

మాయ మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్న క్రమంలో బాధితులంతా కలిసి మరోసారి 2022 అక్టోబర్‌లో రోశిరెడ్డి, విజయ్‌బాబులను నిలదీశారు. 'ప్రీ లాంచ్' పేరుతో తక్కువ ధరకే ప్లాట్స్‌ను విక్రయించేందుకు ముందుకొచ్చాం.. అయితే హెచ్ఎండీఏ నుంచి అనుమతి రావడం లేదు. కేవలం 60రోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తాం ఒకవేళ చేయలేకపోతే మీ డబ్బు మీకు వాపస్ ఇస్తామని పంపేశారు. ఆ సమయంలో కొందరు కస్టమర్లకు ఇచ్చిన చెక్కులు సైతం ఇటీవల బౌన్స్ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 150 మందిని మోసం చేసి వారి నుంచి రూ.50 కోట్లు పైగా సొమ్మును స్వాహా చేసిన రోశిరెడ్డి, విజయ్‌బాబులు ఇప్పుడు వేర్వేరు కంపెనీల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారని, తాము వెళ్లి కలిసినా సరైన సమాధానాలు చెప్పడం లేదని బాధితులు తెలిపారు. దీనిపై సమగ్రమైన విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

మళ్లీ ఎల్ఆర్ఎస్



చిన్న ప్లాట్‌లకు పెద్ద భరోసా

- గతంలో దరఖాస్తు చేసుకున్న స్థలాల క్రమబద్ధీకరణ
- హెచ్ఎండీఏ పరిధిలో ప్రస్తుతం 1.5 లక్షల ప్లాట్లకు అర్హత
- పరిశీలనలో మరిన్ని దరఖాస్తులు
- సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్ నుంచి హెచ్ఎండీఏకు బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: మరోసారి ఎల్ఆర్ఎస్ మేళా ఆరంభమైంది. గతంలో రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రస్తుతం స్థలాలను క్రమబద్ధీకరించేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ మేరకు దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ మొదలైంది. ఇప్పటి వరకు మేడ్చల్, ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లలో సుమారు వెయ్యి మందికిపైగా దరఖాస్తుదారులకు నోటీసులను అందజేసినట్లు అంచనా. మరోవైపు గతంలో వివిధ గ్రామాల నుంచి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీఎస్)కు అందిన దరఖాస్తుల వివరాలను హెచ్ఎండీఏ గ్రామాలు. పట్టణాలు, మున్సిపాలిటీల వారీగా సేకరిస్తోంది. హెచ్ఎండీఏకు అందిన దరఖాస్తుల్లో ఎల్ఆర్ఎస్‌కు అర్హత కలిగిన ప్లాట్‌లను అధికారులు పరిశీలిస్తున్నారు. అప్పటి నోటిఫికేషన్ మేరకు 2020లో ఎల్ఆర్ఎస్ కోసం సుమారు 5.5 లక్షల వరకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. వాటిలో ఇప్పటి వరకు 1.5 లక్షల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్‌కు అర్హత కలిగి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఎలాంటి వివాదాలు లేకుండా, అన్ని విధాలుగా నివాస యోగ్యత కలిగిన దరఖాస్తులను పరిశీలించి నోటీసులను అందజేస్తున్నట్లు హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. త్వరలోనే దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. నోటీసులు అందుకున్న స్థలాల యజమానులు ఫీజులు చెల్లించిన వెంటనే ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ప్రొసీడింగ్స్‌ను అందజేేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు.

పంచాయతీల్లో దరఖాస్తుల వెల్లువ..

- గ్రామపంచాయతీలు, అనధికార లేఅవుట్‌లలో కొనుగోలు చేసిన స్థలాల క్రమబద్ధీకరణ కోసం అప్పట్లో ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్ నిబంధనల మేరకు ఉన్న వెంచర్‌లలో కొనుగోలు చేసినవి మాత్రమే చెల్లుబాటవుతాయని, మిగతా స్థలాలను అక్రమ రిజిస్ట్రేషన్‌లుగానే పరిగణించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇలాంటి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పడంతో భారీ ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా నగర శివార్లలోని గ్రామపంచాయతీల నుంచే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.
- ఫీజుల రూపంలోనే ప్రభుత్వానికి కోట్లాది రూపాయాల ఆదాయం లభించింది.అప్పట్లో వీటి కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రత్యేక యాప్‌ను సైతం రూపొందించింది. దరఖాస్తుదారులు ఎప్పటికప్పుడు తమ దరఖాస్తు స్టేటస్‌ను తెలుసుకొనేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చారు. కానీ ఆ తరువాత ప్రభుత్వం స్థలాల క్రమబద్ధీకరణ అధికారాన్ని హెచ్ఎండీఏ నుంచి కలెక్టరేట్‌లకు, మున్సిపాలిటీలకు బదిలీ చేసింది. కానీ ఆ తర్వాత ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. కలెక్టరేట్‌లలో ఇందుకు అవసరమైన యంత్రాంగం కూడా లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు.
- ఎల్ఆర్ఎస్ అంశాన్ని తిరిగి హెచ్ఎండీఏకు బదిలీ చేయడంతో అధికారులు తాజాగా కార్యాచరణ చేపట్టారు.వివిధ దశల్లో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో సమావేశాలను ఏర్పాటు చేశారు. ఆయా జోన్‌లలో మున్సిపాలిటీలకు అందిన దరఖాస్తుల వివరాలను సేకరించే పనిని ప్రారంభించారు. 'రూ.వెయ్యి చెల్లించిన వారి మొబైల్ ఫోన్‌లకు ఎస్సెమ్మెస్ రూపంలో నోటీసులను అందజేస్తున్నాం. నిర్ణీత మొత్తంలో నిబంధనల మేరకు గడువులోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి సకాలంలోనే ప్రొసీడింగ్స్ అందుతాయి' అని ఒక అధికారి వివరించారు.

వెంచర్‌లకు త్వరలో అనుమతులు..

మరోవైపు భారీ లే అవుట్‌లలో మిగిలిపోయిన ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు సైతం త్వరలోనే అనుమతులు లభించనున్నాయి. ఎకరం విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు హెచ్ఎండీఏ గతేడాది నోటిఫికేషన్ వెలువరించింది. ఈ మేరకు వివిధ జోన్‌లలో రూ.10 వేల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న భూ యజమానుల్లో అర్హులైన వారికి నోటీసులు ఇచ్చారు. చాలా మంది రూ.లక్షల్లో ఫీజులు చెల్లించి ప్రస్తుతం ప్రొసీడింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. వారికి ప్రొసీడింగ్‌ల జారీలో కొంత జాప్యం చోటుచేసుకున్నప్పటికీ త్వరలోనే ప్రొసీడింగ్‌లు (అనుమతులు) లభిస్తాయని అధికారులు చెప్పారు.

Education

■ అక్టోబర్ పరీక్షల్లో ఓపెన్ 10th, ఇంటర్, డిప్లొమా డిగ్రీ, P.G. (KO) 100% పాస్ గ్యారంటీతో పూర్తి ఫెయిలై ఉన్నావారుంటే రీకౌంటింగ్ ద్వారా పూర్తి ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. ఫోన్ : 6305979755 [H-781450]

■ Free Handwriting Workshop for 8th, 9th and 10th Students Send <Name and Class> to 9248481331 [H-14696]

Real Estate

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, JKC రోడ్, భవాని & శక్తినగర్, మధురానగర్, అంజలి, కల్పతరువు, సొసైటీ, భాష్యం, జనచైతన్య & అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన వారు 9948779955 [G-6949]

BUILDING & CONSTRUCTION

■ ఇల్లు కట్టి ఇవ్వబడును. అతి తక్కువ Sft. రేట్లతో (1500-1800) గుడ్ క్వాలిటీ మెటీరియల్స్ వాస్తు ప్రకారంగా వర్కింగ్ ప్లాన్స్‌తో & GHMC పర్మిషన్స్ తో అతి తక్కువ సమయంలో కన్‌స్ట్రక్షన్ చేయబడును. ఫోన్ : 9676804219. [H-796797]

BUILDING MATERIAL

■ మీ భూమి/ప్లాట్ లోని లోతట్టు ప్రాంతమును మట్టితో చదును చేయదలుచు కున్నారా? అయితే మమ్ములను సంప్రదించగలరు. ఫోన్ : 7680011002. [H-797698]

COMMERCIAL SPACE

■ అమీర్‌పేట్, కళ్యాణ్‌నగర్ ఫేజ్ 1లో ఉన్న కమర్షియల్ భవనము అమ్మకమునకు/లీజ్‌కి కలదు. ఒక్కొక్క ఫ్లోర్ 2300చ.అ. విస్తీర్ణంతో 6 అంతస్తులు, తెలంగాణ విద్యుత్ కార్యాలయము ఎదురుగా. సంప్ర:శ్రీనివాస్-9866787771, కృష్ణ-8999916012 [HA-11253]

■ For Rental 5195Sft. Storage Godown on Uppal Nagole Road & 10000Sft. at Balangar Main Road. Ph: 9000215191. [H-3035]

■ DSNR, Chaitanyapuri, Hanuman Nagar 3rd Lane Near SBI Commercial Complex G+3, Building 373 Sq. Yds. 8132 Sft. Cont.: 9989096120 [H-781225]

FLAT FOR SALE

■ 2BHK 1100Sft. North Facing, మల్టీస్టోర్ బిల్డింగ్ 3rd ఫ్లోర్ లిఫ్ట్, కార్ పార్కింగ్, కలదు. వెంగళ రావు నగర్. ఫోన్: 7702892593. వాట్సాప్: 7207704776 [HA-93928]

■ Kokapet, Brundhavan Colony 3BHK 3000Sft. UDS 90 Yards, Ready to move, Five Floors only one flat in each floor. Price 2.10Cr, Ph: 9848195491 [H-781514]

■ Gandimaisamma Near Ayodhya X Road, New Apartments 3 BHK Super Deluxe Flat 4th Floor 1690 Sft. Good Vastu, Ready to Occupy in Green Villa, V. Ramulu. Ph: 8143435105, 9849591439. [H-780924]

■ Masabtank behind NMDC Castel Hills 3BHK Converted to 2BHK with Loxurious Flooring AC, Chimney, Wooden Furniture, N/F, Natural Ventilation, 4 Balconies, 24hrs Water, Car Parking, Affordable Price. Ph: 9866109703, 9866173703 [HA-11265]

■ Duluxe 2/3 BHK Flats, HMDA Approved in Green Fort, Kuntloor Near Hayathnagar, Starting @ 45L. Ph: 8008003349, 9948224118 [HA-274]

■ Mallapur, Nacharam, Largest Gated Community Club House, Swimmingpool. Premium 3BHK Flats Ready to Occupy Must See to Appreciate Call: 9502300311 [H-780826]

■ 2BHK Flat for Sale in Sri Nagar Colony, Near Petrol Pump, 1397 Sft. 2nd Floor, North Facing, Contact: 9959631757, 9030009059 [H-780822]

■ Neredmet, Near Ramakrishna Puram MMTS Rly Stn. 2&3 BHK DLX Flats, Occupation 3 Months, Community of 75 Flats. Ph: 9849529518, 9440148865. [HA-93812]

■ Flat 3BHK 56 Lakhs (Fixed) 15 yrs Old, Sri Lakshmi Residency, Tarnaka, E/F, 1320 Sft. UDS-35 Sq.yds, Near St. Anns School, Ph: 8978974761, 7386734669. [H-780911]

■ 2705 sft @5500 per sft 600000 amenities Independent floors five each floor one flat sundaram colony gated community Rukmini enclave Bolaram nearby Kompalli Suchitra and Karimnagar Road. Ph: 9949077488 [HA-93715]

■ Dilsuknagar: E/F, 2 BHK (1050 sft) flat, 2nd floor, wood work, Car parking, 13 years old, 24hr water, 100% Vastu, Loan, 48.5 Lakhs. Ph: 9618970984 [H-780913]

HOUSE FOR SALE

■ B.N. Reddy Nagar గుర్రంగూడ బృందా వన్ కాలనీ INDP. ఇల్లు S/F 200చ.గ. మున్సిపల్ & బోర్ నీటి వసతి 4BHK (6 Rooms) నో బ్రోకర్స్ (డైరెక్ట్ పార్టీ). ఫోన్ : 9515617147 [HA-788908]

PALWANCHA KOTHAGUDEM
300 SQ YARDS
PLOT FOR SALE
Pandurangapuram Road
Opp : KTPS School
720 789 3345
807 471 7564

■ వనస్థలిపురం FCI కాలనీలో నార్త్ / వెస్ట్ 270 గజాలు, న్యూ డూప్లెక్స్ హౌస్, G+2, 4800Sft. అమ్మకానికి కలదు. సంప్ర: 9849688626 [HA-1686]

■ కుంట్లూరు హనుమాన్‌నగర్, Rd No. 6, Indep. House W/F 150Sq.Yds 1280 Sft. అమ్మకానికి కలదు 80Lakhs, Neg. ఫోన్ : 9581649885, 8096564102 [H-781340]

■ Munaganoor, Hayath Nagar, 404 Sq.Yds P.No. 63 & 64, Sy. No. 64 Indep. House 196Sq.Yds. P.No. 68, Plot For Sale. 100% Vaastu. Contact: 9010219658, 7901091081. [H-781236]

■ For Sale @ Alwal ICE Factory Road 133 Sq. Yards, 2000 Sft. West Face. 3BHK Duplex House As Per Vastu. Ph: 8142777909 [HA-11255]

■ 2BHK Flats & Indp Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans, B. Bheem Reddy. Ph: 8008250044, 8885060741. [HA-11262]

■ Nagole, Bandlaguda, Vasanth Vihar Function Hall lane, Kethan enclave Colony, 200, 172 Sq. yds New Const Houses for Sale (E/F) only. G. Floor construction owner. G. Srinivas (9000776436). [H-781389]

■ 600Sq.y. Commercial Bldg Sale @Heart of Capital Amaravati Mangalagiri Nr. AIMS, Rly Junction, Data Center & Autonagar, Ph: 8125559060 [H-780910]

■ 133 Sqyds, E/F INDP House, G+1, Datta Sai Colony, Near ICOM Factory, Bandlaguda, Nagaram. Ph: 9912228481, 9912228489 [H-780912]

■ House For Sale G+2 Penthouse 160Yards. Malkajgiri Near Police Station, Bodrai, Turkolabasti, Contact : 9491399160. [H-780920]

■ North East Corner Old House with 1,315 Sft. in 200 Sq.yds (30" X 60") for Sale @ Southend Park Colony, Mansoorabad, L.B. Nagar, Hyd. Rs. 1.85Cr. Ph: 9885908804. [HA-93840]

■ Gandhinagar Triplex House 223S/Yds Fully Furnished Exct Interiors, Home theatre, Internal Lift. Ph: 7032239023. [HA-93751]

LAND FOR SALE

■ మహేశ్వరం రియల్ ఎస్టేట్: మన్‌సాన్ పల్లి, అమీర్‌పేట్, నాగారం, కందుకూరు, తుక్కుగూడలో ప్లాట్లు, వ్యవసాయ భూములు & రీసేల్ ప్లాట్లు అమ్మబడును. & కొనబడును. ఫోన్: 9177887748 [H-781505]

■ 240చ॥గ॥ HMDA ఫైనల్ అప్రూవల్ ప్లాటు @ మహేశ్వరంలో అమ్మబడును. అన్ని డెవలప్‌మెంట్స్ పూర్తి చేయబడినవి మహేశ్వరం నుండి ఫార్మాసిటీకి వెళ్లే 100 ఫీట్ల రోడ్డుకు అనుకొని ఉన్న వెంచర్ లో కలదు. గజం-8 వేలు. ఫోన్ : 9966521191 [H-788710]

LEASE

■ Building for Rent: 16,000Sft. Ground Floor at Rs. 60/- Sft.-PEB Structure 24' Ceiling height Building for Rent at 60' Main Road Madhapur/Kaitlapur Flyover Connecting Road IDL Rainbow Vistas. Ph: 9912899458 [H-14671]

PLOT FOR SALE

■ కుంట్లూరు (నాగోల్ రోడ్) ZP రోడ్ నుండి 4వ క్లియర్ టైటిల్ ఈస్ట్ ఫేస్ ప్లాట్ 180 గజాలు అమ్మబడును. గజం 19,000/- డైరెక్ట్ ఓనర్ 8885120018 [H-781430]

■ గజం కేవలం 2500/- మాత్రమే మీ పెట్టుబడి పదింతలు అయ్యే అద్భుత అవకాశం. సాగర్‌హైవే ఇబ్రహీంపట్నం వద్ద అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 8919577389 [HA-9965]

■ బాగ్ హయత్‌నగర్ లో 500 చ.గజాల స్థలము నాగోల్, కుంట్లూరు మెయిన్ రోడ్డుకు రెండవ ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర: 9014395012, 9000235577 [HA-11241]

■ యాదాద్రి ఆలేరు టౌన్ (5లక్షలకే) 100 Acrs. గేటెడ్ కమ్యూనిటీ ఫామ్ ల్యాండ్ ప్లాట్స్ శ్రీగంధం & ఫ్రూట్స్ ప్లాంట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్ & 24 EMI, ఫ్రీ రిసార్ట్. ఫోన్: 6305888155 [H-788906]

■ హైదరాబాద్, మంచిరేవుల, ప్రైమ్ లొకేషన్లో 560 చ॥గ॥ల LRS మొత్తం కట్టబడిన W/Fలో గల ప్లాటు అమ్మకానికి గలదు. ✆.7680021004, 6304948520. [J-1436]

■ Hyd Near Anthaipally (4Km from Keesara ORR), E/F, 200Sq.Yards (30x60) Plot beside BITS Pilani, Janachaitanya Sai Divya Layout. Ph: 9701546337 [H-780922]

■ Gandimaisamma Near Ayodhya X Road, Plot No. 1, E/F, 185 Sq. Yds in Green Villa, Bhuvana Infra Developers. V. Ramulu Ph: 8143435105, 9849591439 [H-780923]

■ Plot For Sale: 400Sq.Yds Plot in JB Serene City, Phase - 4, @ Adibatla. Contact: 9885792794 [H-796909]

■ 180Sq.Yds. Plot @ 7,900/-, Opp: J&J, P&G, Panjerla, Kothur, Negotiable. Contact: 7075372766 [H-781390]

■ Commercial Plot Banjara Hills Rd # 12, 2000Yds, Rd-1, 230Yds G+2 Gachibowli 240 G+3, Dvlpmnts, Tellapur & Medchal HighRaise Apts., Plot-Maheshwaram. Ph: 9492786088. [H-780879]

■ 1/4, 1/2 Acres Farm Plots For Sale in 20 Acres @ Pharmacity-Kandukur Srisailam Highway, Contact: 9849692493 [HA-93906]

■ HMDA, DTCP, RERA Bank Loan Plots Near Amazon Data Centre 200Ft. Pharamacity Road. Ph : 9491400123. [HA-93815]

■ 655 Sq. Yds Huda Plot for Sale in Bhagyanagar Colony Phase-2, Kukatpally, Ph: 7032239023. [HA-93750]

■ Sangareddy (Peddapur) DTCP & farm plots Launching on 25/06/23, Close to RRR Mumbai H/W G-Community. Ph: 7382126789 [HA-8010]

■ Inole (Patancheru), Clean Title, 1068 (3 Road), Sq. Yards Plot(s), Price 23,000/- Sq. Yard. Owner. Ph: 7013377591 [HA-2733]

TO-LET

■ Noiseless Godown / Workshop, Nr. Shiva Sai Baba Temple, Adarsha Nagar, Uppal Resi. Colony, E/F, 3500Sft. Plot 2 abs Rooms, Water, Current, Tenant Event. 20K PM. Rent. Ph: 8008461115 [H-788903]

■ 3BHK Flat for Rent (Resi)@ Girishikhera Apts. D-1, 1st Floor, Ramnagar Mainroad (B/S. Venkateshwara Cloth Stores). Ph: 9908120597, 9440726907 [H-781339]

VILLA FOR SALE

■ New-age design premium villas for sale in Raviryala for just Rs.1.80 crores. Contact: +91 7353585358 Sark Projects. [HA-93885]

WANTED PLOT

■ We Buy old DTCP & HMDA Resale Plots in Maheshwaram, Pedda golconda, Nagaram, Tukkuguda, Kandukur, Shamshabad. 9908224832 [HA-1713]

Services

■ Soochi Fintech Private Limited, Consult for Finance (From Pvt./ Nationalised Banks & institutions), Chits (1 Lakh to 2 Crore), Fixed Income plans (Monthly/Maturity), Insurance (Life, Health& General) & Abroad Education. Ph:040-24440129, 7337440129, Mail ID: gns.sharma@soochi.in [H-781447]

FOR SALE

■ AAC Plant on Sale 530 Cum Per day Production Capacity AAC Blocks Manufacturing Plant on sale Situated at Malkapur Village near Chotupal Interested People Please Contact this No. 7995152222, 9347121089 [HA-02540]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-797554]

BUSINESS OFFER

■ బ్రాయిలర్ కోళ్ళు & నాటు కోళ్ళ పెంపకం మరియు వాటి ఉత్పత్తి (Production) మెషినరీ విభాగంలో 1 లక్ష నుండి ఆపైన పెట్టుబడులు కావలెను. ఫోన్ : 9441015276 [HA-14685]

■ డిగ్రీలు, అనుభవంతో పనిలేదు స్త్రీ/పు ఎవరైనా కార్పొరేట్ సంస్థలో బిజినెస్ మేనేజర్ గా పార్ట్ / ఫుల్ టైం పని చేస్తూ 20వేల నుండి లక్ష వరకు సంపాదించండి. ఫోన్ : 9989747897 [H-797647]

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి. లేదా ఏజెంట్‌గా జాయిన్ కావటానికి సంప్రదించండి. ఫోన్ : 9000543747 [HA-11202]

■ Share Market Free Dmat Account and get Daily Good Income and Sharing Service. Contact: 9030522467, 9133994394 [HA-11264]

DISTRIBUTOR

■ శ్రీ గాయత్రీ మినీ గీజర్స్ (5sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-11208]

INVESTMENTS

■ Buy Commercial Property @ 36L & Get Life Time Monthly 42K with 5% Increase in Every 5Yrs. Ph: 7799195959. [H-797649]

MACHINERY FOR SALE

■ USED రెడీమేడ్ చపాతి & పూరి తయారుచేయు మెషినరీ (UNIT) అమ్మకమునకు కలదు హైదరాబాద్. ఫోన్ : 7396798623, 9948004224 [HA-793447]

కనబడుటలేదు



N. భాస్కర్, వయస్సు : 65 సం॥ రాలు, కలరు: నలుపు, ఆకుపచ్చ రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ తో ఉన్నాడు. ఎత్తు: 5.3, తేది: 20-06-2023 నుండి కనబడుటలేదు. చివరిగా యూనియన్ బ్యాంక్, మిధాని వద్ద కనపడ్డారు. ఆయన్ని తెలిపిన వారికి రూ. 25000/- పారితోషికం ఇవ్వబడును.
అడ్రస్: ఉప్పుగూడ, హైదరాబాద్. Contact No 9989424522, 9966612052

SECOND WANTED

■ 500 KVA Used జనరేటర్ కావలెను. సంప్రదించండి ✆ 77299 45597, 95025 07999 [B-428]

HEALTH CARE

■ Natural Body Legs, Hands, Pain Relief Service only for Females Home Service @ Yourdoor Step. Contact: 9347683428 [H-796906]

HOME NEEDS

PEST CONTROL

■ Satya's Pest Control చెదలు బొద్దింకల నివారణకై, బొద్దింకలు, జెల్, ట్రీట్‌మెంట్ కిచెన్ & బాత్‌రూం Rs. 599/- చెదల నివారణకై సంప్ర: 9292407781/82 [H-780871]

WATER PROOFING

■ శ్రీమహాలక్ష్మి వాటర్ ప్రూఫింగ్: స్లాబ్, బాత్‌రూమ్స్, సైడ్ వాల్స్, టెర్రస్ లీకేజీలను అత్యాధునిక కెమికల్స్ విధానం ద్వారా అనుభవం గల టెక్నీషియన్స్‌తో 10 సం॥ గ్యారెంటీతో అరికట్టబడును. ఫోన్: 9985111979 [HA-11227]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, "Mohammed Sikender Ali" S/o. Mohammed Hamid Ali, R/o. 13-5-149/20, Yousuf Nagar, Karwan, Hyd, TS. I have Correct my Name as "Md Sikender Ali" Affidavit Dt. 22-06-2023. [H-189206]

■ I, Meenakshi Atluri D/o. Ramakrishna Kodali have changed my name to "Meenakshi Kodali" vide affidavit dated 23-03-2023 at Vijayawada. [WB-13508]

LOST

■ I, Pabbu Sandeep, S/o. P. Ashok GPA Holder of E.S.Nasir Hussain, of Plot No. 466, Sy. No. 14 Batasingaram, Hayath Nagar, RR. I Lost my Orginal Sale Deed Doc No. 760/2000, SRO Pedda Amberpet, While Traveling. If found call 8247047549. [HA-11263]

TOURS & TRAVELS

■ పూరి జగన్నాథ్, గిరిజాదేవి శక్తిపీఠం, కోణార్క్, భువనేశ్వర్, అన్నవరం, తలుపులమ్మలోవ, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, పిఠాపురం, ద్రాక్షారామం, ద్వారకా తిరుమల దర్శనములతో 5 రోజులు ఏసీ బస్సుయాత్ర జులై 4న లక్ష్మీటూర్స్. ఫోన్: 9866246466. [HA-14699]

■ S.V.Tours: వైష్ణోదేవి, రామేశ్వరం, కర్ణాటక, గుజరాత్, ఉజ్జయిని, సంప్రదించండి: 9030123243, 7386579123 [H-796902]

■ కాశీ, బద్రీనాథ్, నేపాల్, కేదార్‌నాథ్, హరిద్వార్, అయోధ్య మొదలగు టికెట్ వెల 25,000/- రోజులు 15, పొట్టి శ్రీరాములు సెంటర్ సూర్యాపేట విమానం. 26,500. ఫోన్: 9848782131 [H-780921]

■ గోవా, కర్ణాటక, గోకర్ణ శృంగేరి, ధర్మస్థలి+ 20 క్షేత్రాలు 10రోజులు జూలై 13న, షిర్డీ+ మహారాష్ట్ర 5జ్యోతిర్లింగాలు 8రోజులు జూలై 25న, రామేశ్వరం, అరుణాచలగిరి ప్రదక్షిణ+ 30 క్షేత్రాలు 10 రోజులు ఆగస్టు 6న లక్ష్మీటూర్స్.ఫోన్: 9866246466. [HA-14683]

■ జూలై 9 అమర్‌నాథ్ యా10రో 12యా జూలై 28కాశీ యాత్ర 9ని॥లు 12రో 17యా ఆగస్టు 27 నేపాల్ యాత్ర. భో.వ.తో Non AC Package మా టూర్స్, ఫోన్: 9493852100, 6304230161. [H-796795]

■ 28/7 రామేశ్వరం యాత్ర అరుణా చలం, శ్రీరంగం, 22యా॥, 10రో॥, 19/8 కర్ణాటక యాత్ర 7రో॥ 9/9 కాశీలో 9ని॥ 13 రో॥ 15/11/23, 8 జ్యోతిర్లింగాలు, 5 ద్వారకలు, సంప్ర. భాస్కరరావు. Ph: 9848486847 [H-781636]

Wanted

■ BSNL SIMS అమ్ముటకు ఏజెంట్స్ కావలెను మంచి జీతం, కమీషన్ +Inc, ECIL, మల్కాజ్‌గిరి, నాగారం, చర్లపల్లి, కాప్రా, సైనిక్‌పురి వారికి ప్రాధాన్యత ఫోన్: 9491309136/9110563631. [H-781342]

■ అమీర్‌పేట్ లేడీస్ హాస్టల్ లో పనిచేయుటకు, ఇంటర్ లేదా డిగ్రీ చదివిన లేడీ వార్డెన్ కావలెను. సంప్ర: 9985163370 [HA-780827]

■ ఘట్‌కేసర్, బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ వంట చేయుటకు భార్యా-భర్త & క్లీనింగ్ స్టాఫ్ కావలెను. భోజనం+రూం సౌకర్యం కలదు. ఫోన్ : 9848239955, 9573736363 [HA-796908]

■ పికర్స్ బాయ్స్ వుదూర్, మేడ్చల్ విలేజ్ కొరకు 9గం. జీ: 12,000/-+ ESI+PF, Q: 10th, P/F, సెక్యూరిటీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 4yrs Exp. Aso's & సెక్యూరిటీ గార్డ్స్ మేడ్చల్ లో కావలెను. ఫోన్ : 7702365554 [HA-11266]

Urgently Required
Delivery Boys/ Bikers in Hyderabad
Full / Part Time
Salary : Upto 25,000/- to 35,000/-
040-45206109

■ 24 గంటలు లేదా 9గంటలు ఇంట్లో ఉంటూ ఇంటిపని లేదా బేబీకేర్ చేయుటకు ఏ బాదరబందీ లేని మహిళ కావలెను. మంచి జీతము +భోజనం+వసతి.ఫోన్:6304449345. [HA-2762]

■ వినాయక హోమ్‌కేర్ సర్వీసెస్‌లో, బేబి కేర్, పేషెంట్ కేర్, ఇంటిపని, వంటపని చేయుటకు లేడీస్ కావలెను. భార్య-భర్త కూడ కావలెను. జీతం: 15-20వేల. 8247637946, 7816001148 [HA-30109]

■ ఇంటిపని, వంటపని చేయడానికి 30 నుండి 35సం॥ల వయస్సు వున్న మహిళ కావలెను. ఇంట్లో వద్దే ఉండవలెను, సంప్ర: 9848128386 [H-189253]

■ అమీర్ పేటలో పెద్దాయనను చూసుకొనుటకు మగమనిషి కావలెను, మంచి జీతం+ భోజనం+ వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9848454499, 8367679977 [H-780882]

■ గో రక్షకు సహకరించి 1000రూ.ల నుండి 25000 రూలు ఆదాయం లేదా 10000రూల నుండి అంచలంచెలుగా 1000000రూ లు అప్పు పొందు వివరములకు సంప్ర: 9502907465. [H-780713]

■ టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, వీడియో ఎడిటింగ్, డ్రైవర్లు, వర్కర్లు, మేస్త్రీలు, హెల్పర్లు, సూపర్‌వైజర్స్, ఆయాలు. 10-డిగ్రీ, ITI, ఫిట్టర్, BE, B.Tech, MBA, పాస్/ఫెయిల్. జీ: 10-20K+ఫ్రీహాస్టల్@9505261777ఉప్పల్, మణికొండ. [H-189208]

■ డ్రైవర్ కావలెను: జూబ్లీహిల్స్ ఇంటి నందు పనిచేయుటకు అనుభవం గల బ్యాచిలర్ డ్రైవర్ కావలెను జీతం: 18-20వేలు, భోజనం, వసతి ఇవ్వబడును, ఇతర సౌకర్యాలు పొందవచ్చు (షరతులు వర్తిస్తాయి). సంప్ర: 8985678833 [H-781513]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ & హౌస్ కీపింగ్ లేడీస్ స్టాఫ్, సాగర్ X రోడ్, అమీర్‌పేట్, షాద్ నగర్, ఏరియాల కొరకు & చౌటుప్పల్ ఫ్యాక్టరీ కొరకు లేడీస్ కావలెను. సంప్ర. 7675830044 [H-788759]

■ వెంటనే కావలెను: రిసెప్షనిస్ట్ (F) జీ: 10,000. టెలికాలర్స్ (F) జీ: 8,000+ కమీషన్, మార్కెటింగ్ మేనేజర్ (M/F) జీ: 12,000/- +కమీషన్. లేడీస్ టైలర్ జీ: 10,000/-, GNR ఇన్ ఫ్రా డెవలపర్స్ Ph: 8790691319/ 7013637842 [H-781509]

■ వార్డెన్, వంట మాస్టర్ కావలెను: కొంపల్లిలో గల బాయ్స్ హాస్టల్‌లో పనిచేయుటకు వార్డెన్ & మగ వంట మాస్టర్ కావలెను. జీతం+ భోజనం+వసతి. ఫోన్: 8125149083 [H-781510]

■ V.B.Johnson ఎలివేటర్స్ Lift కం॥కి (తెలుగు, హిందీ, ఇంగ్లీష్) డిగ్రీ, లేడీ రిసెప్షన్ & మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ఫోన్ : 9154954305, 9177762495 [H-796907]

■ ఫార్మా కంపెనీకి అనుభవం గల లేక ట్రైనీ టూరింగ్ చేయగల ఇంగ్లీషు, హిందీ వచ్చిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సొంత టూవీలర్ ఉన్నా Male కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్ : 9515906315. [H-780712]

■ RTC క్రాస్ రోడ్డు గాంధీనగర్ బాయ్స్ హాస్టల్‌లో హౌస్ కీపింగ్ (ఊడ్చుటకు, తుడుచుటకు) చేయుటకు స్త్రీ, పురుషులు, భార్యాభర్తలు కావలెను. మంచి జీతం + ఫ్రీ వసతి + భోజనం. Ph:9618940159, 9949338350 [H-780711]

■ శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచం మీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-780918]

■ హైదరాబాద్-బెంగళూరు హైవేలో బాలానగర్‌లో MUDA & TSRERA అప్రూవుడ్‌తో 43 ఎకరాల బ్యూటీఫుల్ ప్రాజెక్ట్ నందు పూర్తిగా కమీషన్ పద్ధతిలో మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. సంప్ర : Life Style Housing, Hyd, Cell : 79817 41144, 83741 67279 [B-246]

■ బేబీకేర్, ఇంటి, వంట, పేషెంట్స్ చూసుకోవడానికి కేర్ టేకర్స్, ఇంటికి పంపబడును. 20-50y స్త్రీ/పు, 24/7 మా వద్దనే ఉండి లాంగ్ టైమ్ డైవర్ వర్కర్స్ కావలెను. జీ: 16-20K. 6309807798, 9121099519 [H-780824]

■ అర్జెంటుగా. Fre/Exp. ఆఫీసర్ అసిస్టెంట్స్, ఆఫీస్ బాయ్స్ & సైన్ బోర్డు వర్కర్స్ శ్రీ బాలాజీ డిజిటల్స్ దిల్‌సుఖ్ నగర్. ఫోన్ : 9966657678, 8309149169. [HA-11256]

■ సుచిత్రలో 24గం॥లు ఇంట్లోనే ఉండి ఇంటిపని, వంటపని చేయుటకు పనిమనిషి కావలెను, జీతం: 15వేలు, వసతి, భోజనం కలదు. సంప్ర: 9959862353. [H-793450]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [H-793449]

■ అనుభవంగల లేడీ డాక్టర్ MBBS, గైనకాలజిస్ట్ & ఫిమేల్ ల్యాబ్ టెక్నిషియన్స్ కావలెను. సంప్ర. డాక్టర్స్ డైగ్నోస్టిక్ సెంటర్, అల్విన్ కాలనీ, కూకట్‌పల్లి. Hyd. ఫోన్: 7893812348 [H-797548]

■ అర్జెంటుగా కావలెను. ఎలక్ట్రీషియన్ (Above 5 Yrs Exp.) హౌస్ కీపింగ్, సూపర్ వైజర్స్, టైలర్స్ & కార్పెంటర్ కావలెను. సంప్ర: 8637338326, 6297204311, 7013046377 [H-780708]

■ జెంట్స్ టైలర్ షాపులో పార్ట్‌టైం/ఫుల్‌టైం పనిచేయుటకు, కట్టింగ్ మాస్టర్ మరియు హెల్పర్స్ కావలెను. సిఖ్‌విలేజ్, సికింద్రాబాద్. సంప్ర:9949891292, 7995611292. [H-793446]

■ VB డెవలపర్స్ అమీర్‌పేట్ న్యూబ్రాంచ్‌కు టెలికాలర్స్ - 12, టీంలీడర్స్ - 4, టీంమేనేజర్స్ - 2, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ -10, PA & రిసెప్షనిస్ట్. జీ: 8K-25K, ఫోన్: 7995859102 [H-781223]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-11209]

■ 24 గం॥ ఇంట్లోనే ఉంటూ ఇంటి, వంట, బేబీ కేర్, వృద్ధుల సేవ చేయుటకు అర్జెంటుగా 18-50సం॥లో లోపు అనుభవం ఉన్నా / లేకున్నా స్త్రీ/పు కా॥, జీ:15-18వేలు, రూం+భోజనం ఫ్రీ. ఫోన్ : 9398165519. [H-796796]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788702]

■ దిల్‌షుక్‌నగర్ పరిసరాల లో నివసించు కార్పెంటర్స్, (మాడ్యులర్) అల్యూమినియం ఫ్యాబ్రికేటర్స్, ఎలక్ట్రీషియన్స్, పెయిం టర్లు, టైల్స్‌లేయర్లు, హెల్పర్లు కావలెను. ఫోన్ : 9000779933 [HA-2761]

■ Hydలో 24 గం॥ ఇంట్లోనే ఉంటూ వంట, ఇంటిపని, బేబీ కేర్, పేషెంట్ కేర్ చేయుటకు స్త్రీలు కావలెను. వ॥ 18 to 45. జీతం : 15000-25000, భోజన వసతి ఫ్రీ ✆ 73864 44217, 96661 28467 [B-786379]

■ కొండవీడు ENT హాస్పిటల్స్ నందు ఆడియోలాజిస్ట్(B.Sc, M.Sc) కావలెను. అడ్రస్: నరసరావుపేట, పల్నాడు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్. ఫోన్ నెంబర్స్: 9440758731, 7981546446 [G-754647]

■ చెన్నై అసురన్ సోపు, డిటర్జెంట్ పౌడర్ అన్ని రకాల లిక్విడ్లను ఏ.పి.& తెలంగాణ వ్యాప్తంగా విక్రయించడానికి ఏరియాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. 73965 77077. [T-149]

■ Wanted Telecallers, Field Executives, Digital Mktg. Data Providers, Admin & Mktg. Agents for Real Estate Co. at Banjara Hills. Ph: 7032471624 [HA-14682]

■ Wanted Instructors for ITI Electr/ Diesel Mech/ Fitter near Balangar, Hyd. Q: Exp. B.Tech/Dip/CTI with 2/5/8yrs in resp Fields. WA your Resume to 9966278092 [HA-780828]

■ Wanted Cheque Pickup Executives for Bank Purposes, Areas: Hitech City, Mehdi patnam, Gochibowli, 2 Wheeler Must. Good Salary, Ph: 8919060886, 7989942019 [HA-93939]

■ Wanted Collection Field Exe. Telecallers Male & Female All Areas Req. Personal Loans Credit Cards Recovery Experience Must, Salary+ Commissions 18+ Plus ESI+ PF Available Contact:8328698732, 8247015273 [H-189207]

■ Wanted Marketing incharges, Marketing Vice principals, Female Telecallers, Class incharges, Qualification : Any Degree, Salary: 12,000/- to 30,000/- Experienced persons preferable Age: 25 to 45. Job Location: Dilsukhnagar, HYD. Master Minds College. 89781 80857, 9100069434 [G-4386]

■ Urgent Requirement for Security Guards Location Old City, Hyderabad, Q: 10th Pass, ESI+PF, Free Uniforms & Food, Sal: 18,500/- Interested Candidate. Ph: 9989187157. [H-781341]

■ Wanted Male & Female Branch Manager Cum Marketing For Hyd, Female Accountant Lady Front Office Lady With Adm & Tender Knowledge, M&F Regional Manager Vishakhapatnam & Bangalore, 9848898400, 9866676129. [H-189204]

■ Wanted Submersible Motor Rewinders Hands on Five Years Exp. in Rewinding 50 HP to 200 HP Electrical Submersibel Motors, Good Salary. Ph: 9121735083, Email:mdnationalmining@gmail.com [HA-11260]

■ Wanted Telecallers @ Ameerpet, Female/male to Work in EMRI 108 & 100, Quali: any Degree, Age 20-30yrs. Ph: 9121222067, 9100014983 [H-189251]

■ Wanted Security Guards Salary: 17,000+ESI+EPF, 12Hrs at Kukatpally, Nizampet, Miyapur, Ph: 9848523236, 9666266277. [HA-11246]

■ Wanted Hindi & Telugu Speaking Telecaller / Recep for Auto Fin Co. in Abids. Call: 8917298886 [WA-13399]B

■ Earn 500 to 1000 daily Hyderabad wanted welders and helpers Cell : 9989708312, 9502848262 [WB-13504]

■ Female Cook required for a vegetarian family living in Kukatpalli, Hyderabad, good salary, food and accommodation shall be provided. Ph: 9348028160 [WB-13717]

FACULTY TEACHERS

■ Wanted Incharge, Telugu, Hindi, English, Maths, Bio/Phy Science, Social, PET for Classes 6-10th & Telugu, English, Maths & Science for U.K.G.-5th Class. Nadergul, KongaraKalan. Ph: 8790190846, 9963635285 [HA-11257]

■ Wanted Teachers for High School Mathematics, Science, Social Studies, Primary Hindi, EVS at Krishnaveni Talent School, Hayathnagar & Gayatri Nagar, Cont: 9494242034, 6301926073 [H-780883]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



రత్నరాజుకు నియామకపత్రం అందజేస్తున్న రాంచందర్‌రావు

సనత్‌నగర్: వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండడం ద్వారానే తమకు జరిగే అన్యాయాలపై ప్రశ్నించేతత్త్వం అలవడుతుందని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ ఛాంబర్స్ రిజిస్ట్రార్ తారీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. అడ్వొకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆసరా) అంతర్జాతీయ కార్యకలాపాలకు అధిపతిగా డాక్టర్ రత్నరాజు నియమితులైన సందర్భంగా బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయంగా భారతీయులకు హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ఆసరా ముందుకురావడం అభినందనీయమన్నారు. విదేశాల్లో ఉన్న భారతీయులు ఎదుర్కొంటున్న సవాళ్లపై రత్నరాజుకు ఉన్న లోతైన అవగాహన వారి హక్కులను కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ.. వివిధ రూపాల్లో హక్కులపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ వారికి న్యాయం జరిగేలా చూస్తున్న ఆసరా సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.

గౌర్మెట్ బక్లావాకు అరుదైన గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: బక్లావా తయారీ పరిశ్రమలో దేశంలో మొట్టమొదటి సారిగా ఫుడ్ సేఫ్టీ సిస్టమ్ సర్టిఫికేషన్ (ఎఫ్‌ఎస్‌ఎస్‌సి) 22000ను పొందడం గర్వంగా ఉందని గౌర్మెట్ బక్లావా వ్యవస్థాపకుడు ఇమాల్ ఇంతియాజ్ సిద్ధిఖీ తెలిపారు. బంజారాహిల్స్, కొండాపూర్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొనసాగుతున్న గౌర్మెట్ బక్లావాకు ఫుడ్ సేఫ్టీ సిస్టమ్ సర్టిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని స్టోర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇమాల్ ఇంతియాజ్ సిద్ధిఖీ మాట్లాడుతూ.. నగరం వేదికగా తమకు ఈ సర్టిఫికేషన్ రావడం గర్వంగా ఉందన్నారు. నగరంలోని నాణ్యమైన ఆహార పదార్థాలకు ఇది ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తమ సేవల్లో భాగంగా టర్కీ నుంచి ప్రావీణ్యులైన చెఫ్‌లను తీసుకువచ్చామని అన్నారు. ఈ సందర్భంగా తమ ఉత్పత్తులను, సర్టిఫికేషన్‌ను ప్రదర్శించారు.

డ్రగ్స్ తీసుకుంటున్న యువకుని అరెస్టు

మణికొండ: అనుమానాస్పదంగా..ఒంటరిగా తిరుగుతూ సిరంజిలతో డ్రగ్స్ తీసుకుంటున్న యువకున్ని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదర్‌షాకోట్‌లోని సన్‌సిటీ మోర్ సూపర్‌మార్కెట్ వద్ద ఓ యువకుడు అనుమానాస్పందంగా తిరుగుతూ డ్రగ్స్ తీసుకుంటున్నారని శుక్రవారం రాత్రి ఎస్‌ఐ అనిల్‌కుమార్‌కు స్థానికులు సమాచారం ఇచ్చారు. దాంతో అతను, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి అక్కడకు వెళ్లి యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తన పేరు చిలకపాటి సాకేత్ అని, విద్యార్థినని, స్వస్థలం ఏపీలోని గన్నవరం అని తెలిపారు. తాను బెంగుళూరులో గుర్తు తెలియని వ్యక్తి వద్ద డ్రగ్స్ కొన్నానని అంగీకరించాడు. అతని వద్ద సోదా చేయగా ఎండీఎంఏ డ్రగ్స్ 5 గ్రాములు, సిరంజిలు 14, ఓ వేయింగ్ మిషన్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నార్కొటిక్స్ డ్రగ్స్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్ని రంగాలను గుర్తించడం హర్షణీయం

లక్డీకాపూల్: సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో చెప్పినట్టుగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా ఉందని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ అన్నారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో భాగంగా దాదాపుగా అన్ని రంగాలను సంతృప్తిపరిచే విధంగా వివిధ కార్యక్రమాలు రూపకల్పన చేశారన్నారు. వేడుకలు ఆసాంతం ఎంతో ఘనంగా నిర్వహించడం విశిష్టమైన సేవలందించిన ప్రతి ఒక్కరిని గుర్తించి ప్రశంసించడం స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ తెలంగాణ ఉద్యోగుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

లక్డీకాపూల్: 'మీరొక ఆలోచనతో రండి..మీ కలలకు రెక్కలందిస్తాం. చేపట్టిన పనిలో కష్టాలు ఎదురవుతాయి. అలాగని వదిలిపెట్టకండి..ముందుకు సాగినప్పుడే విజయవంతమవుతాం' అని కోవె చైర్‌పర్సన్ చేతనాజైన్ అన్నారు. శనివారం బేగంపేటలోని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (కోవె), తెలంగాణ చాప్టర్ కార్యాలయంలో 15 మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె శిక్షణ తరగతులకు హాజరైన మహిళలనుద్దేశించి మాట్లాడారు. తాము ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని ఈ స్థాయికి ఎదిగామని వివరించారు. మా విజయాలతోపాటు..చేసిన పొరపాట్లను కూడా మీతో పంచుకుంటామన్నారు. మేము చేసిన పొరపాట్లు మీరు చేయవద్దని, కొత్త తరం మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు.

యువతిని బెదిరిస్తున్న యువకుడిపై కేసు

వెంగళరావునగర్: గత కొంతకాలంగా ఓ యువతిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన యువతికి, అదే జిల్లాకు చెందిన గోపీ అనే యువకుడితో ఫేస్‌బుక్‌లో పరిచయం అయింది. అదికాస్త ప్రేమకు దారితీసింది. తనకు ఉద్యోగం లేదని, నగరంలో ఉద్యోగం ఉంటే ఇప్పించాలని కోరాడు. దాంతో ఆమె తాను పని చేస్తున్న కనకదుర్గా స్టీల్స్ కంపెనీలోనే ఉద్యోగం కూడా ఇప్పించింది. ఈ క్రమంలో ఇరువురు దగ్గరయ్యారు. అతనికి అనేక మార్లు వేలాదిరూపాయలు నగదును కూడా సహాయం చేసింది. అయితే కొంతకాలంగా గోపి మరో యువతితో అక్రమ సంబంధం పెట్టుకుని ఆమెతో స్నేహంలో ఉన్నాడు. ఈ విషయాన్ని గ్రహించిన ఫేస్‌బుక్ స్నేహితురాలు గోపీని దూరం చేసింది. తన వద్దకు రావద్దని, మాట్లాడవద్దని తిరస్కరిస్తూ వస్తుంది. దీనికి ఆగ్రహించిన గోపి తనతో గతంలో మాదిరిగా ఉండాలని, డబ్బులు ఇవ్వాలని, శారీరకంగా కలవాలని బెదిరించడం ప్రారంభించాడు. దీనికి ఒప్పుకోకుండా అతనిని ఆమె తిరస్కరించడంతో గతంలో ఇరువురు కలిసి ఉన్న ఫోటోలను ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరించడంతో ఆమె శనివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు గోపీపై 354 (డి), 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుని కోసం గాలిస్తున్నారు.

బహిరంగ ప్రకటన

చిట్టబోయిన్‌పల్లి గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ వద్ద గల సర్వే నం.17 భాగంలోని ఎ.1-27 గుంటలు మరియు సర్వే నం.18 భాగంలోని ఎ.1-13 గుంటలు, మొత్తం ఎ.3-00 గుంటల విస్తీర్ణం గల వ్యవసాయ భూములను గోనెల గోవర్ధన్ తండ్రి గోనెల యాదయ్య నుండి నా క్లయింట్ కొనుగోలు చేయదలిచారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. సర్వే నం. మరియు విస్తీర్ణం వివరాలు దిగువ తెలిపిన విధంగా ఉంటాయి.

సర్వే నం.	విస్తీర్ణం ఎ-గుంటలు
17/ఇ1/2/1/2	0-04
17/ఇ1/5	0-04
17/ఈ/1/2	0-02 ¼
17/ఈ/2	0-02 ¾
17/ఋ1/1	0-06 ½
17/రూ1/2	0-13
17/రూ/2	0-06 ½
17/లు	0-28
18/అ/1	0-01
18/అ/2	0-01
18/అ/3	0-01
18/అ/4	0-02 ½
18/అ/5	0-02 ½
18/ఆ/1/1	0-00 ¼
18/ఆ/1/2	0-00 ¾
18/ఆ/2	0-01
18/ఆ/3	0-01
18/ఆ/4	0-02 ½
18/ఆ/5	0-02 ½
18/ఇ/1	0-01
18/ఇ/2	0-01
18/ఇ/3	0-01
18/ఇ/4	0-03
18/ఇ/5	0-03
18/ఈ/1	0-03
18/ఈ/2	0-03
18/ఈ/3	0-03
18/ఈ/4	0-09 ½
18/ఈ/5	0-09 ½
మొత్తం	3-00

సదరు ఆస్తిలో మరియు పైన ఏదైనా హక్కు, క్లెయిమ్ లేదా ప్రయోజనం గల ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు ఈ నోటీస్ ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోగా సంబంధిత డాక్యుమెంట్లతో క్రింది సంతకందారును సంప్రదించవచ్చును, లేనట్లయితే నా క్లయింట్ అతని / దాని పేరున సేల్ డీడ్‌ను నమోదు చేసుకొనుట ద్వారా ముందుకు కొనసాగుతారు. ఆ తరువాత ఎటువంటి అభ్యంతరాలు లేదా క్లెయిమ్‌లు లేదా ఇతరత్రా అంగీకరించబడవు.

సం/- జి.వి. మల్లికార్జున రావు
అడ్వకేట్
S.R.T. 270, సనత్‌నగర్, హైదరాబాద్.
సెల్: 9866137083

సర్కారు బడుల్లో... డిజిటల్ బోధనకు శ్రీకారం

- అన్ని పాఠశాలలకు టచ్ స్క్రీన్ల పంపిణీ
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుందంటున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు ఏర్పడటమే కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మారుమూల బస్తీల్లో సైతం కొత్త సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. సాంకేతికతను జోడించి డిజిటల్ పద్ధతిలో వినూత్న బోధనా విధానం ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు.


బంజారాహిల్స్ గతి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు

బంజారాహిల్స్: విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, రహమత్‌నగర్, వెంగళ్‌రావు నగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన మెటీరియల్‌ను బడులకు అందజేశారు

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తీరుతెన్నులు పూర్తిగా మారనున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రైవేట పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు.
- రాజ్‌భవన్, ఎస్పీటీ నగర్, గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు దొరకని పరిస్థితి నెలకొందంటే సర్కారు బడులకు విద్యార్థులు ఏ స్థాయిలో క్యూలు కట్టారో అర్థం చేసుకోవచ్చు ఆరేళ్ల నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు గుణాత్మక విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- మన బస్తీ–మన బడి మొదటి విడతలో పలు పాఠశాలల్లో 12 అంశాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేశారు. ఈ ఏడాది దృశ్య బోధన పద్ధతిలో పాఠాలు బోధించేందుకు సిద్ధమవుతున్నారు ఒక్కో పాఠశాలకు మూడు చొప్పున టచ్ స్క్రీన్ ఉన్న టీవీలను పంపిణీ చేశారు. ఒక్కో టీవీ దానికి సంబంధించిన ఉపకరణాలు, బోర్డుల విలువ రూ. 3 లక్షలు ఉంటుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఇన్వర్టర్ల సహాయంతో బోధన సాగేలా ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు...

విద్యార్థులు తరగతి గదిలో ఎక్కడి నుంచైనా చూసేందుకు 75 ఇంచుల వెడల్పుతో టీవీలు ఏర్పాటు చేశారు. తెలంగాణ స్టేట్ టెక్నోలాజికల్ సర్వీసెస్ సహాయంతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ పేరుతో టీవీల ద్వారా సాధారణ బోధన, కంప్యూటర్ ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుంటారు. టీవీలను తెల్లని బోర్డులుగా ఉపయోగిస్తూ పెన్నులు, చేతి వేళ్లతో నచ్చిన రంగులతో అక్షరాలు రాయవచ్చు. చెప్పిన పాఠాలను రికార్డు చేసి ఏ సమయంలోనైనా వీక్షించేందుకు వీలుగా రూపొందించారు.

- పాఠ్యపుస్తకాల పీడీఎఫ్‌ను డౌన్ లోడ్ చేసి విద్యార్థులకు చూపించవచ్చు. పాఠ్యాంశాలకు సంబంధించిన దృశ్యాలను చూపిస్తూ సులభమైన పద్ధతిలో 8,9, 10 విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించేందుకు వీలవుతుంది.
- టెలివిజన్‌కు అమర్చిన గ్రీన్ బోర్డు సుద్ద ముక్కలతో మామూలుగా పాఠాలు చెప్పేందుకు వినియోగించవచ్చు. తెర మాదిరిగా ఉన్న బోర్డును పక్కకు జరిపితే టీవీ కనిపిస్తుంది.
- ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.
- డిజిటల్ పద్ధతిలో పాఠాలు చెబుతుండటంతో విద్యార్థులకు తొందరగా అర్థమవుతుందని ప్రవేశాలు మరింత పెరుగుతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషితో ప్రగతిపథంలో నిమ్స్

లక్డీకాపూల్: నిజామ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప పిలుపునిచ్చారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉద్యోగులు, వైద్యులు అందరూ సమన్వయంతో కృషి చేస్తేనే అనుకున్న లక్ష్యాలను చేరుతామన్నారు. శనివారం సీఎం కేసీఆర్ పర్యటనలో వలంటీర్‌లుగా పని చేసిన వారి సేవలను గుర్తిస్తూ కృతజ్ఞత సభ నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్.లక్ష్మీభాస్కర్, ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డాక్టర్ నగేష్, డాక్టర్ సాయిబాబా, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసానిని కలిసిన సభ్యులు


కాసానిని కలిసిన జూబ్లీహిల్స్ టీడీపీ నూతన కార్యవర్గం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ నూతన కార్యవర్గం శనివారం టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి ఘనంగా సత్కరించి తమకు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కాసాని పార్టీ శ్రేణులకు సూచించారు. ఐకమత్యంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎం.డి.సలీం, భవానీ, మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, మైనార్టీ అధ్యక్షుడు హసన్, కె. యాదగిరి, జాఫర్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పరుగు


బంజారాహిల్స్ రోడ్ నెం. 3 పోలీస్ స్టేషన్ దారిలో పొంగుతున్న మురుగు

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో నిత్యం మురుగు సమస్య వేధిస్తున్నది. నిత్యం ఈ రోడ్డులో మురుగు సమస్యతో ఓలే స్టోర్ నుంచి పేజ్ కాలేజీ వరకు రోడ్డంతా మురుగుమయంగా మారుతున్నది. దీంతో ఈ దారిగుండా పెద్ద సంఖ్యలో స్థానికులు విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. స్థానికంగా ఉన్న అసౌకర్యాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫంక్షన్ హాల్ పనులను సత్వరమే పూర్తిచేయాలి

వెంగళరావునగర్: ప్రజాసంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న పనులను మరింత వేగంగా చేయాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ కాలనీలోని అయ్యప్ప గ్రౌండ్‌లో నూతనంగా నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఫంక్షన్ హాల్‌ను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకొస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కొంతకాలంగా నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, వేగంగా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదని ఆమె కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ఏఈ అవినాష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్, వేణు, బాల్‌రాజ్, పవన్ ముదిరాజ్, కృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మగాంధీ నగర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బన్సీలాల్ గోకుల్‌దాస్ నహదియా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి హరి అగర్వాల్ మాట్లాడుతూ... ఏటా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటామన్నారు. నగర వ్యాప్తంగా మరిన్ని పాఠశాలల్లో పేద విద్యార్థులకు స్టేషనరీ వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జీవీ భద్రం తదితరులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

- శ్రీరాంనగర్‌లో హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో ప్రమాదం
- దగ్ధమైన విద్యుత్ మీటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు


గాయపడిన ఇక్బాల్

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో మరో హైటెన్షన్ విద్యుత్ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్రగాయాలు కాగా సమీప నివాసాల్లో విద్యుత్ మీటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. వివరాలివీ... శ్రీరాంనగర్ అల్‌మషైక్ హోటల్ ఎదుటి గల్లీలో యాదుల్లా అనే వ్యక్తి నివాసం ఉంది. తన ఇంటికి మరమ్మతులు చేసే క్రమంలో శనివారం పనివారిచే భవనంపై ఉన్న గదికి రంగులు వేయిస్తున్నాడు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో భవనంపై ఉన్న గదికి రంగులు వేస్తున్న ఇక్బాల్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు హైటెన్షన్ విద్యుత్ షాక్ తగిలి శరీరం తీవ్రంగా కాలి పోయింది. విద్యుత్ ప్రవాహ తాకిడికి భవనం పై ఉన్న గది రేకులు పగిలి పోయాయి. తీవ్ర రక్త స్రావం అవుతున్న ఇక్బాల్‌ను స్థానికులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విద్యుదాఘాతంలో చుట్టుపక్కల నివాసాల్లో టీవీలు, విద్యుత్ మీటర్లు, ఎలక్ట్రానిక్ పరకరాలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న బోరబండ, మధురానగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్ శ్రీనివాస్, హైటెన్షన్ విద్యుత్ విభాగం ఏఈ ప్రదీప్‌లు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. శ్రీరాంనగర్ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ ప్రమాదాలు తరుచూ జరుగుతున్న సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.

నిమ్స్‌కు పరికరాల వితరణ

లక్డీకాపూల్: నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్న నిమ్స్ ఆస్పత్రికి పలువురు దాతలు స్వచ్ఛందంగా పరికరాలను విరాళంగా అందజేశారు. ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగు నీటి వాటర్ కూలర్స్, పేషెంట్ ట్రాలీలను శనివారం అందజేశారు. వీటిని మేడపాటి శ్రీదేవి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్పకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మి భాస్కర్, ఎమర్జెన్సీ ఇంచార్జీ డాక్టర్ హస్మా శర్మ, నిమ్స్ లీగల్ సెల్ మాజీ సలహాదారులు మనోహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


దాతలను సత్కరిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

మదిదోచే చేనేత ఉత్పత్తులు


కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీలో హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకుడు వినోద్‌జైన్ తెలిపారు. మేళాలో కళాకారులు తయారు చేసిన చేనేత వస్త్రాలు ధర్మవరం, వెంకటగిరి, ఉప్పాడ, మంగళగిరి, అస్సాం చీరలు, ఎంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కర్ణాటక ఫ్యాషన్ డిజైన్, ఛందేరి, మహేశ్వరి, రాజస్థాన్, భాగల్పూర్ సిల్క్ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు.

మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

సికింద్రాబాద్: రైళ్లలో మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడంలో రైల్వే రక్షణ దళం బృందాలు పకడ్బందీ చర్యలు తీసుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని సికింద్రాబాద్ డివిజనల్ ఆర్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబష్మిత చటోపాధ్యాయ బెనర్జీ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను గతేడాది కన్నా రెట్టింపు మొత్తంలో ఈ ఏడాది జూన్ వరకే స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 23న మధిర, ఖమ్మం ఆర్‌పీఎఫ్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో 41కిలోల గంజాయి బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ పోలీసులు ఈ ఏడాదిలో రూ.2.43 కోట్ల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె ప్రకటించారు.గంజాయిని స్వాధీనంతో పాటు 10 మంది అక్రమ రవాణాదారులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆపరేషన్ నార్కోస్ పేరుతో ఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రత్యేక శిక్షణను ఇవ్వడం ద్వారా రైళ్లలో మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నామన్నారు.


మధిరలో ఆర్‌పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

సంసార కళాశిక్షణ కేంద్రం ప్రారంభం


విద్యార్థులు తీర్చిదిద్దిన చిత్రాలను వీక్షిస్తున్న అంబటి కృష్ణారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లో నూతనంగా ఏర్పాటైన సంసార కళాశిక్షణ కేంద్రాన్ని శనివారం ఏపీ వ్యవసాయ శాఖ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఫైన్ ఆర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆర్ట్స్‌లో సమగ్ర శిక్షణను ఈ అకాడమీ ద్వారా అందిస్తామని సంసార అకాడమీ నిర్వాహకులు ఆయుష్ అగర్వాల్ తెలిపారు. ఆర్ట్స్‌లో ప్రత్యేక మెళకువల నేర్చుకునేందుకు నగరం నుంచే కాకుండా ముంబై, మణిపూర్, కోల్‌కతా వంటి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాకేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా అకాడమీ ఆవరణలో విద్యార్థులు తీర్చిదిద్దిన పలు చిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత లక్ష్మాగౌడ్, నటుడు వీజే సన్ని తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో బీజేపీ నేతల పర్యటన

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి 137 బూత్ బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగారు. మహాజన్ సంపర్క్ అభియాన్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పరిపాలన, సాధించిన విజయాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

బీజేపీవైపే ప్రజలు: కీర్తిరెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న కీర్తిరెడ్డి జూటూరు

శ్రీనగర్‌కాలనీ: బీజేపీని ప్రజలు విశ్వసిస్తున్నారని, ప్రపంచ దేశాలు కూడా భారతదేశ అభివృద్ధిని చూసి హర్షిస్తున్నాయని ఆ పార్టీ జూబ్లీహిల్స్ నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు అన్నారు. శనివారం శ్రీనగర్‌కాలనీలో మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనపై ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో నేతలు శాంతికుమార్, శ్రీనగర్‌కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌యాదవ్, శ్రీశైలం, నవీన్, ఉమేష్, శ్రీనివాస్, శ్రీదేవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై వాహనం.. ఎవరిదో?

రహమత్‌నగర్: కార్మికనగర్ ఫుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ మోటార్ సైకిల్ పార్క్ చేసి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఏపీ 13ఎల్ 5384 అనే నెంబరు గల ఎరుపు రంగు పల్సర్ వాహనం కార్మికనగర్–శ్రీరాంనగర్ మధ్య ఉన్న ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసి ఉంది. ఈ వాహనం ఎవరిదో.. ఎందుకు ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లారో అని స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత 9 ఏళ్లుగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ.. కార్మిక హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా 29 కార్మికచట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైల్వే రక్షణ, ఫార్మా, సింగరేణి తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు ఎన్.బాలరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీవోలను అమలు చేసి షెడ్యూల్ పరిశ్రమలకు వెంటనే కనీస వేతన జీవోను ప్రకటించి అమలు చేయడంతో పాటు రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కె.సూర్యం, ఎం.శ్రీనివాస్, టీఎంటీయూసీ నాయకులు ఎం.కే.బోస్, బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, హెచ్ఎంఎస్ నాయకులు ఆర్.రామారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

కాచిగూడ: ప్రతి మహిళా స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలాదేవి బాలికల జూనియర్ కళాశాల వద్ద జూలై 2న ఆన్‌లైన్‌లో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షలకు పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఆర్థికాభివృద్ధి, రాజకీయ స్థిరత్వం, సామాజిక పరివర్తనకు మహిళలు సాధికారత సాధించడం కీలకమని అది మహిళలకు విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ– స్కూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్లెట్స్ గెల్చుకునే అవకాశం ఉందన్నారు. 7661899899 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి రిఫరల్ కోడ్ 15011 ఉపయోగించి పేర్లను నమోదు చేసుకోవాలని నీలిమ సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ హేమమాలిని, లెక్చరర్స్ సమత, రమ్యశ్రీ, అనురాధ దీక్షిత్, హరిప్రియ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనుపశేఖర్, అఖిల్, భారత్, ఖుర్షీద్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

పంజగుట్ట: ముదిరాజ్ బిడ్డపై దాడి చేయడమే కాకుండా యావత్ ముదిరాజ్ కులస్తులను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ బాబు ముదిరాజ్ డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే ముదిరాజ్ కులస్తులు ఆయనకు రాజకీయంగా పాడె కట్టడం ఖాయమని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాము ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సాయన్న ముదిరాజ్‌లతో కలిసి మాట్లాడుతూ... పాడె కౌషిక్ రెడ్డి ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేసే ముదిరాజ్ కులస్తున్ని కిడ్నాప్ చేయడమే కాకుండా, ఇంట్లో బంధించి తీవ్రంగా కొట్టి బండబూతులు తిడుతూ, యావత్ ముదిరాజ్‌లను ఉద్దేశించి కూడా బండ బూతులు తిట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులు కూడా సాక్షాధారాలు లేవని కేసు నమోదు చేయడం లేదని తాము అన్ని సాక్ష్యాలతో జాతీయ బీసీ కమిషన్‌ను, హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో వెంకటేష్ ముదిరాజ్, బండి నర్సింగ్ ముదిరాజ్, శ్రీనివాస్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తర్వాత బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలు, ఒక ఉపకులాన్ని తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీ జాబితా నుంచి తొలగించడంవల్ల పిల్లల చదువులకు, ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షులు పాడిపిరెడ్డి అచ్యుత దేశాయ్, కన్వీనర్ కూనిరెడ్డి శ్రీనివాస్, అధ్యక్షులు పోలా లక్ష్మణ్ నాయుడులు మాట్లాడారు. గత 60 సంవత్సరాలుగా తొలగించిన 26 కులాల సుమారు 10 లక్షల కుటుంబాలు తెలంగాణలో జీవిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ముఖ్యమంత్రి తమను బీసీ జాబితానుంచి తొలగించి కోలుకోలేని దెబ్బకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాము రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. నాయకులు నల్ల బలరాం, మల్లికార్జున రావు, లచ్చిరెడ్డి వెంకట్రాజు, కార్తీక్, శ్రీనివాస్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మంగళవారం క్రాఫ్ట్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వీవ్స్ ఆఫ్ ఇండియా–2023 పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శన ఆదివారంతో ముగియనున్నది. ఈ ప్రదర్శనలోని చీరలు మహిళలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే ఉద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.


వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

డీఎస్పీగా పదోన్నతి పొందడంపై హర్షం


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న డీఐ, ఎస్ఐలు

హిమాయత్‌నగర్: ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ (ఏసీపీ)గా పదోన్నతి సాధించిన నారాయణగూడ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌ను సిబ్బంది అభినందించారు. శనివారం నారాయణగూడ పీఎస్‌లో డీఐ సుధాకర్, అడ్మిన్ ఎస్ఐ షఫీ, ఎస్ఐలు శిరీష, నరేష్ తదితరులు శ్రీనివాస్‌ను పూలమాలలతో సత్కరించారు.

కార్మికులకు అలవెన్సులు ఇవ్వాలి

లిబర్టీ: కార్పొరేషన్, పురపాలక సంఘాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అలవెన్సులు ఇవ్వాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది కానుకగా అలవెన్స్ పెంచిందని వాటిని కూడా నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని విన్నవించారు. శనివారం లిబర్టీ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు ట్రావెలింగ్ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 30 శాతానికి పెంచిందని వాటిని కూడా పచ్చదనం పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు, మున్సిపల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్మికులకు వర్తింపజేయాలని విన్నవించారు. సమావేశంలో నేతలు దిలీప్‌సింగ్, రవి పాల్గొన్నారు.

కంటి నిండా నిద్ర కరువు



40 ఏళ్లు పైబడిన వారిని వేధిస్తున్న నిద్ర లేమి

- ఏజ్ వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి
- 5 వేల మందిపై సర్వే
- కనీసం 6 గంటలు నిద్ర పోలేకపోతున్నట్టు 70 శాతం మంది వెల్లడి
- నిద్ర లేమితో బాధపడుతున్న వారిలో పురుషులే అధికం

సాక్షి, అమరావతి: మారిన జీవన విధానాలు, చుట్టుముడుతున్న ఆర్థిక, కుటుంబ సమస్యల నడుమ మధ్య వయస్కులు, వృద్ధులో కంటి నిండా నిద్ర కరవు అవుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కులు పగలంతా కష్టం చేసి రాత్రి అయ్యాక కంటి నిండా నిద్రపోవడం ఒక కలగా మారుతోంది. ఏజ్‌వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 40 నుంచి 64 ఏళ్లు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇలా రెండు వర్గాలుగా మే నెలలో దేశవ్యాప్తంగా 5 వేల మంది నుంచి ఫౌండేషన్ వివరాలు సేకరించింది. వీరిలో 40 నుంచి 64 ఏళ్ల వారు 2245 (పురుషులు 1102, మహిళలు 143)మంది, 65 ఏళ్లు పైబడిన వారు 2,755 (పురుషులు 1,336, మహిళలు 1,419) మంది ఉన్నారు.

6 గంటలు కూడా నిద్రపోలేకున్నాం

70 శాతం మంది రోజులో కనీసం ఆరు గంటలు కూడా కంటి నిండా నిద్ర పోలేకపోతున్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. 24 శాతం మంది మాత్రం 7 నుంచి 8 గంటలు, 6 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. మధ్య వయసుల్లో 60 శాతం ఆరు గంటలలోపు, 31 శాతం 7 నుంచి 8 గంటలు, 9 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నామన్నారు. అదే వృద్ధుల్లో 78 శాతం మంది ఆరు గంటల్లోపు, 19 శాతం మంది 7 నుంచి 8 గంటలు, 3 శాతం మంది 8 గంటలకు పైగా నిద్ర పోతున్నట్టు వెల్లడైంది.

ఆర్థిక ఇబ్బందులు ప్రధాన కారణం

నిద్ర లేమికి ప్రధాన కారణం ఆర్థిక పరమైన అంశాలేనని సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య లేకపోవడం, ఇతర కలహాలు కారణమని పేర్కొంది. యాంత్రిక జీవనం, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, మద్యం సేవించడం, ఇతర సమస్యలతో సరైన నిద్ర ఉండటంలేదని కూడా ఫౌండేషన్ తెలిపింది. వయోభారం రీత్యా చుట్టుముట్టిన ఆరోగ్య సమస్యలు, ఒంటరి జీవనం నిద్రలేమికి కారణంగా వృద్ధులు పేర్కొన్నారు.

ఇలా చేయండి.. నిద్ర పడుతుంది

సర్వేలో భాగంగా నిద్ర లేమి సమస్య నివారణకు పలు సలహాలు, సూచనలు కూడా ఫౌండేషన్ తెలియజేసింది. అవి..

- నిద్రకు ఉపక్రమించే 4 గంటల ముందు నుంచి కాఫీ, టీలు తాగకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు. వేడి పాలను తాగాలి
- ఆందోళన, ఒత్తిడి, నిరాశ నిద్రకు పెద్ద అవరోధం. వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవాలి
- పగటిపూట నిద్ర మానుకోవాలి
- టీవీ, సెల్‌ఫోన్ చూడకూడదు
- పడక గదిలో స్లీప్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా చూసుకోవాలి

పురుషులే అధికం

నిద్రలేమితో సతమతం అవుతున్న వారిలో పురుషులే అధికం. పురుషుల్లో 81 శాతం మంది కనీసం ఆరు గంటలు కూడా నిద్రపోలేకపోతున్నామని వెల్లడించారు. అదే మహిళల



విషయానికి వస్తే 60 శాతం మంది ఆరు గంటలలోపు నిద్రపోతున్నామని చెప్పారు. మరో 15% మంది పురుషులు, 32% మంది మహిళలు 7 నుంచి 8 గంటలు, 4% పురుషులు, 8 శాతం మహిళలు 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. సర్వేలో పాల్గొన్న మొత్తం వ్యక్తుల్లో 55.08% మంది ప్రస్తుతం నిద్ర విధానంతో అసంతృప్తిగా ఉన్నామని తెలిపారు.

చిక్కిన చిరుత

- తల్లి చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు
- నడక మార్గంలో యథావిధిగా భక్తులకు అనుమతి
- అలిపిరి–తిరుమల మధ్య ఫెన్సింగ్ ఏర్పాటు వీలుకాదు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల నడక దారిలో పట్టుబడిన చిరుత

తిరుమల: అలిపిరి–తిరుమల మార్గంలో బాలుడిపై దాడికి పాల్పడిన చిరుత అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. శేషాచలం అటవీ ప్రాంతంలోని 7వ మైలు వద్ద రెండు ప్రదేశాల్లో రెండు బోన్లు పెట్టగా.. ఒక దానిలో శుక్రవారం రాత్రి 10.45 గంటలకు చిరుత చిక్కిందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆ చిరుతను టీటీడీ ఈవో అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురువారం రాత్రి అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిందని తెలియగానే దానిని పట్టుకోవాలని నిర్ణయించామన్నారు. చిరుత వయసు ఏడాదిన్నర ఉంటుందని, అది పిల్లిని తరుముకుంటూ వచ్చి అవగాహన లేక పిల్లాడిని తీసుకెళ్లినట్టుగా గుర్తించామని అన్నారు.

చిరుతలు మనుషులపై దాడి చేయవు

చిన్న చిరుత కావడం వల్ల వేటపై అవగాహన లేక ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. చిరుతలు మనుషులపై దాడి చేయవన్నారు. చిరుతను బంధించేందుకు రెండు ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేసి 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చామని తెలిపారు. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు బోనులో చిరుత పడినట్టు సమాచారం వచ్చిందన్నారు. పట్టుబడిన చిరుతను 50 కిలోమీటర్ల అవతల అటవీ ప్రాంతంలో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తల్లి చిరుత కూడా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని, దానిని కూడా పట్టుకుంటామని చెప్పారు. శుక్రవారమే తల్లి చిరుత పట్టుబడేదని.. అయితే తగినంత ఆహారం దొరకడంతో అది రాలేదని గుర్తించామన్నారు. త్వరలోనే దాన్ని పట్టుకుని దూరంగా విడిచి పెట్టి భక్తుల్లో ఉన్న భయాందోళనలు తొలగిస్తామన్నారు.

నడక మార్గంలో వచ్చే భక్తులను ఆపబోం

చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి–తిరుమల నడక మార్గాన్ని మూసివేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గాలి గోపురం నుంచి నరసింహస్వామి ఆలయం వరకు 200 మంది భక్తులకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున కేటాయింపు ఒక గుంపుగా పంపుతున్నామని తెలిపారు. నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారన్నారు. జంతువులు తిరిగే అటవీ ప్రాంతంలో వాటి స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించకూడదని, అటవీ శాఖ నిబంధనల మేరకే వ్యవహరించాలని స్పష్టం చేశారు.

తిరుమలలో ఆగస్టు, సెప్టెంబర్ గదుల కోటా 26న విడుదల

తిరుమల: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల కోటాను విడు దల చేస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతి, తలకోన ప్రాంతాల్లోని గదులను భక్తులు https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు.

29న శ్రీశైలంలో సహస్ర ఘటాభిషేకం

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రం సస్యశ్యామలం కావాలనే సంకల్పంతో ఈ నెల 29న శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న శనివారం తెలిపారు. తొలి ఏకాదశి రోజున మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రుద్రపారాయణ, విరాటపర్వ పారాయణ, వారుణానువాక పారాయణ, కాళక పారాయణ, పంచాక్షరీజపం, రుష్యశృంగ, వరుణ జపాలు చేపడతామన్నారు.

ప్రీమియం రైళ్ల స్థానంలో 'వందేభారత్'

- శతాబ్ది స్థానంలో ప్రస్తుత చైర్‌కార్ రైళ్ల వినియోగం
- వచ్చే మార్చి నుంచి రానున్న వందేభారత్ స్లీపర్
- రాజధాని స్థానంలో వాటిని నడిపే యోచన

సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో ప్రీమియం కేటగిరీ రైళ్లుగా గుర్తింపు పొంది, దశాబ్దాలుగా విజయవంతంగా నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు త్వరలో కనుమరుగు కాబోతున్నాయి. కొత్తగా ప్రారంభమై సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్లను వాటి స్థానంలో నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రస్తుతం పగటి వేళ నడుస్తున్న చైర్‌కార్ కోచ్‌లతో కూడిన రెగ్యులర్ వందేభారత్ రైళ్లు శతాబ్ది స్థానాన్ని ఆక్రమించనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలో అందుబాటులోకి రానున్న వందేభారత్ స్లీపర్ రైళ్లను రాజధాని స్థానంలో నడపాలని ప్లాన్ చేస్తోంది. దీంతో ప్రస్తుతం నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు దశలవారీగా మాయం కానున్నాయి.

అదే వేగంతో..

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య వందేభారత్



రైళ్లను ప్రారంభిస్తున్నారు. వీలైనంత తొందరలో 400 వందేభారత్ రైళ్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే శాఖ వాటి తయారీపై దృష్టి సారించింది. చైర్‌కార్ కోచ్‌లతో ఉన్నందున వీటిని రాత్రి వేళ నడిపే వీలు లేదు. దీంతో ఉదయం నుంచి అర్ధరాత్రి లోపు గమ్యం చేరి, మళ్లీ సొంత స్టేషన్‌కు తిరిగి వచ్చేలా సమయాలను సెట్ చేశారు. ప్రస్తుతం శతాబ్ది రైళ్లు కూడా ఇదే తరహాలో చైర్‌కార్ కోచ్‌లతో పగటి వేళ నడుస్తున్నాయి. భారత తొలి ప్రధాని నెహ్రూ శతజయంతికి గుర్తుగా శతాబ్ది (వందేళ్లు) పేరుతో 1988లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించింది.

వచ్చే మార్చికి స్లీపర్ రైళ్లు..

తక్కువ దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య తిరుగుతున్న వందేభారత్ రైళ్లను దూర ప్రాంతాల మధ్యా ప్రవేశపెట్టాలని రైల్వే నిర్ణయించింది. ఇందుకోసం వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీనికి సంబంధించిన డిజైన్లు సిద్ధమవుతున్నాయి. వచ్చే మార్చి నాటికి తొలి రైలు పట్టాలెక్కించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాజధాని నగరం ఢిల్లీకి, దేశంలోని ప్రధాన నగరాలకు మధ్య అనుసంధానంగా ఉన్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో వీటిని నడపాలని భావిస్తోంది. 1969లో ఢిల్లీ–హౌరా మధ్య తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 18 రాజధాని రైళ్లు తిరుగుతున్నాయి. రాజధానిని తేజస్ రైళ్లుగా మార్చాలని నిర్ణయించి, తేజస్ రాజధాని పేరుతో ఏడు రైళ్లను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించింది. తాజాగా వాటి స్థానంలో వందేభారత్ స్లీపర్ కోచ్‌లను నడపాలని భావిస్తోంది.

అత్తను నరికిన అల్లుడు

- అక్కడికక్కడే మృతి చెందిన అత్త
- విజయవాడలో ఘాతుకం



నాగమణి (ఫైల్)

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): అత్తను ఆమె అల్లుడే కత్తితో దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నైనవరం ఫ్లై ఓవర్‌పై శనివారం రాత్రి చోటుచేసుకుంది. మామను కూడా చంపేందుకు ప్రయత్నించగా.. వేగంగా బైక్ నడిపి తప్పించుకోగలిగాడు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన గోగుల నాగమణి (50), గురుస్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం కాగా, రెండో కుమార్తె లలితను ఏకలవ్యనగర్‌కు చెందిన కుంభా రాజేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా రాజేశ్, లలిత మధ్య గొడవలు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి లలిత పుట్టింట్లోనే ఉంటోంది. విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేయగా కేసు చివరి దశలో ఉంది. ఈ క్రమంలో రాజేశ్ తన అత్త, మామలను చంపేందుకు ప్లాన్ చేశాడు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి సాయిరాం థియేటర్ వద్ద ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి నాగమణి, గురుస్వామి బైక్‌పై బయలుదేరారు. వారి బైక్‌ను ఇంటి నుంచే రాజేశ్ మరో వ్యక్తితో కలిసి మరో బైక్‌పై వెంబడించాడు. నైనవరం ఫ్లై ఓవర్ మధ్యన ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి బైక్ వెనుక కూర్చున్న రాజేశ్ అత్త నాగమణిపై కత్తితో వేటు వేశాడు. భుజంపై కత్తి వేటుపడగా.. నాగమణి పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో ఆమె మెడపై కత్తితో నరికాడు. అదే సమయంలో బైక్‌పై ఉన్న గురుస్వామి భయంతో వేగంగా అక్కడి నుంచి వెళ్లి తప్పించుకున్నాడు. కాగా, రక్తం మడుగులో పడి ఉన్న నాగమణి కొద్దిసేపు గాయాలతో విలవిల్లాడి ఘటనాస్థలంలోనే మృతిచెందింది.

నగర వార్తలు

కారును వెంబడించి.. రూ.40 లక్షలు దోపిడీ

నిందితులను పట్టుకున్న పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు



పట్టుబడ్డ నిందితులు..

దుండిగల్: బైక్‌పై కారును వెంబడించిన ముగ్గురు వ్యక్తులు సినీ ఫక్కీలో దాడి చేసి రూ.40 లక్షలతో ఉడాయించారు. తాను పని చేస్తున్న సంస్థలోని డబ్బును తీసుకెళ్తున్న వ్యక్తే సూత్రధారి కావడం గమనార్హం . దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి..దుండిగల్ సిఐ రామకృష్ణ, డిఐ హనుమాన్‌గౌడ్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. బౌరంపేట గ్రామానికి చెందిన పండిగొట్ల మల్లేశ్ స్థానికంగా ఉన్న దుర్గా ఆటో మొబైల్స్ గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇదే గ్యారేజీలో సూరారం గ్రామం విశ్వకర్మ కాలనీకి చెందిన జల అనిల్ కుమార్ గతంలో డ్రైవర్‌గా పని చేసి మానేశాడు. కాగా ఈ నెల 23వ తేదీన గ్యారేజీ అకౌంటెంట్ సాయిరాం, మల్లేశ్‌లు కంపెనీకి సంబంధించిన డబ్బులు తీసుకొచ్చేందుకు మాదాపూర్ వెళ్లారు. అక్కడ రాజు అనే వ్యక్తి నుంచి రూ.40 లక్షలను తీసుకుని కారులో బౌరంపేటలోని గ్యారేజీకి వస్తుండగా సమీపంలో ఉన్న జేకే గార్డెన్స్ వద్ద ముగ్గురు వ్యక్తులు కారును అడ్డగించి వారిపై దాడి చేసి రూ.40 లక్షలతో ఉడాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తెలిసిన వారిపైనే అనుమానం..

రూ.40 లక్షలు తీసుకువస్తున్న విషయం కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు మాత్రమే తెలుసుండడంతో పోలీసులు వారినే అనుమానించారు. మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే మరో నలుగురితో కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అనిల్‌కుమార్‌తో పాటు అతని స్నేహితులు మోర్త శివచరణ్, సగి వెంకటరమణ రాజు, ఈపురు రాజులు వారికి సహకరించినట్లు విచారణలో తెలిపాడు. దీంతో వీరందరిని దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.37.97 లక్షలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్ ఇండియా యజమానికి నోటీసులు

లైసెన్స్ లేకుండానే కేపీఆర్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహణ

- 15కు పైగా సంస్థలకు ముడి సరుకుల సరఫరా
- గత ఆరేళ్లుగా అక్రమంగా ఫార్మా వ్యాపారం
- విచారణలో గుర్తించిన డ్రగ్ కంట్రోల్ అధికారులు





అక్రమ నిల్వ గోదాంను పరిశీలిస్తున్న ఎస్‌ఓటీ ఎల్బీనగర్ పోలీసులు, డ్రగ్ కంట్రోల్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఫార్మా సూటికల్ కంపెనీ డ్రగ్ ఇండియా మహావీరే యజమాని ఉమేష్ బాబులాల్‌కు ఉప్పల్ డ్రగ్ కంట్రోల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఔషధాల తయారీలో వినియోగించే ముడి సరుకులను అక్రమంగా తరలించి, నిల్వ చేసిన కేసులో గత వారం స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) ఎల్బీనగర్, ఉప్పల్ డ్రగ్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి నిందితుడు ఉమేష్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గుజరాత్‌కు చెందిన ఉమేష్ కొత్తపేటలోని ఫణిగిరి కాలనీలో డ్రగ్ ఇండియా మహావీరే పేరుతో ఫార్మాసూటికల్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఇతనికి చైతన్యపురి ఠాణా పరిధిలోని మారుతీనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కేపీఆర్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మరో ఫార్మా సూటికల్ కంపెనీ కూడా ఉంది. అయితే 2017 నుంచి ఈ సంస్థ డ్రగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకుండానే వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు విచారణలో గుర్తించారు.

15కు పైగా సంస్థలకు సరఫరా..

మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి ఫార్మా ముడి సరుకులను దిగుమతి చేసుకుంటున్నట్లు విచారణలో తేలింది. అయితే ఈ ముడి సరుకులను ఎవరి వద్ద నుంచి కొనుగోలు, విక్రయించిన రశీదులను కోరుతూ అధికారులు బాబులాల్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే ఇప్పటివరకు నిందితుడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని, వచ్చాక తదుపరి కార్యచరణ ఉంటుందని ఉప్పల్ డ్రగ్ అధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. అక్రమంగా దిగుమతి చేసుకున్న ఈ ముడి సరుకులను చర్లపల్లిలోని వార్నర్ హిందుస్తాన్ లిమిటెడ్‌తో పాటు మరో 15కు పైగా కంపెనీలకు సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు.

గడువు ముగిసిన ముడి సరుకులు..

నిందితుడి నుంచి కోటి రూపాయల విలువ చేసే 10,636 కిలోల ఫార్మా ముడి సరుకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 3 వేల కిలోలకు పైగా ముడి సరుకుల గడువు ముగిసినవే ఉండటం గమనార్హం. వీటిలో ప్రధానంగా క్రాస్కోర్మెలోస్ సోడియం, మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్, డైకాల్షియం ఫాస్ఫేట్, కెవా ఫ్లేవర్స్, ఫెర్రస్ సల్ఫేట్, మెగ్నీషియం స్టిరేట్, స్టార్చ్, డ్రైడ్ అల్యూమీనియం హైడ్రాక్సైడ్ జెల్, లైసిన్ ముడి సరుకులున్నాయి. ఆయా సరుకుల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అయితే ఈ గడువు ముగిసిన ముడి సరుకులను కరోనా టైంలో కొనుగోలు చేశానని, అమ్ముడుపోకపోవటంతో నిల్వ ఉండిపోయాయని నిందితుడు ఉమేష్ డ్రగ్ అధికారులకు వివరించినట్లు సమాచారం.

సింగపూర్‌లో ఉన్న సిటీ యువతికి టోకరా

- ఇన్వెస్ట్‌మెంట్ అంటూ నమ్మబలికి రూ.13 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన ఓ యువతి సింగపూర్‌లోని ఓ మంచి కంపెనీలో లక్షల రూపాయిల వేతనంతో జాబ్ చేస్తోంది. ఆమెను సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో మోసం చేశారు. మీరు చేసే జాబ్‌కు వచ్చే నెల జీతాన్ని కేవలం ఒక్క గంటలో సంపాదించొచ్చంటూ గాలం వేశారు. ఇలా నమ్మించి నట్టేట ముంచి ఆమె నుంచి లక్షల రూపాయిలు కొల్లగొట్టారు. దీంతో బాధితురాలి సోదరుడు సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సింగపూర్‌లో నివాసం ఉండే యువతికి టెలిగ్రామ్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని కోరాడు. ఇందుకు యువతిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేసి, ఇన్వెస్ట్‌మెంట్‌లో లక్షల రూపాయిలు గెలుచుకున్నట్లు చాటింగ్ చేశారు. దీనికి మంత్రముగ్ధురాలైన యువతి రూ.10 వేలు, రూ.20 వేలు చొప్పున ఇన్వెస్ట్ చేసింది. ఇందుకు తొలి రోజుల్లో లాభాలు ఇచ్చి ఆమెకు మరింత నమ్మకాన్ని కలిగించారు. అనంతరం రూ.2 లక్షలు పెట్టింది. వీటికి లాభాలు ఇవ్వకుండా వీటిని డ్రా చేయాలంటే టాస్క్‌లు అధిగమించాలంటూ మాయ మాటలు చెప్పారు. ఇలా బాధితురాలి నుంచి రూ.13 లక్షలు కాజేశారు. దీంతో బాధితురాలు మెయిల్ ద్వారా సైబర్ క్రైం పోలీసులను సంప్రదించగా ఆమె సోదరుడు నేరుగా వచ్చి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మరో మహిళ నుంచి రూ.9 లక్షలు, యువకుడి నుంచి రూ.23 లక్షల చొప్పున ఇన్వెస్ట్‌మెంట్ పేరిట కాజేశారు. ఈ ముగ్గురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

బహుజనులు జీవించే హక్కును కోల్పోతున్నారు

జస్టిస్ చంద్రయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాంగం ద్వారా ప్రజలందరికి సమాన అవకాశాలు ఉన్నప్పటికీ వివక్ష కారణంగా బహుజనులు జీవించే హక్కును కోల్పోతున్నారని మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల ప్రజల విషయంలో హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నట్లు వాపోయారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ చంద్రయ్యకు 'బంధు సొసైటీ' ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి బంధు సొసైటీ అధ్యక్షుడు మల్లెల వీరస్వామి అధ్యక్షత వహించగా ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కె.రాములు, ఎస్సీ, ఎస్టీ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శంకర్, మాజీ ఐఆర్‌టీఎస్ అధికారి డాక్టర్ భరత్ భూషణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమ పథకాలు క్రమేణా తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఆయా శాఖలకు ఉండాల్సిన నిధులను ఖర్చు చేయకుండా రానున్న ఎన్నికల్లో రాజకీయంగా వినియోగించడం కోసం నిధులను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. బహుజనులంతా ఐక్యమై రాజ్యాధికారం వైపు పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రతి పౌరుడు దేశానికి సేవ చేయాలి



విద్యార్థినిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులతోపాటు ప్రతి పౌరుడు దేశానికి సేవ చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. శనివారం గన్‌ఫౌండ్రీలోని మీడియా ప్లేస్‌లో షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ షాహీన్ గ్రూప్ విద్యాసేవలు అభినందనీయమన్నారు. షాహీన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖాదిర్, డాక్టర్ మహ్మద్ అబ్దుల్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీట్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అతిథులుగా శంకర్ అప్పపాటిల్, నాగరాజ్, రయీస్, అనిల్‌కుమార్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన బ్రిడ్జి స్లాబ్‌ను పరిశీలించిన ఇంజినీర్లు



ఎల్బీనగర్: సాగర్ రింగ్ రోడ్డులో బుధవారం కుప్పకూలిన ఫ్లై ఓవర్ స్లాబ్‌ను జీహెచ్ఎంసీ ఇంజనీర్ల బృందం శనివారం పరిశీలించింది. ప్రభుత్వం నియమించిన ఇంజనీర్ల కమిటీలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చీఫ్ ఇంజనీర్లు జియావుద్దీన్, సురేష్‌కుమార్, దేవానంద్, ఎస్ఎన్‌డీపీ ఇంజనీర్లు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలను వారు తెలుసుకున్నారు. కూలిన సంఘటనపై నివేదిక ఇవ్వడానికి ఇంకొంత సమయం పడుతుందని వారు అభిప్రాయపడ్డారు. సాగర్ రింగ్ రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నుంచి వాహనాలు కిందకి దిగేందుకు బైరామల్‌గూడ చెరువు మీదుగా ర్యాంప్ నిర్మిస్తున్నారు. గత మంగళవారం రాత్రి 9గంటల సమయంలో ర్యాంప్ స్లాబ్ పనులు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రెడ్ మిక్స్ కాంక్రీట్ లారీ రివర్స్ తీస్తుండగా స్లాబ్ సపోర్ట్‌గా ఉన్న ఐరన్ రాడ్‌లకు తగలడంతో నిర్మాణంలో ఉన్న ర్యాంప్ స్లాబ్ ఒక్కసారిగా కూలిపోయిన విషయం విదితమే. మరోసారి ఈ ప్రాంతాన్ని సందర్శించిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కృతజ్ఞతలు

తెలంగాణ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి, కార్యదర్శి ముఖరం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలలో వివిధ హోదాలలో పదోన్నతులు పొందిన 62 మంది కార్యదర్శులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదోన్నతులు పొందిన కార్యదర్శులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, సెంట్రల్ ఫోరం కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



క్లుప్తంగా...

రూ.10 కోట్లిస్తే క్వారీ క్రషర్ ఇచ్చేస్తా

• మంత్రి ప్రశాంత్‌రెడ్డి సవాల్



బాల్కొండ: తనపై ఆరోపణలు చేస్తున్నవారు రూ.10 కోట్లు ఇస్తే.. బట్టాపూర్ కంకర క్వారీ క్రషర్‌ను, మరో పదెకరాల భూమిని అప్పగిస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సవాల్ చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన ప్రజాకల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన బంధువుతో కలిసి రూ.400 కోట్లు సంపాదించామని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న బీజేపీ నేతలు రూ.10 కోట్లు ఇస్తే క్రషర్‌ను మెషీన్‌తో పాటు అప్పగిస్తానని ప్రకటించారు. సవాల్‌కు సిద్ధముంటే ముందుకు రావాలని పరోక్షంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డికి మంత్రి సవాల్ విసిరారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బాల్కొండ నియోజకవర్గంలో కేవలం కమీషన్ కోసం రోడ్డు పనులు చేయిస్తున్నానంటున్న వారికి.. ఏ ప్రాంతంలో పనులు ఇప్పించాలో చెప్పాలని కోరారు. గంజాయి గురించి తన తమ్ముడు అజయ్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తుండటం బాధాకరమన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపింది, జిల్లాలో అత్యధికంగా గంజాయి కేసులను నమోదు చేసింది బాల్కొండ నియోజక వర్గంలోనేనని స్పష్టం చేశారు.

యూట్యూబ్ చానళ్లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు



గచ్చిబౌలి (హైదరాబాద్): కొన్ని యూట్యూబ్ చానళ్లపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ప్రభుత్వవిప్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన గచ్చిబౌలిలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఇన్‌స్పెక్టర్ జి.సురేష్‌కు క్యూన్యూస్, జీఎస్‌ఆర్ టీవీ, కాళోజీ టీవీ యూట్యూబ్ చానల్స్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యూట్యూబ్ చానళ్లలో ముదిరాజ్‌లపై ప్రచారం చేసిన గొంతు తనది కాదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం చేసి తనను మానసిక వేదనకు గురిచేసిన వ్యక్తులు, చానళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. తీన్మార్ మల్లన్న చానళ్లలో ప్రసారం చేసినవి అవాస్తవాలని పేర్కొన్నారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ వెనుక ఉండి తీన్మార్ మల్లన్న లాంటి బ్రోకర్లతో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్ బిడ్డలంటే తనకెంతో గౌరవమని, వారిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని పెద్దమ్మతల్లి మీద ప్రమాణం చేస్తున్నానని పేర్కొన్నారు.

బోథ్ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

• ఎమ్మెల్యే బాపూరావు చేతికి గాయం



బోథ్/నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకు పెను ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారుకు ఆవు అడ్డుగా రావడంతో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ఎమ్మెల్యే ఎడమ చేతికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసేందుకు నిర్మల్ వెళ్లిన ఎమ్మెల్యే బాపూరావు.. అనంతరం ఆదిలాబాద్‌లోని తన నివాసానికి బయలుదేరారు. జాతీయ రహదారి 44మీదుగా వెళ్తుండగా నేరడిగొండ మండలం కొరటికల్ (బి) గ్రామం వద్ద కారుకు ఆవు అడ్డొచ్చింది. దానిని ఢీకొన్న కారు అదుపు తప్పుతుండటంతో.. డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కారులో ఉన్న ఎమ్మెల్యే చేతికి గాయమైంది. డ్రైవర్ శ్రీనుతో పాటు గన్‌మెన్ వేణు, పిప్పల్ కోటి మాజీ సర్పంచ్ గణేశ్ సురక్షితంగా బయటపడ్డారు. ఎమ్మెల్యే చేతికి రక్తస్రావం కావడంతో అటుగా వెళుతున్న వారు తమ వాహనంలో రోల్ మామడ టోల్‌ప్లాజా వద్దకు ఎమ్మెల్యేను తీసుకొచ్చారు. అక్కడి నుంచి నేరడిగొండ ఎస్సై సాయన్న వాహనంలో బోథ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే చేతికి చికిత్స అందించిన వైద్యులు.. ప్రమాదమేమీ లేదని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రమాదం విషయం తెలియడంతో బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఆసుపత్రికి భారీగా తరలివచ్చారు. తాను క్షేమంగా ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆదిలాబాద్‌లోని తన నివాసానికి వెళ్లారు.

మాణిక్‌రావు క్షమాపణ చెప్పాలి: విజయశాంతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రేకు మతి భ్రమించినట్లుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి మండిపడ్డారు. విజయశాంతితో చర్చలంటూ లీకేజీలిస్తూ, అవాస్తవాలు మాట్లాడటం సరికాదని ఆమె అన్నారు. పార్టీలో చేరికల కోసం తనతో చర్చలంటూ అబద్ధపు లీకులు ఇస్తున్నందుకు వెంటనే క్షమాపణ చెప్పాల్సిన కనీస బాధ్యత మాణిక్‌రావుపై ఉందని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గందరగోళంలో 'డబుల్'!

గృహలక్ష్మి పథకం నేపథ్యంలో అగమ్యగోచరంగా డబుల్ బెడ్రూం ఇళ్ల స్కీం



• తుది దశలో 50 వేల ఇళ్లు.. ఇటుక పని పూర్తయినవి మరో 35 వేలు
• అవి పూర్తి కావాలంటే రూ. 3,500 కోట్లు అవసరం
• ఇప్పటికే రూ. 500 కోట్ల బిల్లు బకాయిలు.. ప్రాజెక్టు పూర్తిపై గందరగోళం
• పథకం గతి తప్పిందంటూ పీఎంఏవై నిధులిచ్చేందుకు కేంద్రం ససేమిరా

సాక్షి, హైదరాబాద్: సొంత జాగా ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేసే గృహలక్ష్మి పథకాన్ని పట్టాలెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న వేళ డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం వ్యవహారం అగమ్యగోచరంగా మారింది. ఇళ్లను పూర్తి చేయాలంటే రూ. 7,500 కోట్ల నిధులు అవసరమవగా వాటిని సమకూర్చుకోవడం సర్కారుకు కష్టంగా మారింది. అలా అని వదిలేద్దామంటే 85 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

రుణం అంటే జంకుతున్న ఆర్థిక శాఖ..

ఇప్పటికే రూ. 9,800 కోట్ల రుణాన్ని హడ్కో నుంచి తీసుకొని ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టింది. అయితే గత 9 ఏళ్లలో 1.40 లక్షల ఇళ్లనే పూర్తి చేయగలిగింది. అవి కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తొలి విడత నిధులను సైతం ఖర్చు చేసింది. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రాథమిక కసరత్తు పూర్తికాకపోవడాన్ని తప్పుబడుతూ కేంద్రం పీఎంఏవై మలివిడత నిధులిచ్చేందుకు నిరాకరించింది. దీంతో దాదాపు రూ. 1,200 కోట్ల నిధులు చేతికందకుండా పోయాయి. మరోవైపు ఇప్పటికే భారీగా రుణం ఇచ్చిన హడ్కో సైతం మరోసారి రుణం ఇచ్చేందుకు తటపటాయిస్తోంది. ఇంకోవైపు ఇప్పటివరకు కట్టిన ఇళ్లకు సంబంధించి రూ. 500 కోట్ల మేర బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

వాటి సంగతేంటి?

దాదాపు 90 శాతం పనులు పూర్తయి తుది మెరుగులకు సిద్ధంగా 50 వేల ఇళ్లున్నాయి. బేస్‌మెంట్, ఇటుక పని పూర్తయినవి మరో 35 వేల ఇళ్లున్నాయి. వాటిని పూర్తి చేయాలంటే రూ. 3,500 కోట్లు కావాలి. ఆ మేరకు నిధులిస్తేనే ఈ ఇళ్లను వేగంగా పూర్తి చేస్తామని గృహనిర్మాణ విభాగం పలుమార్లు ఆర్థిక శాఖను కోరింది. పనిలో వేగం తగ్గితే అసంపూర్తి నిర్మాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. టెండర్లు పిలిచి ఇంకా పనులు ప్రారంభించని ఇళ్లు 62 వేల వరకు ఉన్నాయి. వాటిని పూర్తి చేయాలంటే మరో రూ. 4 వేల కోట్లు కావాలి. ప్రస్తుతానికి వాటిని పెండింగ్‌లో పెట్టి తుదిదశకు చేరుకున్న ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం తాజాగా 90 శాతం పనులు పూర్తయిన వాటి వివరాలను ఆర్థిక శాఖకు అందజేశారు. త్వరలో మంత్రుల కమిటీ సమావేశమై దీనిపై చర్చించే అవకాశం ఉంది.

ఇళ్ల కేటాయింపు అంటేనే టెన్షన్..

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లనే లబ్ధిదారులకు కేటాయించారు. దాదాపు 88 వేల ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకొని ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి. గతంలో స్వీకరించిన దరఖాస్తులు కూడా అధికారుల వద్ద ఉన్నాయి. ఇళ్ల సంఖ్యకు కొన్నిరెట్లు ఎక్కువగా దరఖాస్తులు ఉండటంతో ఎంపిక కాని వారు ఆందోళనలు చేసే ప్రమాదం ఉంది. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉంటుందంటూ అధికారులు ఇళ్ల కేటాయింపును పెండింగ్‌లో పెట్టేశారు.

కొల్లూరు డబుల్ ఇళ్ల దుమ్ము దులిపి...

సీఎం కేసీఆర్ తాజాగా కొల్లూరులో 15,600 డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ఇళ్లు దాదాపు రెండేళ్ల క్రితమే సిద్ధమైనా వినియోగంలో లేకపోవటంతో మొత్తం దుమ్ముకొట్టుకుపోయాయి. వాటి ప్రారంభానికి సీఎం వస్తుండటంతో అధికారులు 500 మంది కూలీలను పెట్టి దుమ్ము దులిపించారు. సీఎం పరిశీలించే ఇళ్లకు కొత్తగా రంగులు వేయించారు. పగిలిన కిటికీ అద్దాలను మార్పించారు. అయితే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోనూ దాదాపు 80 వేలకుపైగా డబుల్ ఇళ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

దళితబంధు రెండో విడతకు సిద్ధం

• అమలుకు అనుమతి ఇచ్చిన ఎస్సీ అభివృద్ధి శాఖ
• ఎమ్మెల్యే రూపొందించిన జాబితా ప్రకారమే ఎంపిక ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం రెండోవిడత అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. అంశాలవారీగా వివరాలతో కూడిన ఉత్తర్వులను జీవో ఎంఎస్ 8 రూపంలో రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జారీ చేశారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని మినహాయించి మిగతా 118 నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని రెండో విడతలో భాగంగా అమలు చేయనున్నట్లు ఆయన ఆదేశాల్లో పేర్కొన్నారు. హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఇప్పటికే 100 శాతం దళితబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రంలోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండో విడత పథకంలో భాగంగా 1.30 లక్షల మందికి అవకాశం లభించనుంది.

ఇందులో భాగంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున లబ్ధిదారులను గుర్తిస్తారు. మొత్తంగా 1,29,800 మందిని ఎంపిక చేస్తారు. మరో 200 యూనిట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విచక్షణతో ఎంపిక చేస్తారు. దళితబంధు పథకం తాజా మార్గదర్శకాల ప్రకారం అసెంబ్లీ స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. అసెంబ్లీ స్థాయిలో ప్రజాప్రతినిధి సహకారంతో ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఎమ్మెల్యే రూపొందించిన ఎస్సీ కుటుంబాల జాబితాకు అనుగుణంగానే అర్హులను ఎంపిక చేస్తారు. తాజా ఉత్తర్వుల్లో దరఖాస్తు విధానంపై ప్రభుత్వం ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. జాబితా రూపొందించిన తర్వాత వాటిని పరిశీలించి అర్హులను ఖరారు చేస్తారు. ఆ తర్వాత గతంలో అమలు చేసినట్లుగా అర్హులకు సమాచారం ఇవ్వడం, వారి ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించడం, వారికి ఆసక్తి ఉన్న యూనిట్లను గుర్తించి అవగాహన కల్పించడం తదితరాలన్నీ ఇదివరకు నిర్దేశించిన ఆదేశాలకు అనుగుణంగా చేపడతారు. ఈ ప్రక్రియంతా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం, ఎస్సీ కార్పొరేషన్ సమన్వయంతో చేపడతారు.

వెబ్ పోర్టల్... మొబైల్ యాప్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంలో పూర్తి పారదర్శకత కోసం లబ్ధిదారుల వివరాలను దళితబంధు పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. ఆ తర్వాత లబ్ధిదారులవారీగా తెరిచే యూనిట్లు తదితర సమాచారాన్ని ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో టీఎస్ ఆన్‌లైన్ రూపొందించిన మొబైల్ యాప్‌తో అనుసంధానిస్తారు. క్షేత్రస్థాయిలో దళితబంధు పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

ప్రజల ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశారు

• కేసీఆర్, మంత్రుల కుటుంబాలే బంగారమయ్యాయి
• సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం

కేతేపల్లి/సూర్యాపేట రూరల్ : కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశారని, బాధల తెలంగాణగా మార్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీనీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు నుంచి ప్రారంభమై రాత్రి భీమారానికి చేరుకుంది. భీమారంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ, నీళ్లు, నిధులు, నియామకాలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కొలువులు లేక నిరుద్యోగులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. తెలంగాణలో కేసీఆర్, మంత్రుల కుటుంబాలు మాత్రమే బంగారమయ్యాయని, సామాన్యుడి జీవితం ఏమాత్రం మారలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్ ఉండేదని, నేడు పాలకుల తప్పిదాల వల్ల రూ.5 లక్షల కోట్లు అప్పులయ్యాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే మన బతుకులు బాగుపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. ధరణి పేరుతో స్వాధీనం చేసుకున్న 24 లక్షల ఎకరాల భూమిని తిరిగి పేదలకు పంచుతామన్నారు. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, పీసీసీ నేతలు దైదా రవీందర్, వేదాసు శ్రీధర్, కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలులో పాదయాత్ర శిబిరం వద్ద వంట చేస్తున్న భట్టి

భట్టి పాదయాత్రలో కార్యకర్తల ఘర్షణ

భట్టి విక్రమార్క పాదయాత్ర శనివారం రాత్రి సూర్యాపేట మండలంలోని వెదిరెవారిగూడెం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని మూసీ బ్రిడ్జిపై మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తన అనుచరులతో భట్టి విక్రమార్కకు గజమాల వేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి భట్టి పాదయాత్ర కుసుమవారిగూడెం వద్దకు చేరుకున్న సమయంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి తన అనుచరులతో స్వాగతం పలికి బాణసంచా కాల్చారు. ఈ తరుణంలో దామోదర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వెంటనే పోలీసులు స్పందించి ఘర్షణ పడుతున్న కార్యకర్తలను చెదరగొట్టారు.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి తప్పిన ప్రమాదం

• శృంగేరి పీఠానికి వెళ్తుండగా టైర్ పేలి చెట్టును ఢీకొన్న కారు



సాక్షి బెంగళూరు/తాండూరు: వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జూలై 3 నుంచి 13 వరకు తాండూరులోని తన నివాసంలో రాజశ్యామల అతిరుద్ర యాగం నిర్వహించనున్నారు. ఈ యాగానికి శృంగేరి పీఠాధిపతిని ఆహ్వానించేందుకు శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి మంగళూరుకు విమాన మార్గంలో వెళ్లారు. మంగళూరు నుంచి కర్ణాటక ప్రభుత్వ ఎస్కార్ట్ వాహనంలో శృంగేరి పీఠానికి బయలుదేరారు. కార్కళ సమీపంలోని ముదారు–నల్లూరు క్రాస్ వద్ద మియ్యారు వంతెనపై వాహనం టైర్ ఒక్కసారిగా పేలింది. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రాణాపాయం లేకుండా ఎమ్మెల్యే బయటపడ్డారు. విద్యుత్ స్తంభం, చెట్టుకు మధ్య వాహనం చిక్కుకోవడంతో ముందు భాగం స్వల్పంగా ధ్వంసమైంది. కార్కళ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే వేరే కారులో శృంగేరికి చేరుకున్నారు.

ఏడాది కాంట్రాక్టులో 2 నెలలు గడిచినా..

• ఐఎంఎస్ కొలువుల భర్తీలో ముందుకు పడని అడుగులు
• 231 పోస్టుల భర్తీకి మార్చిలో నోటిఫికేషన్లు
• వందల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు
• ఎంపిక ప్రక్రియలో జాప్యం.. అధికారుల తీరుపై అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కార్మిక శాఖ పరిధిలోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) డైరెక్టరేట్‌కు చెందిన ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. అత్యవసర సేవల్లో భాగంగా ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ కేటగిరీల్లో 231 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ ఏడాది మార్చి నెలాఖరులో ఐఎంఎస్ జిల్లాల వారీగా నోటిఫికేషన్లు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు కాంట్రాక్టు గడువుగా పేర్కొంది. దరఖాస్తులకు అతి తక్కువ సమయం ఇచ్చినప్పటికీ నోటిఫికేషన్లకు విశేష స్పందన వచ్చింది. వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ వాటిపై ఏమీ తేల్చకుండా ఐఎంఎస్ కాలయాపన చేస్తుండటంతో అభ్యర్థులు సంస్థ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

జాప్యంపై అనుమానాలు

ఈఎస్‌ఐ చందాదారులకు మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో ఈఎస్‌ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అదనపు పోస్టులు మంజూరు చేసింది. శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉండడంతో తాత్కాలిక పద్ధతిలో భర్తీకి ఆదేశించింది. దరఖాస్తుల స్వీకరణ అంతా మాన్యువల్ పద్ధతిలో కొనసాగింది. అయితే తీసుకున్న దరఖాస్తులకు ఎలాంటి రసీదు (ఎక్నాలెడ్జ్‌మెంట్) ఇవ్వకపోవడం అప్పట్లోనే విమర్శలకు తావిచ్చింది. తమ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా చెత్తబుట్ట పాలు చేస్తున్నారంటూ కొందరు మండిపడ్డారు. ప్రస్తుతం కాంట్రాక్టు గడువులో రెండు నెలలు కూడా గడిచిపోయాయి. ఇప్పటికీ అభ్యర్థుల మెరిట్ జాబితా, సీనియారిటీ జాబితాను సైతం ప్రకటించకపోవడంపై అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చేందుకు, పైరవీల కోసమే ఈ విధంగా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా అర్హుల జాబితా సిద్ధమైందని, అతి త్వరలో అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

కాంట్రాక్టు పోస్టులు ఇవీ..

కేటగిరీ	ఖాళీలు	పరిధి
సివిల్ అసిస్టెంట్ సర్జన్	117	మల్టీజోనల్
డెంటల్ అసిస్టెంట్ సర్జన్	4	మల్టీజోనల్
ల్యాబ్ టెక్నీషియన్	20	జోనల్
ఫార్మాసిస్ట్	90	జోనల్

అధములు.. ప్రథముల్ని విమర్శిస్తారా?

విపక్షాలపై మంత్రి హరీశ్‌రావు మండిపాటు

• నిలోఫర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం
• ఇక జిల్లాల్లోనూ శిశువులకు సూపర్ స్పెషాలిటీ సేవలు

సాక్షి, హైదరాబాద్/ నాంపల్లి: విద్య, వైద్యం, వ్యవసాయం, ఐటీ, ఇలా.. అన్ని రంగాల్లో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అధమ స్థానంలో ఉన్నాయని, అలాంటి వాళ్లు అన్నిటా ప్రథమ స్థానంలో ఉన్న తమను విమర్శిస్తారా? అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నవజాత శిశువులకు చికిత్స కోసం రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను అనుసంధానిస్తూ హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రి కేంద్రంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శనివారం హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రాగానే రాష్ట్రానికి వచ్చే టూరిస్టు నాయకులు పనికిరాని మాటలు మాట్లాడతారన్నారు. మాతాశిశు మరణాలు భారత్‌లో ఎక్కువగా ఉంటున్నాయని యూనిసెఫ్ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కానీ రాష్ట్రంలో మాతాశిశు మరణాలను తగ్గించి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి తెలంగాణను రోల్ మోడల్ చేశారన్నారు. తెలంగాణకు వచ్చి నీతులు చెప్పే ఇతర రాష్ట్రాల బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తమ దగ్గర అభివృద్ధి, సంక్షేమం నేర్చుకుని వెళ్లాలని సూచించారు.

శిశు మరణాలను తగ్గించాలని..

రాష్ట్రంలో నవజాత శిశు మరణాల రేటుని 25 నుంచి 15కు తగ్గించామని, దీనిని పూర్తిగా తగ్గించాలనే లక్ష్యంతో దేశంలోనే ప్రథమంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. వైద్యసేవల అనుసంధానం ద్వారా శిశువులకు ఆరోగ్య సమస్యలు వస్తే ఎక్కువ దూరం రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల్లో సైతం స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కాగా, చిన్నారుల కోసం 33 నియోనాటల్ అంబులెన్సులను నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. వివిధ పథకాల ద్వారా సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా తీసుకున్న చర్యల వల్ల మాతాశిశు సంరక్షణలో తెలంగాణ దేశానికి ఆదర్శమైందన్నారు. మిడ్ వైఫరీ విధానం ద్వారా సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే 212 మంది మిడ్ వైఫ్ నర్సులు వివిధ ఆసుపత్రుల్లో సేవలందిస్తుండగా, ఈ నెల చివరి వరకు 141 మంది శిక్షణ పూర్తి చేసుకోనున్నారని తెలిపారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ– డెలివరీల కోసం ప్రత్యేకంగా గాంధీ, నిమ్స్, అల్వాల్‌లో 600 పడకల సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏటా రూ. 107 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఇవన్నీ చేస్తున్నాం కాబట్టే నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో 2014లో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ఇప్పుడు 3వ స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా నీలోఫర్ ఆసుపత్రి వైద్య సిబ్బందితో మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ తదితరులు

వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు సిద్ధం

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వరిలో కూనారం సన్నాలు, కూనారం 1638, బతుకమ్మ, వరంగల్ 962, ఆర్‌ఎన్‌ఆర్ 21278, ఆర్‌ఎన్‌ఆర్ 29325, జగిత్యాల 1798, తెలంగాణ సోనా, ఎంటీయూ 1010, జగిత్యాల 24423, ఐఆర్ 64, హెచ్‌ఎంటీ సోనా వంటి స్వల్ప కాలిక వంగడాలను మాత్రమే సాగు చేయాలని మంత్రి రైతాంగానికి సూచించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వానాకాలం పంటల సాగు, విత్తనాల లభ్యత, ఎరువుల సరఫరా, ఆయిల్ పామ్ సాగుపై మంత్రి సింగిరెడ్డి శనివారం సచివాలయంలోని తన చాంబరులో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. మార్క్‌ఫెడ్‌లో తగినంత నిల్వ ఉంచుకోవాలన్నారు. ఎరువుల సరఫరా, వినియోగంపై అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతువేదికలలో నిరంతరాయంగా రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ ఏడాది కొత్తగా 2 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని, ఇప్పటికే 60 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని చెప్పారు. యాసంగిలో అకాలవర్షాల వల్ల వరి పంట నష్టపోకుండా రైతులు పంటకాలాన్ని ముందుకు జరుపుకొనేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వరి పంట కాలం ముందుకు జరుపుకునేలా రైతులను చైతన్యం చేస్తూ వ్యవసాయ శాఖ రూపొందించిన వీడియోను మంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు, ఐఎండీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న, సాగునీటి శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్, విత్తన సంస్థ ఎండీ కేశవులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జాకీతో బిల్డింగ్‌ను లేపాలని ప్రయత్నించి...

• కుత్బుల్లాపూర్ పరిధిలో ఓ ఇంటి యజమాని నిర్వాకం
• పక్కింటిపైకి ఒరిగిన భవనం, పరుగులు తీసిన స్థానికులు
• రంగంలోకి దిగిన డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ అధికారులు

కుత్బుల్లాపూర్: రోడ్డు కిందకు ఉన్న ఇంటిని హైడ్రాలిక్ జాకీ పెట్టి లేపాలని ప్లాన్ వేశాడో ఇంటి యజమాని. అది బెడిసికొట్టి.. భవనం అదుపుతప్పి పక్క భవనంపైకి ఒరిగింది. పక్క భవన యజమాని జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేయడంతో డీఆర్‌ఎఫ్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు రంగంలోకి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ సీఎస్కే స్కూల్ గల్లీలో నాగేశ్వరావు అనే వ్యక్తి 2001లో ఇంటిని నిర్మించాడు. తరువాత రోడ్డు వేయడంతో జీ ప్లస్2 భవనం.. రోడ్డు కంటే కిందకు అయ్యింది. అయితే పలువురు సూచించారని చెప్పి.. హైడ్రాలిక్ మెషీన్ పెట్టి బిల్డింగ్‌ను పైకి లేపాలని ప్లాన్ వేశాడు. శనివారం మధ్యాహ్నం హైడ్రాలిక్ మిషన్ తెప్పించి ఇంటిని పైకి లేపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో భవనం 10 ఇంచుల వరకు జరిగి, పక్క భవనంపైకి ఒరిగింది. దీంతో ఇంట్లో ఉన్నవారు పరుగులు పెట్టారు. పక్క భవనం యజమాని వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాంబయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి, డీఆర్‌ఎఫ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు వచ్చారు. ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపించి బిల్డింగ్ పరిస్థితిని పరిశీలించారు. వర్షాకాలం కావడంతో బిల్డింగ్‌ను తొలగించాలా? లేదా? అన్న విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. 2001లో నిర్మించినట్టు భవన యజమాని చెబుతున్నా.. 1990లోనే నిర్మించారని ఇరుగుపొరుగు అంటున్నారు. పాత భవనం, సరైన కండిషన్‌లో లేనందున భవనాన్ని కూల్చడమే మంచిదని అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాంబయ్య మీడియాకు తెలిపారు.



ఒరిగిన భవనం



హైడ్రాలిక్ మెషీన్‌తో లేపడానికి ప్రయత్నించిన ప్రదేశం



సెమీఫైనల్ 'షూటౌట్'లో ఓడిన తెలుగు టాలన్స్

ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌లో తెలుగు టాలన్స్ ఆట సెమీఫైనల్లో ముగిసింది. శనివారం జైపూర్‌లో జరిగిన సెమీస్‌లో తెలుగు టాలన్స్‌పై గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 60 నిమిషాల సమయంలో ఇరు జట్లు 35–35 గోల్స్‌తో సమంగా నిలవగా, ఆపై 10 నిమిషాల అదనపు సమయం తర్వాత స్కోరు 40–40తో మళ్లీ సమమైంది. టాలన్స్ తరఫున కైలాశ్ పటేల్ 15 గోల్స్ సాధించగా, యూపీ తరఫున భూషణ్ షిండే 15 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలి అర్ధభాగంలో 16–12తో టాలన్స్ ఆధిక్యంలో ఉన్నా... రెండో అర్ధభాగంలో జట్టు పట్టు కోల్పోయింది. అనంతరం 'షూటౌట్'లో యూపీ 4–3 తేడాతో తెలుగు టాలన్స్‌ను ఓడించింది. మరో సెమీస్‌లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ 38–28తో రాజస్తాన్ పేట్రియాట్స్‌పై విజయం సాధించింది.

'ఏ స్థానంలోనైనా సత్తా చాటుతా'

- చోటు దక్కడం సంతోషంగా ఉంది
- ఇక ధ్యాసంతా ఆటపైనే
- భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్

యశస్వి జైస్వాల్ ఇప్పుడు టీమిండియా క్రికెటర్. కష్టే ఫలితో ఎదిగాడు. 21 ఏళ్ల జైస్వాల్ ఎంపిక ఆశ్చర్యపరిచేది, అనూహ్యమైంది కానే కాదు. ఎందుకంటే కొన్నేళ్లుగా దేశవాళీ క్రికెట్‌లో తన నిలకడైన ఆటతీరు చూపిస్తున్నాడు. ఐపీఎల్‌లో అయితే మెరుపులు మెరిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో అయితే దిగ్గజాల ప్రశంసలు కూడా పొందాడు. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు స్టాండ్‌బైగా ఇంగ్లండ్ వెళ్లొచ్చాడు. ఇప్పుడు కరీబియన్ టూర్ కోసం పూర్తిస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు.



ముంబై: జైస్వాల్ యూపీ కుర్రాడు. అయితే ముంబైలో ఆటగాడయ్యాడు. ఐపీఎల్‌తో మెరుపు వీరుడిగా అందరికి పరిచయమై తాజాగా టీమిండియా జెర్సీ వేసుకోనున్నాడు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అత్యంత ధనవంతమైన క్రికెట్ బోర్డు జట్టులో సభ్యుడయ్యాడు. హిట్టర్‌గా పేరుతెచ్చుకున్న 21 ఏళ్ల యశస్వి ఇప్పుడు టెస్టు క్రికెటర్‌గా ఎలాంటి ముద్ర వేస్తాడో చూడాలి. జట్టులో తొలిసారి ఎంపికైన జైస్వాల్ తొలి పిలుపునే గొప్ప మలుపుగా చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ఇంకా ఏమన్నాడంటే....

నాన్న భావోద్వేగం... నాకేమో ఆనందం...

ఈ తీపి కబురు తెలియగానే మా నాన్నకు భావోద్వేగంతో కన్నీళ్లు ఆగలేదు. బెంగళూరు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఉన్న నాకేమో శుక్రవారం బిజీబిజీగా గడిచింది. నిజం చెప్పాలంటే ప్రాక్టీస్ కూడా చేయలేదు. టీమిండియాకు సంబంధించిన షూటింగ్‌లో పాల్గొన్నాను. భారత జట్టులోకి ఎంపికవడం చెప్పలేనంత ఆనందాన్నిచ్చింది. నా శక్తిమేర రాణించేందుకు కృషి చేస్తాను. టీమిండియా జెర్సీతో ఎప్పుడెప్పుడు ఆడాలా అన్న ఉత్సుకతతో ఎదురు చూస్తున్నాను.

సన్నాహాలపైనే దృష్టి

నా సన్నాహాలు ఆశించినట్లే సాగుతున్నాయి. సీనియర్ ప్లేయర్ల సలహాలు, సంప్రదింపులతో ఆటతీరుకు మెరుగులు దిద్దుకుంటున్నా. ఇప్పుడైతే పూర్తిగా పని (బ్యాటింగ్) మీదే ధ్యాసంతా! ఎలా ఆడాలో ఎంత ముఖ్యమో ఎలా నడుచుకోవాలనేది అంతే ముఖ్యం. స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, అజింక్య రహానేల ఆటను చూసి ఎంతో నేర్చుకున్నాను. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సూచనలు కూడా నా బ్యాటింగ్‌కు దోహదపడ్డాయి.

ఏ స్థానమైనా సరే

నాకంటూ ఫలానా స్థానమే నప్పుతుందనే ప్రాధన్యతలేవీ లేవు. జట్టు అవసరాలు, జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం మేరకు ఏ స్థానంలోనైనా బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు తెలిసిందల్లా పరుగులు చేయడమే. ఎక్కడ బరిలోకి దిగినా జట్టు కోసం శ్రమిస్తాను. క్రమశిక్షణతో ఎదుగుతాను. ఈ రెండే నా కెరీర్‌కు సోపానాలు.

కోచ్ సంబరం

పదేళ్ల క్రితం 2013లో ఆజాద్ మైదాన్(ముంబై)లో జైస్వాల్ ఆటకు ముగ్ధుడినై అతన్ని శిక్షణ కోసం ఎంపిక చేశాను. అతను పడ్డ కష్టానికి ఐపీఎల్ అందలమెక్కించింది. ఓ దశాబ్దం చెమటోడ్చితే అతనిప్పుడు భారత క్రికెటర్ అయ్యాడు. అది చెప్పుకోవడానికి చాలా సంతోషంగా, ఎంతో సంబరంగా ఉంది. యశస్వి ఎదిగిన తీరు నాకెంతో ముచ్చటగా ఉంది. చాలా గర్వపడుతున్నాను. కరీబియన్‌లో బరిలోకి దిగుతాడనే నమ్మకముంది. ఎప్పట్లాగే రాణిస్తాడనే ఆశాభావం కూడా ఉంది.

– వ్యక్తిగత కోచ్ జ్వాలా సింగ్

వెస్టిండీస్ అనూహ్య పరాజయం

- 35 పరుగులతో జింబాబ్వే విజయం
- వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ
- సూపర్ సిక్స్‌కు చేరిన ఇరు జట్లు





హరారే: దశాబ్దాల పాటు క్రికెట్‌ను శాసించిన జట్టు... రెండు సార్లు వరల్డ్ చాంపియన్...గత కొంత కాలంగా పేలవ ప్రదర్శనతో నేరుగా వరల్డ్ కప్‌కు అర్హత సాధించకుండా క్వాలిఫయింగ్ టోర్నీ ఆడాల్సిన దుస్థితి...ఇలాంటి చోట కూడా చివరకు వెస్టిండీస్ తమ స్థాయిని ప్రదర్శించలేకపోయింది. నిరాశాజనక ఆటతో అనూహ్య ఓటమిని మూటగట్టుకుంది. వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో భాగంగా గ్రూప్ 'ఎ'లో శనివారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 35 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 49.5 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (58 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ర్యాన్ బర్ల్ (57 బంతుల్లో 50;) అర్ధ సెంచరీలు చేయగా... కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (58 బంతుల్లో 47; 7 ఫోర్లు) రాణించాడు. విండీస్ బౌలర్లలో కీమో పాల్ 3 వికెట్లు పడగొట్టగా...అల్జారి జోసెఫ్, అకీల్ హొసీన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం విండీస్ 44.4 ఓవర్లలో 233 పరుగులకే కుప్పకూలింది. కైల్ మేయర్స్ (72 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్), రోస్టన్ ఛేజ్ (53 బంతుల్లో 44; 3 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. చటారా 3 వికెట్లు తీయగా...ఎన్‌గరవా, ముజరబాని, రజా తలా 2 వికెట్లు పడగొట్టారు. అర్ధ సెంచరీ చేయడంతో పాటు 2 వికెట్లు తీసి 2 క్యాచ్‌లు పట్టిన సికందర్ రజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఛేజ్, హోల్డర్ (19) క్రీజ్‌లో ఉండగా...10 ఓవర్లలో 52 పరుగులు చేయాల్సిన స్థితిలో విండీస్ గెలుపు దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే 16 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 4 వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. తాజా గెలుపుతో జింబాబ్వే 'సూపర్ సిక్స్'కు అర్హత సాధించింది. ఓడినా విండీస్ కూడా ముందుకు వెళ్లగలిగింది. అయితే ఈ మ్యాచ్‌తో కోల్పోయిన 2 పాయింట్లు ఆ జట్టుకు సూపర్ సిక్స్ దశలో ఇబ్బందిగా మారవచ్చు.

నెదర్లాండ్స్ చేతిలో నేపాల్ చిత్తు

గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా నేపాల్ 44.3 ఓవర్లలో 167 పరుగులకే ఆలౌటైంది. రోహిత్ పాడెల్ (37) టాప్ స్కోరర్‌గా నిలవగా, లోగన్ వాన్ బీక్ (4/24) ప్రత్యర్థిని కుప్పకూల్చాడు. అనంతరం నెదర్లాండ్స్ 27.1 ఓవర్లలో 3 వికెట్లకు 168 పరుగులు చేసి లక్ష్యాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్ ఓ డౌడ్ (75 బంతుల్లో 90; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగగా, బాస్ డి లీడ్ (39 బంతుల్లో 41 నాటౌట్; 6 ఫోర్లు) రాణించాడు. నెదర్లాండ్స్ కూడా టోర్నీ తర్వాతి దశకు అర్హత సాధించింది.

సెమీ ఫైనల్లో భారత్

'శాఫ్' ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్



బెంగళూరు: 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. గ్రూప్ 'ఎ'లో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సునీల్ ఛెత్రి సేన 2–0 గోల్స్‌తో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. శ్రీ కంఠీరవ స్టేడియంలో భారత జోరుకు ఎదురే లేకుండా పోయింది. తొలి అర్ధ భాగంలో నేపాల్ రక్షణ శ్రేణి చురుగ్గా ఉండటంతో గోల్ చేయలేకపోయిన భారత్ ద్వితీయార్ధంలోనే ఆ రెండు గోల్స్ చేసింది. కెప్టెన్ సునీల్ ఛెత్రి 61వ నిమిషంలో తొలి గోల్ సాధించగా, నోరెమ్ మహేశ్ సింగ్ 70వ నిమిషంలో గోల్ చేశాడు. మరోవైపు భారత డిఫెండర్లు నేపాల్ ఫార్వర్డ్‌ను ఎక్కడికక్కడ కట్టడి చేసి వారి దాడుల్ని సమర్థంగా అడ్డుకుంది. భారత ఆటగాళ్లు ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా ఐదు షాట్లు కొడితే... నేపాల్ ఒక షాట్‌కే పరిమితమైంది. మ్యాచ్‌లో ఎక్కువ సేపు బంతిని తమ ఆధీనంలోనే ఉంచుకొన్న భారత ఆటగాళ్లు ప్రత్యర్థి ఆటల్ని సాగనివ్వలేదు. తాజా విజయంతో సొంతగడ్డపై భారత్ అజేయమైన రికార్డు 12 మ్యాచ్‌లకు చేరింది. 2019లో సెప్టెంబర్ 5న ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిన భారత్ తర్వాత స్వదేశంలో ఏ జట్టు చేతిలోనూ ఓడిపోలేదు. అంతకుముందు ఇదే గ్రూపులో కువైట్ 2–0తో పాకిస్తాన్‌ను చిత్తు చేయడంతో కువైట్ కూడా సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. 27న కువైట్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌తో గ్రూప్‌లో అగ్ర స్థానంలో నిలిచేది ఎవరో తేలుతుంది. నేపాల్, పాకిస్తాన్‌లు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టాయి.

'మేం అడిగింది సమయమే'

స్టార్ రెజ్లర్ల వివరణ

న్యూఢిల్లీ: ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్ సెలక్షన్స్ విషయంలో ఆరుగురు స్టార్ రెజ్లర్లకు మినహాయింపు ఇవ్వడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో రెజ్లర్లు వివరణ ఇచ్చారు. నిరసన దీక్ష చేసిన రెజ్లర్లకు ట్రయల్స్‌లో ఒక్క బౌట్ విజయంతో అర్హత సాధించే అవకాశం కల్పించారు. దీనిపై జూనియర్ రెజ్లర్లు సహా, లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత యోగేశ్వర్ దత్ కూడా తప్పుబట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా సాక్షి మాట్లాడుతూ 'ట్రయల్స్ నుంచి మాకు మినహాయింపు, సడలింపు ఇవ్వాలని మేం కోరలేదు. సన్నద్ధతకు సరైన సమయం ఇవ్వాలని మాత్రమే అడిగాం' అని పేర్కొంది. బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఒక బౌట్ ట్రయల్‌పై ఎవరికైనా సమస్య వుంటే వాళ్లు నేరుగా కేంద్ర క్రీడా శాఖ మంత్రికి అభ్యంతరం చెప్పొచ్చు. అంతేగానీ సోషల్ మీడియాలో విషాన్ని చిమ్మకూడదు' అని యోగేశ్వర్‌ను ఉద్దేశిస్తూ అన్నాడు. సడలింపు కోరుతూ లేఖ రాసినట్లు గానీ, అడిగినట్లుగానీ నిరూపిస్తే రెజ్లింగ్ నుంచి శాశ్వతంగా తప్పుకునేందుకు సిద్ధమని పూనియా చెప్పాడు. లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు శిక్ష పడేవరకు తమ పోరాటం ఆగదని వినేశ్ ఫొగాట్ తెలిపింది.

'పుజారాను బలిపశువును చేశారు'

- రంజీ ట్రోఫీకి విలువ లేదా
- సునీల్ గావస్కర్ తీవ్ర విమర్శ



ముంబై: వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాకు స్థానం దక్కకపోవటం పట్ల దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డబ్ల్యూటీసీ ఫైనల్లో అందరూ విఫలమైనా ఒక్క పుజారాపై వేటు వేయడంలో అర్థమేంటని ఆయన వ్యాఖ్యానించారు. అసలు టెస్టు టీమ్ ఎంపికకు ప్రామాణికత ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'మన బ్యాటింగ్ వైఫల్యానికి పుజారాను ఎందుకు బలిపశువును చేశారు. అతను సుదీర్ఘ కాలంగా జట్టుకు ఎంతో సేవ చేశాడు. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు లేరని, అతడిని జట్టునుంచి తప్పించినా ఎవ్వరూ విమర్శలు చేయరనే కదా పుజారాపై వేటు వేశారు. ఇదంతా అర్థం కావడం లేదు. అసలు అతడిని మాత్రమే తీసేసి మిగతావారిని కొనసాగించడంలో ప్రామాణికత ఏమిటి. దీనికి సమాధానం చెప్పేందుకు మన సెలక్షన్ కమిటీ మీడియాతో కూడా మాట్లాడదు కదా. సెలక్టర్లు దీనికి వివరణ ఇవ్వాలి' అని గావస్కర్ అన్నారు. రంజీ ట్రోఫీలో విశేషంగా రాణించినా సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంపిక చేయకపోవడంపై కూడా గావస్కర్ విమర్శలు చేశారు. 'గత మూడు సీజన్లుగా సర్ఫరాజ్ దేశవాళీలో దాదాపు 100 సగటుతో పరుగులు చేస్తున్నాడు. ఎంపిక కావాలంటే అతను ఇంకా ఏం చేయాలి. తుది జట్టులో సంగతి తర్వాతి ముందు జట్టులోనైనా తీసుకోవచ్చు కదా. ఎంపిక చేసి మరీ అతని ప్రదర్శనకు గుర్తింపు ఇచ్చామని చెప్పండి. లేదంటే రంజీ ట్రోఫీ ఆడటం మానేయమనండి. దాని వల్ల లాభం లేదు. ఐపీఎల్‌లో బాగా ఆడితే చాలు టెస్టు క్రికెట్‌కు కూడా అది సరిపోతుంది అని స్పష్టం చేయండి' అని సన్నీ అన్నారు.

సాధనలో పుజారా...

భారత జట్టులో శుక్రవారం చోటు కోల్పోయినా చతేశ్వర్ పుజారా మాత్రం ఎప్పటిలాగే తన ప్రాక్టీస్‌ను కొనసాగిస్తున్నాడు. మైదానంలో తాను బ్యాటింగ్ చేస్తున్న, ట్రైనింగ్‌లో పాల్గొంటున్న వీడియోను అతను అప్‌లోడ్ చేశాడు. చతేశ్వర్ మానసికంగా చాలా దృఢమైన వ్యక్తి అని, తన పని తాను చేసుకుపోయే తత్వం ఉన్నవాడని అతని తండ్రి అరవింద్... దులీప్ ట్రోఫీ కోసం పుజారా సిద్ధమవుతున్నట్లు వెల్లడించాడు.

సినిమా

షికార్‌కొచ్చిన షేర్‌ని...



● చిరంజీవి

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ''షికార్‌కొచ్చిన షేర్‌ని బే...', 'ఈ స్టేట్ డివైడ్ అయినా అందరూ నా వాళ్లే... అన్ని ఏరియాలు అప్నా హై... నాకు హద్దుల్లేవ్... సరిహద్దుల్లేవ్... 11 ఆగస్టు దేఖ్‌లేంగే..' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మెహర్ రమేష్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులను, అభిమానులను అలరించాలని చిరంజీవిగారు అహర్నిశలు కష్టపడుతున్నారు. చిరంజీవిగారికి ఓ బ్లాక్‌బస్టర్ ఇవ్వాలని ప్రేమతో కష్టపడుతున్నాం. ఆగస్టు 11న మళ్లీ మెగా ఫెస్టివల్ జరుపుకుందాం'' అన్నారు. ''ఈ సినిమా చిరంజీవిగారి కెరీర్‌లో నంబర్ వన్ అవుతుందని నమ్ముతున్నాం'' అన్నారు అనిల్ సుంకర. ఛాయాగ్రాహకుడు డడ్లీ పాల్గొన్నారు.

ఇక షురూ



● మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి అడుగుపెట్టారు హీరో మహేశ్ బాబు. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీలీల ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇంకో హీరోయిన్ ఎంపిక కావాల్సి ఉంది. కాగా వివిధ కారణాల వల్ల ఏప్రిల్ తర్వాత 'గుంటూరు కారం' సినిమా మరో షెడ్యూల్ చిత్రీకరణ జరగలేదు. శనివారం 'గుంటూరు కారం' తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హైదరాబాద్ శివార్లలో వేసిన ఓ భారీ ఇంటి సెట్‌లో మహేశ్‌బాబు పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ నెలరోజులకు పైగానే సాగుతుందట. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది.

డైనమిక్ ఫ్రీడమ్ ఫైటర్‌గా చరిత్రలో నిలిచిపోయిన బెంగాలీ స్వాతంత్ర్యోద్యమకారుడు జతీంద్రనాథ్ ముఖర్జీ బయోపిక్ 'బాఘా జతిన్', డైనమిక్ లేడీ ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ ఎందుకు విధించారు? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'ఎమర్జెన్సీ'. జతీంద్రనాథ్‌గా దేవ్ అధికారి, ఇందిరా గాంధీగా కంగనా రనౌత్ నటించారు. హిస్టరీ నేపథ్యంలో రూపొంది, రిలీజ్‌కి రెడీ అవుతున్న ఈ రెండు చిత్రాల తాజా అప్‌డేట్స్ ఈ విధంగా...

హిస్టరీ రెడీ

అందుకే ఆయన పేరులో 'బాఘా' చేరింది

'దౌర్జన్యం ప్రబలినప్పుడు విధ్వంసం ఎంతో దూరంలో ఉండదు. ఈ దురాగతాలను అంతం చేయడానికి మనకు ఒక వీర రక్షకుడు కావాలి. భారతదేశపు పుత్రుడు బాఘా జతీన్ కథను మొదటిసారిగా వెండితెరపై చూపించబోతున్నాం' అంటూ 'భాఘా జతీన్' చిత్రంలో టైటిల్ రోల్ చేస్తున్న బెంగాలీ నటుడు దేవ్ అధికారి తాజా లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్యోద్యమకారుడు బాఘా జతీన్ (జతీంద్రనాథ్ ముఖర్జీ) బయోపిక్‌గా అరుణ్ రాయ్ దర్శకత్వంలో బెంగాలీ, హిందీ భాషల్లో రూపొందిన చిత్రం 'బాఘా జతీన్'. ఈ చిత్రంలో బాఘా జతీన్‌గా నటించి, నిర్మించారు దేవ్ అధికారి. 1879 డిసెంబర్ 7న జన్మించిన జతీంద్రనాథ్ ముఖర్జీ 1915 సెప్టెంబర్ 10న మరణించారు. తుపాకీ కాల్పులకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కాగా, జతీంద్రనాథ్‌కి బాఘా జతీన్ అని పేరు రావడానికి కారణం ఆయన ఎలాంటి మారణాయుధాలు లేకుండా ఒట్టి చేతులతో పులిని చంపడం. 'బాఘా' అంటే బెంగాలీలో పులి అని అర్థం. 1906లో పులిని అంతం చేశాక జతీంద్రనాథ్ పేరు 'భాఘా జతీన్'గా మారింది. స్వాతంత్ర్యం కోసం జతీన్ చేసిన వీర పోరాటాలతో పాటు ఇలాంటి పలు విశేషాలతో 'భాఘా జతీన్' తెరకెక్కింది. ''నవరాత్రి శుభ సందర్భంగా దేవ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి అక్టోబర్ 20న 'భాఘా జతీన్' థియేటర్లకు రానుంది'' అంటూ తాజా పోస్టర్‌తో పాటు, చిత్రం విడుదల తేదీని ప్రకటించారు దేవ్ అధికారి.



● దేవ్ అధికారి



● కంగనా రనౌత్

భారత్ అంటే ఇందిరా...!

'దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత నా చేతుల్లో ఉంది. ఎందుకంటే భారత్ అంటే ఇందిరా.. ఇందిరా అంటే భారత్' అనే డైలాగ్స్‌తో 'ఎమర్జెన్సీ' చిత్రం టీజర్ విడుదలైంది. ఇంకా టీజర్‌లో ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం, టీవీ ప్రసారాలు నిలిపివేయడం, ఆందోళనకారులపై దాడి వంటివి చూపించారు. 1975 జూన్ 25 తేదీతో టీజర్ ఆరంభమవుతుంది. 'రక్షకురాలా లేక నియంతా? మన దేశ నేత తన ప్రజలపై యుద్ధం ప్రకటించిన చీకటి రోజులకు సాక్షిగా చరిత్రలో నిలిచిన ఘట్టం ఇది..' అంటూ కంగనా రనౌత్ ఈ టీజర్‌ని షేర్ చేశారు. భారత ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ (1975–1977) ఎందుకు విధించారు? అనే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందిరా గాంధీగా కంగనా రనౌత్ ఒదిగిపోయినట్లు ఆమె లుక్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రానికి కంగనాయే దర్శకత్వం వహించి, ఓ నిర్మాతగా వ్యవహరించడం విశేషం. ఈ చిత్రాన్ని నవంబర్ 24న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.

రాజకీయ వ్యూహం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని సంఘటనలతో 'వ్యూహం', 'శపథం' చిత్రాలను తెరకెక్కిస్తున్నట్లుగా రామ్‌గోపాల్ వర్మ వెల్లడించిన సంగతి తెలిసిందే. శనివారం 'వ్యూహం' టీజర్‌ను విడుదల చేశారు. ఆర్జీవీ డెన్, రామదూత క్రియేషన్స్ పతాకాలపై దాసరి కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం జరిగిన పరిణామాలు, ఆ సమయంలో వైఎస్సార్ ఫ్యామిలీ ఎదుర్కొన్న సంఘర్షణ, ముఖ్యంగా జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన, ఆయన్ను అణచివేయాలని ప్రత్యర్థి పార్టీలు ఎలా కుట్ర పన్నాయి? అనే అంశాలతో ఈ చిత్రం ఉంటుందన్నట్లు 'వ్యూహం' టీజర్‌లో చూపించారు రామ్‌గోపాల్ వర్మ. అలాగే టీజర్ చివర్లో 'అలా ఆలోచించడానికి చంద్రబాబుని కాదు' అనే డైలాగ్ కూడా ఉంది. 2009 నుంచి 2014 వరకూ వైఎస్ జగన్ జీవితంలో జరిగిన ఘటనలతో 'వ్యూహం' ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమాలో జగన్ పాత్రలో అజ్మల్ నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీపై త్వరలో ఓ స్పష్టత రానుంది.



● అజ్మల్

ఆరు నెలలు నిద్రపోతే...



● నవమి, ఆనంద వర్ధన్, రోష్ని

'ప్రేమించుకుందాం..రా', 'సూర్య వంశం', 'మనసంతా నువ్వే' వంటి సినిమాల్లో బాలనటుడిగా కనిపించిన ఆనంద్ వర్ధన్ హీరోగా నటించిన తొలి చిత్రానికి 'నిదురించు జహాపన' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రోష్ని సాహోత, నవమి గయాక్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో జి. వంశీకృష్ణ వర్మ, సామ్ జీ నిర్మించిన ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ– ''సినిమా నా ప్రాణం. మిమ్మల్ని (ప్రేక్షకులు) ఎంటర్‌టైన్ చేయడానికి జీవితాంతం సినిమాల్లోనే ఉంటాను'' అన్నారు. ''ఈ సినిమా కథలో హీరో ఆరు నెలలు కంటిన్యూస్‌గా నిద్రపోతూనే ఉంటాడు. అందుకే ఆ టైటిల్ పెట్టాం. సముద్రం నేపథ్యంలో సాగే కథ ఇది'' అన్నారు ప్రసన్న కుమార్. నటీమణులు రోష్ని సాహోత, నవమి గయాక్, మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడారు.

ఇన్వెస్టిగేషన్ ఆన్



● సురేష్‌బాబు, శ్రీధర్ స్వరాఘవ్

రుహాణీ శర్మ పోలీసాఫీసర్‌గా నటించిన చిత్రం 'హర్'. శ్రీధర్ స్వరాఘవ్ దర్శకత్వంలో రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించారు. సురేష్ ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా ఈ సినిమా జూలై 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి. సురేష్‌బాబు ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోలీస్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం ఇది. వికాస్ వశిష్ఠ, ప్రదీప్ రుద్ర, జీవన్ కుమార్, అభిగ్న్య, సంజయ్ స్వరూప్, బెనర్జీ, రవివర్మ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: పవన్.

ఎమోషనల్ బ్రీత్

దివంగత ప్రముఖ నటులు ఎన్టీఆర్ మనవడు, నందమూరి జయకృష్ణ పెద్ద కుమారుడు చైతన్య కృష్ణ హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'బ్రీత్'. వైదిక హీరోయిన్‌గా నటించారు. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ నిర్మించిన ఈ సినిమా టీజర్ విడుదలైంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో చైతన్యకృష్ణ మాట్లాడుతూ– ''నా తొలి చిత్రానికి వంశీకృష్ణ లాంటి దర్శకులతో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ సినిమాతో నాకు ఆయన బ్రీత్ ఇచ్చారు'' అన్నారు. ''కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సాగే థ్రిల్లర్ ఫిల్మ్ 'బ్రీత్'' అన్నారు వంశీకృష్ణ. ''నాన్నగారి శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశాం. 'బ్రీత్' ఓ ఎమోషనల్ థ్రిల్లర్'' అన్నారు జయకృష్ణ.



● వంశీకృష్ణ, జయకృష్ణ, చైతన్య కృష్ణ

మాఫియా నేపథ్యంలో..

అర్జున్ అంబటి, జెన్నిఫర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. నాగ శివ దర్శకత్వంలో గుడిమిట్ల సువర్ణలత సమర్పణలో గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. పోలీస్ ఇన్వెస్టిగేషన్, మాఫియా అక్రమాలు ప్రధానాంశాలుగా ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ చిత్రానికి సహ–నిర్మాత: గుడిమిట్ల ఈశ్వర్.



● జెన్నిఫర్, అర్జున్

ప్రేమలో కొత్త కోణం



● మిస్తీ, ఆర్యన్

ఆర్యన్ గౌరా, మిస్తీ చక్రవర్తి జంటగా దివ్య భావన దర్శకత్వంలో సుభాష్ కట్టా, చందన కట్టా నిర్మించిన లవ్‌స్టోరీ ఫిల్మ్ 'ఓ సాథియా'. ఈ సినిమాను జూలై 7న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. ''ప్రేమకథల్లో కొత్త కోణం తీసుకుని సరికొత్త ప్రేమకథలా ఈ చిత్రాన్ని తీశాం. మా సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తున్న యూఎఫ్‌వో సంస్థ, తెలుగు రాష్ట్రాల వైస్ ప్రెసిడెంట్ జి. లక్ష్మణ్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విన్నూ.

పెళ్ళిచూపులు

ఆదివారం 25-6-2023

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ట్రాక్టర్‌పై విద్యార్థులు

- బస్సు లేక కష్టాలు



పాఠశాలకు ట్రాక్టర్‌పై వస్తున్న విద్యార్థులు

రాజాపేట: బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు, ట్రాక్టర్లలో పాఠశాలకు చేరుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడ్డి చెర్వు గ్రామానికి చెందిన 40 మందికి పైగా విద్యార్థులు 4 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న ప్రభుత్వ పాఠశాలకు నిత్యం వెళ్లి వస్తారు. గతేడాదిలో యాదగిరిగుట్ట డిపోకు చెందిన బస్సు కొండ్రెడ్డి చెర్వు గ్రామానికి వచ్చేది. ఈ ఏడాది బడులు తీసి 12 రోజులు గడిచినా బస్సు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ భర్త చెరుకు కనకయ్య ట్రాక్టర్‌పై విద్యార్థులను తీసుకొని బడి వద్ద దింపి వెళ్లారు.

కీచక మారుతండ్రికి రెండు జీవిత ఖైదులు

- బాలికపై అత్యాచారం, హత్య కేసులో విధించిన నిజామాబాద్ ప్రత్యేక పోక్సో కోర్టు
- మృతురాలి కుటుంబానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున రూ.5 లక్షల పరిహారానికి సూచన



గోవింద్‌రావు

ఖలీల్‌వాడి: కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హతమార్చిన ఓ మారుతండ్రికి కోర్టు తగిన శిక్ష విధించింది. ఐదేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషిగా తేలుస్తూ రెండు జీవితఖైదులు విధించింది. ఈ మేరకు నిజామాబాద్ ప్రత్యేక పోక్సో కోర్టు ఇన్‌చార్జి సెషన్స్ జడ్జి సునీత కుంచాల శనివారం తీర్పు చెప్పారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్ద ఎక్లారా గ్రామానికి చెందిన దేవకత్తె గోవింద్‌రావు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట హైదరాబాద్ వచ్చాడు. అక్కడ భర్తను విడిచిపెట్టి ఐదేళ్లు, రెండేళ్ల వయసు గల ఇద్దరు కూతుళ్లతో ఉంటున్న ఓ మహిళ పరిచయం కావడంతో ఆమెతో సన్నిహితంగా ఉండేవాడు. ఆ తర్వాత వారు వివాహం చేసుకొని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ) గ్రామంలో ఓ వ్యవసాయదారుని వద్ద జీతానికి పనిచేస్తున్నారు. అయితే గతేడాది పెద్ద బాలిక కాలికి గాయం కావడంతో గోవింద్‌రావు 2022 అక్టోబర్ 20న అదే గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. అనంతరం బాలికను నేరుగా ఇంటికి తీసుకురాకుండా మెంట్రాజ్‌పల్లి వెళ్లే దారిలోని పొలంలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. బాలిక ప్రతిఘటించడంతో తీవ్రంగా గాయపరిచాడు. స్పృహ కోల్పోయిన బాలికను ఇంటికి తీసుకొచ్చాడు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నడుచుకుంటూ వెళ్లిన బాలిక అపస్మారకస్థితిలో ఉండటంతో ఏం జరిగిందో చెప్పాలని బాలిక తల్లి నిలదీసింది. దీంతో గోవింద్‌రావు అసలు విషయం చెప్పడంతో బాలికను తల్లి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, ఆపై అక్కడి నుంచి హైదరాబాద్ నిలోఫర్‌కు తీసుకెళ్లింది. కానీ అప్పటికే బాలిక మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్ ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ముద్దాయి నేరం ఒప్పుకోలు స్వాధీన పంచనామా, సీసీటీవీ ఫుటేజీ, బాలిక పోస్ట్‌మార్టం నివేదిక, ఫోరెన్సిక్ నివేదికలతోపాటు ఇతర సాక్ష్యాలను జతచేసి అభియోగ పత్రాన్ని పోక్సో కోర్టులో సమర్పించారు. న్యాయ విచారణలో 24 మంది సాక్షుల వాంగ్మూలాలు కోర్టు నమోదు చేసింది. వివిధ సెక్షన్ల కింద గోవింద్‌రావుపై నేరం రుజువైనట్లు నిర్ధారిస్తూ అత్యాచారం నేరానికిగాను జీవిత ఖైదు, దాడి చేసి బాధితురాలి మృతికి కారణమైనందున హత్యా నేరానికిగాను మరో జీవితఖైదును జడ్జి విధించారు. రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాలిక కుటుంబానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున రూ. 5 లక్షల పరిహారం అందించాలని సెషన్స్ జడ్జి సునీత తీర్పులో సూచించారు.

సమగ్రాభివృద్ధికి రోల్ మోడల్ తెలంగాణ

- అంబేడ్కర్ వర్సిటీలో తెలంగాణ అభివృద్ధిపై చర్చ
- దక్షిణాది రాష్ట్రాల ఆదాయం ఉత్తరాది రాష్ట్రాలకు: ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

లక్డీకాపూల్ (హైదరాబాద్): సమగ్రాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలిచిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన 'తెలంగాణ ఎదుగుదల కథ–చర్చ'కార్యక్రమానికి వీసీ సీతారామారావు, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి, సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి, ప్యానెల్ సభ్యులు ప్రొఫెసర్ చెన్న బసవయ్య, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఆర్.వి.రమణమూర్తి పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి, వనరుల లభ్యతపై అవగాహన, ఆర్థిక క్రమశిక్షణ, పేదలకు సంక్షేమ పథకాలు అందించడం వంటివి తెలంగాణను దేశంలోనే అగ్ర స్థానంలో నిలిపాయని సీతారామారావు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ...దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తిరిగి వచ్చేది 49% మాత్రమేనని ఇక్కడి ఆదాయాన్ని ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఇది దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరిగితే చట్ట సభల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ సుసాధ్యం చేసింది...

అభివృద్ధి చిన్న రాష్ట్రాలతోనే సాధ్యం అనే వాదనను తెలంగాణ రాష్ట్రం సుసాధ్యం చేసిందని ప్రొఫెసర్ రేవతి పేర్కొన్నారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు గ్రామీణాభివృద్ధికి విరివిగా ఉపయోగపడుతున్నాయన్నారు. మౌలిక వసతుల కల్పన తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేసిందని వివరించారు. చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల నిర్మాణం వంటివి సరికొత్త తెలంగాణను ఆవిష్కరించాయని చెన్న బసవయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు డా.బానోత్‌లాల్, సికా డైరెక్టర్ ప్రొ.పీ. మధు సూదన్ రెడ్డి, డైరెక్టర్ ప్రొ.గుంటి రవి, డీన్‌లు ప్రొ. షకీలా ఖానం, ప్రొ.వడ్డానం శ్రీనివాస్, పరీక్షల నియంత్రన అధికారి డా. పరాంకుశం వెంకటరమణ, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్వాకాలతోనే మలిదశ ఉద్యమం

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



అభివాదం చేస్తున్న చెరుకు సుధాకర్, కోదండరాం, సర్వే సత్యనారాయణ, హనుమంత రావు తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): చంద్రబాబు హయాంలో ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తుంటే కార్మికుల హాహాకారాలనుండి, మావోయిస్టుల నుండి మలిదశ ఉద్యమం ప్రారంభమైందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'ప్రజల త్యాగాలతో తెలంగాణ తెచ్చింది మేమే'అన్న కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, ఉద్యమకారుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతటి పెద్ద పోరాటం తెలంగాణ ఉద్యమమని స్పష్టంచేశారు. మలిదశ ఉద్యమంలోనే 1,200 మందికి పైగా అమరులయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత మాత్రం ప్రజల పాత్ర, వారి భాగస్వామ్యం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ విధానాలను ఎవరు వ్యతిరేకించినా వారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి విజయరామారావు మాట్లాడుతూ.. సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్, తెలంగాణలోని అన్ని పార్టీల ఎంపీలు లేకపోతే కేసీఆర్ ఇంకా 50 ఏళ్లు పోరాడినా తెలంగాణ వచ్చేది కాదన్నారు. కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ.. మంత్రి పదవి రాకపోవడంతో కేసీఆర్ ఆత్మగౌరవ సభ పేరుతో కరీంనగర్‌లో ఒక సభ పెట్టారని, అది విజయవంతం కావడంతో.. దాన్నే ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రకటన చేసేందుకు సోనియాగాంధీని ఒప్పించడంలో తన పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ది కీలకపాత్ర అని వ్యాఖ్యానించడంతో.. అక్కడ ఉన్న ఉద్యమకారులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చింది.. తెచ్చింది అమరులే అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన ప్రసంగం కొనసాగిస్తూ.. సుష్మాస్వరాజ్ తనను పిలిచి మోదీ తెలంగాణ వద్దంటున్నారు కాబట్టి.. తెలంగాణ సాధ్యం కాదన్నారనడంతో మాజీ మంత్రి విజయరామారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పుడు మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయన తెలంగాణను ఎందుకు వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చెరుకు సుధాకర్, పాశం యాదగిరి పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ వాహనానికి పూజలు

యాదగిరిగుట్ట: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కాన్వాయ్‌లోని ఆయన ప్రయాణం చేసే నూతన వాహనానికి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సీఎంవో అధికారులు ల్యాండ్ క్రూయిజర్ వాహనాన్ని ప్రత్యేక ఎస్కార్ట్‌తో తీసుకువచ్చి శివాలయానికి ఉత్తరదిశలో పూజలు చేశారు. కొండపైన పూజలు చేసిన వాహనంలోనే సీఎం కేసీఆర్ ప్రయాణం చేయనున్నట్లు తెలిసింది.



కాన్వాయ్ వాహనానికి పూజలు చేస్తున్న ఆచార్యులు

క్లుప్తంగా...

కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో 'ఎన్‌సీసీ'కి బెస్ట్ అవార్డ్



ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న ఆర్ఎస్ రాజు, సంజయ్

సాక్షి, హైదరాబాద్: మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభకు గానూ 'ఎన్‌సీసీ'గ్రూపు 2022 కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో అవార్డును గెలుచుకుంది. జాతీయ స్థాయిలో ఐసీఏఐ ఆధ్వర్యంలో ప్రతియేటా ఇచ్చే అవార్డుల్లో భాగంగా శుక్రవారం రాత్రి న్యూఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో ఈ అవార్డును ఎన్‌సీసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆర్ఎస్ రాజు, డైరెక్టర్(ప్రాజెక్ట్) సంజయ్, సీఎఫ్ఓ ఎం.శ్రీనివాసరావులు అందుకున్నారు. ఎన్‌సీసీ 2016, 2021లోనూ జాతీయ స్థాయిలో అవార్డులను సొంతం చేసుకుంది.

సోషల్‌సైన్స్‌కు ఇంజినీరింగ్ విద్యార్థుల ఆసక్తి

నేటినుంచి టీఎస్‌సీపీజీఈటీ హాల్‌టికెట్ల జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులు వివిధ సోషల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్నారు. టీఎస్‌సీపీజీఈటీ–2023 ఎంఏ పొలిటికల్ సైన్స్, చరిత్ర, ఎకనామిక్స్, సైకాలజీ తదితర కోర్సులకు అధిక సంఖ్యలో ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీకి 6445, కంప్యూటర్ సైన్స్‌కు 5173, జంతుశాస్త్రానికి 4891, న్యూట్రీషియన్‌కు 2924, ఎంకాంకు 5476 దరఖాస్తులు రాగా.. ఎంఏ పొలిటికల్ సైన్స్‌కు గతంలో కంటే అధికంగా 3252, చరిత్రకు 1659, ఎకనామిక్స్‌కు 1812 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది 67117 దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది 69,498 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ వివరించారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే ప్రవేశ పరీక్షలకు ఆదివారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

మరో రెండు వారాల్లో ఎస్సై ఫలితాలు!

రేపటితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఈనెల 14 నుంచి ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు టీఎస్ఎల్పీఆర్బీ అధికారులు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18 సెంటర్లలో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ఫలితాల వెల్లడిపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. తొలుత సబ్ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టులకు, ఆ తర్వాత నెలరోజుల వ్యవధిలో కానిస్టేబుల్ ఫలితాలను వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా, మరో రెండు వారాల్లో ఎస్సై ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

కూకట్‌పల్లి భూ కబ్జాలు నిరోధించండి

నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కూకట్‌పల్లిలోని పలు సర్వే నంబర్ల పరిధిలో ఆక్రమణల నిరోధానికి చర్యలు తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్, జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట్ డిప్యూటీ కమిషనర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితిపై నివేదిక అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. కూకట్‌పల్లిలోని 912పీ, 913పీ, 941పీ, 944పీ, 945 నుంచి 962, 962పీ పరిధిలో భూ ఆక్రమణలకు సంబంధించి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

రాంజీగోండ్ ట్రైబల్ మ్యూజియంకు రూ.25కోట్లు

పరిపాలన అనుమతులు జారీ చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుడు రాంజీగోండ్ పేరిట ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న గిరిజన మ్యూజియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు విడుదల చేస్తూ శనివారం పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆబిడ్స్‌లో రాంజీగోండ్ ట్రైబల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ మ్యూజియం నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు రాష్ట్రం కేటాయించింది. ఇందులో రూ.15 కోట్లు కేంద్ర ప్రభుత్వ వాటా కాగా, మిగతా రూ.10 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాలుగా గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

కంచర్ల యాదగిరిరెడ్డి

ఆఫీసులో ఎంత కష్టపడ్డా...
శాలరీ పెరిగేది మాత్రం అత్తెసరుగానే..
ఎంత గొడ్డు చాకిరీ చేసినా...
లభించే గుర్తింపు అంతంతే..
వేతనంతో పాటు ఇంకేదైనా అలవెన్స్ రూపంలో నగదు ఇస్తే బాగుంటుంది..
రోజూ ఆఫీసుకు రావాలా? వర్క్ ఫ్రమ్ హోమ్ ఎక్కువ రోజులుంటే బాగుండు..

మీకు ఈ మధ్యకాలంలో ఇలాగే అనిపిస్తోందా? పైన చెప్పుకున్న నాలుగు అంశాల్లో ఏదో ఒకటి మీకు వర్తిస్తుందా? అలాగైతే మీరు ఒంటరి వారేమీ కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు ఇదే విధమైన భావనలతో ఉన్నారు. కోవిడ్ భయం ముగిసి అన్నిరకాల ఉద్యోగులు మళ్లీ పూర్తిస్థాయిలో ఆఫీసులకు వెళ్లాల్సి వస్తున్న ఈ సమయంలో వారి మనోభావాలు తెలుసుకునేందుకు అంతర్జాతీయ సర్వే సంస్థ 'గాలప్'ఓ అధ్యయనం నిర్వహించింది. కంపెనీలు, ఉద్యోగుల మధ్య సంబంధాలేమైనా బలపడ్డాయా? ఉద్యోగుల సంక్షేమానికి ఏం చేస్తున్నారు? పనిచేసే చోట ఒత్తిడి ఏ స్థాయిలో ఉంది? వంటి అనేక అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. వర్క్ ఫ్రమ్ హోమ్ వదిలిపెట్టి ఆఫీసులకు వస్తున్న వారిలో వివిధ కారణాలతో నెలకొన్న ఆందోళన, ఒత్తిడి తగ్గించడంపై కంపెనీలు దృష్టి పెట్టాయని తేలింది. ఉద్యోగుల్లో కోవిడ్ భయాలు ఇంకా కొనసాగుతున్న సమయంలో కంపెనీలు వారిని ఆఫీసులకు రమ్మనడం మాత్రమే కాకుండా, వారి యోగక్షేమాలు కనుక్కునేందుకు, అవసరమైన సాయం చేసేందుకూ ముందుకొచ్చాయని గాలప్ అధ్యయనం పేర్కొంది.

హాయ్.. హలో.. ఎంత మేలో!

పలకరింపులు, వారి అవసరాలు తీర్చడం ఉద్యోగుల్ని ప్రభావితం చేస్తాయంటున్న అధ్యయనం

- కంపెనీలు, ఉద్యోగుల మధ్య సంబంధాలు, ఇతర అంశాలపై 'గాలప్'సర్వే
- కోవిడ్ అనంతర పరిస్థితుల్లో ఉద్యోగుల సంక్షేమంపై కంపెనీల దృష్టి
- ఒత్తిడి, ఆందోళన తగ్గించే కార్యక్రమాలకు ప్రాధాన్యత
- ఇది గత ఏడాది పతాక స్థాయిలో ఉందని స్పష్టం చేసిన స్టడీ
- ఉద్యోగులు సామర్థ్యం ఉన్నా నిరాసక్తంగా వ్యవహరిస్తున్నారని వెల్లడి
- క్వైట్ క్విట్టర్లతో ఏటా దాదాపు 8.8 లక్షల కోట్ల డాలర్ల నష్టం



మూడేళ్ల క్రితం 2020 జనవరిలో మొదలైన కోవిడ్ మహమ్మారి రెండేళ్ల పాటు ప్రపంచాన్ని అట్టుడికించిందంటే అతిశయోక్తి కాదు. ఆఫీసులు మాత్రమే కాదు కరోనాతో సామాన్యుడి జీవితం దాదాపుగా స్తంభించిపోయింది. ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు పరిమితమయ్యారు. అయితే టీకాలు వేయడం మొదలైన తరువాత 2021 ఆఖరుకు పరిస్థితిలో కొంత మెరుగుదల కనిపించి, 2022 మార్చికల్లా పరిస్థితులు సాధారణమయ్యాయి. ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా వర్క్ ఫ్రమ్ హోమ్ తగ్గించే ప్రయత్నాలు మొదలయ్యాయి. అయితే ఉద్యోగుల్లో ఆందోళన

ఉద్యోగుల బాగోగులపై కంపెనీల దృష్టి

మునుపెన్నడూ లేనంత ఉచ్ఛస్థితిలో ఉందని, కోవిడ్ భయాలు తొలగినా ద్రవ్యోల్బణం, అర్థ వ్యవస్థ మందగమనం, భవిష్యత్తుపై చింత వంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయని గాలప్ అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే కంపెనీలు గత ఏడాదిలో ఉద్యోగుల ఆందోళనను, వారిలో ఒత్తిడిని తగ్గించేందుకు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చాయి. కంపెనీలు ఉద్యోగుల బాగోగులు చూసుకునే ప్రయత్నం చేయడం గత ఏడాది పతాక స్థాయిలో ఉన్నట్టు గాలప్ చెబుతోంది. 2009 నుంచి తాము ఈ ఎంప్లాయీ ఎంగేజ్‌మెంట్ సమాచారాన్ని నమోదు చేస్తున్నామని, 2022లో అది రికార్డు స్థాయిలో 23 శాతానికి చేరిందని తెలిపింది. కోవిడ్ ముందునాటి పరిస్థితితో పోలిస్తే భారత్ సహా దక్షిణాసియా దేశాల్లో ఉద్యోగుల బాగోగులు చూసుకునే అంశం 33 శాతానికి చేరింది. (ఉద్యోగులతో సంప్రదింపులు జరపడం ఆధారంగా ఈ అంచనాకొచ్చారు)

కొనసాగుతున్న క్వైట్.. లౌడ్ క్విట్టింగ్..



మీరెలా ఉన్నారని కంపెనీ తరచూ అడుగుతూంటే ఉద్యోగులు సంతోషంగా మరింత కష్టపడతారని అనుకుంటాం కానీ, గాలప్ సర్వే ఫలితాలు దీనికి భిన్నంగానే కనిపించాయి. ఎందుకంటే చాలామంది ఉద్యోగులు క్వైట్ క్విట్టింగ్... అంటే ఆఫీసుకు రావడం.. అప్పగించిన పనిని పూర్తి చేయడం. ఎప్పుడు టైమ్ అవుతుందా.. అని కాచుకు కూర్చొని ఇంటికెళ్లిపోవడం చేస్తున్నారని సర్వే తెలిపింది. వీరు తాము పనిచేస్తున్న కంపెనీతో ఎలాంటి మానసికమైన సంబంధాన్ని కూడా కలిగిలేరని తెలిపింది. నామ్ కే వాస్తే పని మాత్రం చేస్తున్నారు. అంతే. ఇలా క్వైట్ క్విట్టింగ్ చేస్తున్న ఉద్యోగులు ఎక్కువగా ఉండగా.. కొంతమంది లౌడ్ క్విట్టింగ్‌కు పాల్పడుతున్నారు. అంటే.. తరచూ గ్రూప్ లీడర్లు లేదా సెక్షన్ హెడ్‌లతో విభేదించడం, కంపెనీ ప్రయోజనాలకు భిన్నంగా పనిచేయడం చేస్తున్నారు. తమకు తగ్గ పని చేయనందుకు కంపెనీ పట్టించుకోవడం లేదని వీరు భావిస్తున్నారు.

క్వైట్ క్విట్టర్లు సరిగా పనిచేస్తే..

క్వైట్ క్విట్టర్లు.. తమకు అప్పగించిన పనికి మించి వీసమెత్తు ఎక్కువ చేసేందుకు ఇష్టపడరు. మాకిచ్చే జీతానికి ఈ మాత్రం చేస్తే చాల్లే అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. దీనర్థం.. వారు మరింత ఎక్కువ ఉత్పాదకత సాధించగల సామర్థ్యం ఉన్నవారే. కానీ.. వేతనం, సౌకర్యాలు, నైతిక మద్దతు వంటి అనేక కారణాల వల్ల నిరాసక్తంగా వ్యవహరిస్తున్నారని ఈ సర్వే తేల్చింది. ఒకవేళ వీరు కూడా ఉత్సాహంగా పని చేస్తే... అది ఉత్పాదకతపై ప్రభావం చూపుతుంది. గాలప్ అంచనాల ప్రకారం క్వైట్ క్విట్టర్లు మనసుపెట్టి పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం వల్ల ఏటా దాదాపు 8.8 లక్షల కోట్ల డాలర్ల నష్టం జరుగుతోంది. ఇది ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపుగా తొమ్మిది శాతం.

ఒత్తిడి...పైపైకి!

కోవిడ్ భయాలు తొలగిపోయినప్పటికీ గత ఏడాది ఉద్యోగులు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారని గాలప్ సర్వే తెలిపింది. కోవిడ్ తీవ్రస్థాయిలో ఉన్నప్పటి మాదిరిగానే 2022లోనూ ఉద్యోగుల్లో సుమారు 44 శాతం మంది తాము తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నట్లు ఈ సర్వేలో తెలిపారు. చైనా, అమెరికా, కెనడాల్లో ఇది మరింత తీవ్రంగా ఉన్నట్లు స్పష్టమైంది. తూర్పు ఆసియా ప్రాంతంలో ఆఫీసులకు దూరంగా ఉంటూ పనిచేస్తున్న వారు, యువకులు 60 నుంచి 61 శాతం మంది రోజూ ఒత్తిడికి గురైనట్లు సర్వే వివరించింది. ఈ ఒత్తిడి పనికి సంబంధించింది మాత్రమే కాకుండా.. కుటుంబ ఆరోగ్య సమస్యలు, ద్రవ్యోల్బణం వంటి వాటివల్ల కూడా కావచ్చునని అంచనా. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే. ఉద్యోగుల యోగక్షేమాలు కనుక్కునేందుకు ప్రయత్నించిన కంపెనీల్లో ఈ ఒత్తిడి తక్కువగా ఉండటం!.

ఉద్యోగులకు స్వేచ్ఛ ఇవ్వడమే మంచిది..



కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ మేలా? లేక ఆఫీసుకు రావాలా? ఈ రెండూ కాకుండా హైబ్రిడ్ పద్ధతుల్లో పనిచేయించుకోవాలా? అన్న అంశాలపై ఇప్పటికే చర్చ చాలానే జరిగింది కానీ.. ఈ విషయాల్లో ఉద్యోగులకు స్వేచ్ఛనివ్వడం అన్నింటి కంటే మేలైన పద్ధతని గాలప్ చెబుతోంది. అంతేకాదు... తరచూ మాట్లాడుతుండటం, వారికి అవసరమైన పనులు సులువుగా చేసి పెట్టగలగడం వంటివి ఉద్యోగులకు కంపెనీపై ఉన్న అభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగలవని ఈ సర్వే తెలిపింది. పనిచేసే చోటుకు కాకుండా... పరిస్థితులు, వాతావరణానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించవచ్చునని గాలప్ సూచిస్తోంది.

మెరుగైన ఉద్యోగానికి మంచి సమయం

2022లో కొత్త ఉద్యోగం చూసుకునేందుకు లేదా ఉన్న ఉద్యోగాన్ని వదిలేసి మెరుగైంది చూసుకునేందుకు మంచి సమయం ఇదే అని గాలప్ సర్వేలో పాల్గొన్న వారిలో 53 శాతం మంది అభిప్రాయ పడ్డారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధి కాగా.. 2019 నాటి స్థాయికి దగ్గరగా ఉండటం గమనార్హం. అయితే అమెరికా, కెనడాల్లో మాత్రం ఈ పరిస్థితి లేదని సర్వే తెలిపింది. చేసే ఉద్యోగం పట్ల అసంతృప్తిగా ఉన్న వారు స్వేచ్ఛగా ఉద్యోగాలు వదులుకునే పరిస్థితి 2022లో కనిపించిందని, ఇది కాస్తా ఉద్యోగాల లభ్యతను అధికం చేసిందని గాలప్ విశ్లేషించింది. ఆసక్తికరంగా... సర్వే చేసిన ఉద్యోగుల్లో యాభై శాతం మంది ఉద్యోగం మానేసే ఆలోచన చేశారు. కంపెనీలు ఉద్యోగులను కోల్పోకూడదని అనుకుంటే వారి బాగోగులు మరింత మెరుగ్గా చూసుకోవాల్సిన అవసరముందని గాలప్ తెలిపింది. ఇలా చేసిన కంపెనీల్లో ఉద్యోగం మానేసే ఆలోచన చేసిన వారు గణనీయంగా తక్కువగా ఉండటాన్ని ఇందుకు సాక్ష్యంగా చూపుతోంది.

సమస్య వేతనం ఒక్కటే కాదు...

ఒత్తిడి, పనిచేసే వాతావరణం లేకపోవడం వంటి అనేక కారణాలతో ఉద్యోగాలు మానేయాలని అనుకున్న వారికి గాలప్ ఒక ప్రశ్న వేసింది. ''పరిస్థితులు మెరుగవ్వాలంటే మీ ఆఫీసులో లేదా మీ కంపెనీలో ఏ చర్యలు తీసుకోవాలి?''అన్న ప్రశ్నకు వచ్చిన సమాధానాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. దాదాపు 85 శాతం మంది కేవలం వేతనాలు, ఆర్థిక లాభాలు కాకుండా.. వర్క్/లైఫ్ బ్యాలెన్స్, ఎంగేజ్‌మెంట్ లేదా ఆఫీసు కల్చర్ వంటి విషయాలను ప్రస్తావించారు. మిగిలిన 15 శాతం మంది సమాధానాలు ఏ కోవకూ చెందనివి కావడం గమనార్హం. ఎంగేజ్‌మెంట్ లేదా ఆఫీస్ కల్చర్ వర్గంలో మేనేజర్లు మరీ కఠినంగా ఉండరాదని, స్వేచ్ఛగా మాట్లాడే అవకాశమివ్వాలని కొందరు అభిప్రాయపడ్డారు. సొంతంగా పనిచేసుకునేందుకు అవకాశముండాలని, కొత్త విషయాలు నేర్చుకునే సౌకర్యం, తగిన గౌరవం లభించాలని, ప్రమోషన్లలో అందరికీ సమాన అవకాశాలుండాలని మరికొందరు భావించారు. దాదాపు 28 శాతం మంది వేతనాలు, ఇతర లాభాలను ప్రస్తావిస్తే.. ఆఫీసులో మంచి క్యాంటీన్/కేఫటేరియా ఉండాలని కొందరు, పిల్లల సంరక్షణ ఖర్చుల గురించి కొందరు, కంపెనీ ఫలితాలకు తగ్గట్టుగా ఉద్యోగులందరికీ సమానంగా ప్రతిఫలాలు దక్కాలని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. ఆఫీసు వాళ్లు హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని, భోజన సమయం మరింత పెంచాలని పని మధ్యలో సేద తీరేందుకు తగిన ప్రాంతం లేదని ఇంకొందరు భావించారు.

30 నుంచి పీజీ ప్రవేశపరీక్ష

25 నుంచి అందుబాటులో హాల్‌టికెట్లు



సాక్షి, హైదరాబాద్: స్టేట్ లెవల్ కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజెట్)- 2023 ఈనెల 30 నుంచి జూలై 10వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఎంఏ, ఎమ్మెస్సీ, లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీలతో పాటు పీజీ డిప్లొమా, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్షలను నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 30 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 45 సబ్జెక్టులకుగాను ప్రతిరోజు మూడు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి ఈనెల 25 నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. సీపీజెట్-2023 కోసం ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్టీయూ నుంచి 69,498 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

- అభ్యర్థులు గంటన్నర ముందే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రంలో రిపోర్టు చేయాలి.
- మొదటి సెషన్ ఉదయం 9.30గంటలు, రెండవ సెషన్ మధ్యాహ్నం ఒంటిగంట, మూడో సెషన్ సాయంత్రం 4 గంటల తరువాత అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతించరు.
- పరీక్ష పూర్తయ్యేవరకు హాల్ నుంచి బయటకు వెళ్లడానికి కూడా అనుమతించరు.

28 నుంచి హైటెక్స్‌లో ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

సాక్షి, హైదరాబాద్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఈ నెల 28 నుంచి 30 వరకు హైటెక్స్‌లో ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో-2023 నిర్వహించనున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్ఐఐసీ, కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖల సహకారంతో ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 120 సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తొలి ఏసీ హెల్మెట్ రూపొందించిన జార్ష్ ఇన్నోవేషన్ సంస్థతో పాటు మారిషస్‌కు చెందిన సెట్ పవర్ సెల్యూషన్స్, యూఏఈకి చెందిన రస్ అల్ ఖైమా వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటాయని తెలిపారు. మొక్కజొన్న పిండితో తయారైన సింగిల్ టైమ్ ప్లాస్టిక్‌ను సైతం ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నట్టు వెల్లడించారు.

26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు బంద్: ఏబీవీపీ

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు పూర్తిగా విద్యను రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం చేసినందుకు నిరసనగా ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ కేసులో సెలబ్రిటీలకు నోటీసులు!

కేపీ చౌదరి వ్యవహారంలో విచారించే యోచనలో పోలీసులు

- డ్రగ్స్ పార్టీల వ్యవహారంతో తనకేం సంబంధం లేదన్న అషురెడ్డి

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కేసులో అరెస్టయిన కబాలి తెలుగు నిర్మాత కృష్ణ ప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి).. పలువురు సినీనటులు, క్రీడాకారులు, వైద్యులు, వ్యాపారస్తులకు కొకైన్ సరఫరా చేసినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం ఆయా వర్గాల్లో అలజడి మొదలైంది. కేపీ చౌదరి దందా, డ్రగ్స్ కొన్నవారి జాబితా, బ్యాంకు లావాదేవీలు, ఫోన్ సంభాషణలు, వాట్సాప్ చాటింగ్‌లు, డ్రగ్స్ పార్టీల ఫొటోలను నిందితుడు కేపీ చౌదరి గూగుల్ డ్రైవ్‌లో భద్రపరుచుకోగా.. వాటిని పోలీసులు వెలికితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సదరు సెలబ్రిటీలు, ఇతర వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారించాలని పోలీసులు యోచిస్తున్నారు. ఈనెల 14న కేపీ చౌదరి గోవా నుంచి హైదరాబాద్‌కు 100 గ్రాముల కొకైన్ తీసుకురాగా.. అందులో 12 గ్రాముల కొకైన్‌ను విక్రయించానని పోలీసులకు చెప్పారు. దానిని ఎవరికి అమ్మాడనేది తేల్చడంపై పోలీసులు దృష్టిపెట్టారు. మిగతా 88 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అవన్నీ అవాస్తవాలు: అషురెడ్డి

కేపీ చౌదరి వ్యవహారంపై అషురెడ్డి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. ''కొందరు వ్యక్తులతో నాకు సంబంధాలు ఉన్నాయంటూ వస్తున్న కథనాలు అవాస్తవం. నాపై అలా దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారో అర్థం కావటం లేదు. నా ఫోన్ నంబర్‌ను బహిరంగంగా పోస్ట్ చేయడం కూడా సరికాదు''అని పేర్కొన్నారు. ఓ క్రీడాకారిణి నివాసంలో డ్రగ్స్ పార్టీలు నిర్వహించినట్టుగా పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించగా.. కొద్దిరోజులు అద్దె కోసం కేపీ చౌదరి ఇంటిని అడిగాడని, అంతేతప్ప ఆ ఇంట్లో వారేం చేశారనేది తనకు తెలియదని చెప్పారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం...

హీరో నిఖిల్ సిద్ధార్థ్



నిఖిల్ సిద్ధార్థ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీపీ ఆనంద్. చిత్రంలో ప్రియదర్శి

బంజారాహిల్స్ (హైదరాబాద్): తనను కూడా డ్రగ్స్ తీసుకోవాలని కొందరు చాలాసార్లు అడిగారని, అయితే అలాంటి వాటికి తానెప్పుడూ దూరంగా ఉంటానని హీరో నిఖిల్ సిద్ధార్థ్ స్పష్టం చేశారు. విద్యార్థి దశ ఎంతో అందమైనదని.. మాదక ద్రవ్యాలకు బానిసలై అలాంటి చక్కని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం రాష్ట్ర మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమంలో ఆయన మరో నటుడు ప్రియదర్శితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ చాలా సందర్భాల్లో డ్రగ్స్ విపరీత ధోరణులపై తాను ఆందోళన వ్యక్తం చేయడాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు సరదాగా విందు, వినోదాలకు వెళ్లినా దయచేసి డ్రగ్స్‌కు అలవాటు కావొద్దంటూ సూచించారు. నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ ఒకప్పుడు సిగరెట్ కాల్చేవాడినని, సిగరెట్‌కు బానిస కావద్దనుకున్న వెంటనే మానేశానన్నారు. పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఇటీవలే తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ప్రారంభించామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 11 కోట్ల మంది డ్రగ్స్‌కు బానిసలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, వారిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సీపీ చెప్పారు.

3 గంటల పరీక్ష గంటన్నరకే ముగింపు

బోధన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల ఆందోళన

బోధన్ టౌన్ (బోధన్): నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో బీకాం 6వ సెమిస్టర్ పరీక్ష సమయంలో గందరగోళం నెలకొంది. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పరీక్ష జరగాల్సి ఉండగా, గంటన్నర మాత్రమే రాయించి విద్యార్థులను బయటకు పంపారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. 100 మంది విద్యార్థులు హాజరైన మల్టీ మీడియా సిస్టమ్స్ పరీక్ష నిర్ణీత సమయానికి ప్రారంభమైంది. 9.30 ప్రాంతంలో 'పరీక్ష సమయం గంటన్నర.. 3 గంటలు కాదు' అని పరీక్ష కేంద్రం అబ్జర్వర్‌కు తెలంగాణ యూనివర్సిటీ నుంచి మెసేజ్ వచ్చింది. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ పరీక్ష కేంద్రంలోని ఇన్విజిలేటర్స్‌కు ఆ మెసేజ్‌ను పంపించారు. అయితే.. మరికొద్ది సమయానికే '3 గంటలు పరీక్ష నిర్వహించాలి' అని అబ్జర్వర్‌కు మెసేజ్ వచ్చినా చూసుకోలేదు. దీంతో గంటన్నర తర్వాత విద్యార్థుల వద్ద నుంచి పేపర్ తీసుకొని పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపించారు. మిగతా సెంటర్లలో యాథావిధిగా పరీక్ష సాగుతోందని తెలియడంతో బయటకు వచ్చిన విద్యార్థులు ఆందోళనకు దిగారు. స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు చేరుకుని, కళాశాల ప్రిన్సిపాల్ రంగరత్నం, పరీక్షల విభాగం అధికారి రాహుల్‌ను నిలదీశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సముదాయించారు. రెండోసారి వచ్చిన మెసేజ్‌ను చూసుకోకపోవడంతో పొరపాటు జరిగిందన్నారు. యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు శాంతించారు. జరిగిన ఘటనపై రిజిస్ట్రార్‌తో సోమవారం చర్చిస్తామని పరీక్షల నియంత్రణ అధికారి అరుణ తెలిపారు.

పీఈసెట్ ఫలితాలు విడుదల

- ర్యాంకర్లలో ఎస్సీ ఎస్టీ విద్యార్థుల హవా..
- మొత్తంగా 96.50% విద్యార్థులు క్వాలిఫై



పీఈసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తదితరులు

సాక్షి, హైదరాబాద్ : బీపీఈడీ, యూజీ డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీఈసెట్) ఫలితాల్లో 96.50% మంది విద్యార్థులు అర్హత సాధించారు. మాసాబ్ ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శనివారం చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ, శాతవాహనవర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్, కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్‌లు ఈ ఫలితాలను విడుదల చేశారు. బీపీఈడీలో 1,153, డీపీఈడీలో554 మంది విద్యార్థులు అర్హత సాధించారు. పీఈసెట్ ఫలితాలతో పాటు, ర్యాంకుల్లో అత్యధిక ర్యాంకులను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సాధించారు. బీపీఈడీలో మొదటి ర్యాంక్‌ను ఎస్సీ విద్యార్థి గుర్రం దేవ, డీపీఈడీలో మొదటి ర్యాంకును ఇదే సామాజిక వర్గానికి చెందిన ఎన్. ప్రవల్లికలు దక్కించుకున్నారు. బీపీఈడీలో టాప్ 10లో 7 ర్యాంక్‌లు, డీపీఈడీ టాప్ 10 ర్యాంకుల్లో 6 ర్యాంకులను ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు సొంతం చేసుకున్నారు.

టాప్ -5 ర్యాంకర్ల వివరాలు..

బీపీఈడీలో : గుర్రం దేవా, కేలావల్ భారతి, బానాల జగదీశ్, బల్లె హరీశ్, గోర్ల లోకేశ్.
డీపీఈడీలో : ఎన్ ప్రవల్లిక, వూకే సంధ్య, సీహెచ్ కీర్తన, ఏ సుష్మిత, జాటోతు ఐశ్వర్య

ఫలితాల వివరాలు

	బీపీఈడీ	డీపీఈడీ
దరఖాస్తు చేసిన వారు	1,852	1,013
పరీక్షకు హాజరైనవారు	1,193	576
క్వాలిఫై అయిన వారు	1,153	554

గ్రూప్-4 అభ్యర్థులకు బయోమెట్రిక్ తప్పనిసరి

- టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: జూలై 1వ తేదీన జరిగే గ్రూప్–4 పరీక్షకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 9.51లక్షల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఉండడంతో ప్రతి అభ్యర్థికి వేలిముద్రలతో కూడిన హాజరు (బయోమెట్రిక్) విధానాన్ని టీఎస్‌పీఎస్సీ అమలు చేయనుంది. వేలిముద్రతో పాటు అభ్యర్థి నామినల్ రోల్స్‌లో కూడా సంతకం చేయాలి. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు జారీ చేసిన హాల్‌టికెట్లలో స్పష్టం చేసింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రావడం మొదలు పరీక్ష రాయడానికి సంబంధించి అన్ని రకాల నిబంధనలను హాల్‌టికెట్‌లో వివరంగా తెలిపింది. గ్రూప్-4 ఉద్యోగాలకు రెండు పరీక్షలను ఒకేరోజులో నిర్వహిస్తోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-1 (జనరల్ స్టడీస్), మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 (సెక్రటేరియల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయానికి పదిహేను నిమిషాల ముందే గేట్లు మూసివేస్తారు. పరీక్ష సమయాన్ని ఎప్పటికప్పుడు అభ్యర్థులకు తెలిపేందుకు కేంద్రంలో ప్రతి అరగంటకోసారి బెల్ మోగిస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.